ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులు
ఆదివాసీలతోనే భర్తీ
- 20న జరిగే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలి
- ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ డిమాండ్
2

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 283 | విజయవాడ, శనివారం 17 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Saturday 17 May 2025 | Rs



నేటినుంచి ఐపిఎల్ పునః ప్రారంభం
- చిన్నస్వామి స్టేడియంలో బెంగళూరు-కోల్‌కతా మ్యాచ్
- పొంచివున్న వర్షం ముప్పు
8

సైన్యానికి అవమానం

బిజెపి నేతల విద్వేష వ్యాఖ్యలు
దేశం, సైనికులు మోడీ పాదాలకు మొక్కాలన్న మధ్యప్రదేశ్ ఉపముఖ్యమంత్రి

- కల్నల్ ఖురేషీపై ఇదివరకే విషం చిమ్మిన మరో మంత్రి
- సామాజిక మాధ్యమాల్లోనూ రెచ్చిపోతున్న సంఘ్ శక్తులు
- బిజెపి నేతల తీరుపై ప్రతిపక్షాల ఆగ్రహం



బిజెపి నేతల వ్యాఖ్యలకు నిరసనగా గ్వాలియర్‌లో ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు (వార్త7లో)
(ఇన్‌సెట్‌లో) మధ్య ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి జగదీష్

భోపాల్ : 'దేశమే ముందు..' అంటూ నిత్యం నీతులు చెప్పే బిజెపి నేతలు, సంఘ్ పరివార్ మూకలు 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంగా దేశానికంటే తామే గొప్పవారమన్న రీతిలో రెచ్చిపోతున్నారు. సరిహద్దులో ప్రాణాలొడ్డి దేశానికి రక్షణ కల్పిస్తున్న సైన్యంపైనా అవమానకరపు వ్యాఖ్యలు చేస్తున్నారు. తమ అధినేత మోడీ ముందు అందరూ బలాదూర్ అంటూ, దేశమైనా, సైన్యమైనా మోడీ పాదాలకు మొక్కాల్సిందేనంటూ మధ్య ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి జగదీష్ 'తిరంగా ర్యాలీ'లో ఊగిపోయారు. అనేక మంది కాషాయ నేతల తీరు ఇలానే ఉంది. సరిహద్దులో సైనిక విజయగీతాన్ని బిజెపి గెలుపుగా చెప్పుకునేందుకు వెంపర్లాడుతున్నారు. మధ్యప్రదేశ్‌కే చెందిన మరో మంత్రి ఇదివరకే కల్నల్ సోఫియా ఖరేషిని 'ఉగ్రవాదుల సోదరి' అంటూ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దేశ సర్వోన్నత న్యాయస్థానమే అతడికి మొట్టికాయలు వేసింది. అయినా కూడా బిజెపి నేతల తీరు మారడం లేదు. సామాజిక మాధ్యమాల్లో మరింతగా రెచ్చిపోతున్నారు. మత విద్వేష జాడ్యాన్ని కుమ్మరిస్తూ ప్రజల మధ్య చిచ్చురాజేసే యత్నాలు చేస్తున్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవం సందర్భంగా బిజెపి చేపడుతున్న 'తిరంగా యాత్రలు' ఇలాంటి విద్వేష సృష్టికి వేదిక కావడం ఆందోళనకరం.

మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జగదీష్ దేవ్డా శుక్రవారం జబల్పూర్‌లో పౌర రక్షణ వలంటీర్ల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్‌కు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం వహించి, ఉగ్రవాదులకు సరైన జవాబు ఇచ్చినందుకు దేశం, సైనిక బలగాలు మోడీ పాదాల వద్ద మోకరిల్లాయని వ్యాఖ్యానించారు. ఆయన ప్రసంగానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. "ప్రధానికి మనం కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఈనాడు యావత్ దేశం, దేశ సాయుధ బలగాలు, సైనికులు అందరూ ప్రధాని నరేంద్రమోడీ పాదాలకు మొక్కుతున్నారు. ఉగ్రవాదులకు ఆయన ఇచ్చిన సమాధానాన్ని ఎంత ప్రశంసించినా సరిపోదు," అని దేవ్డా వ్యాఖ్యానించారు.

మంత్రుల వ్యాఖ్యలపై ప్రతిపక్షాల ఆగ్రహం

'ఉగ్రవాదుల సోదరి' అంటూ ఈ నెల 12న కల్నల్ సోఫియా పట్ల అవమానకర వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్‌షాపై ఇప్పటికే సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. విజయ్‌షాను తొలగించాలంటూ దేశంలో పలుచోట్ల నిరసనలు జరుగుతున్నాయి. తాజాగా అదే రాష్ట్రానికి చెందిన డిప్యూటీ సిఎం చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. 'ఆ ఇద్దరు మంత్రులపై చర్యలు తీసుకోవడానికి బదులుగా బిజెపి వారికి రక్షణ కల్పిస్తోంది. ఇదంతాచూస్తుంటే బిజెపి అగ్ర నాయకత్వం సైన్యాన్ని అవమానించే కార్యక్రమం ప్రారంభించినట్లు కనిపిస్తోంది." అని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితూ పట్వారి విమర్శించారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ నిరసనలు చేపడుతుందని ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రతినిధి సుప్రియ శ్రినాటె మాట్లాడుతూ సిగ్గులేకుండా దారుణంగా వ్యాఖ్యలు చేసిన ఉప ముఖ్యమంత్రిని పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. దేవ్డాను ప్రధాని మోడీ తొలగించాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు. ప్రధాని అలా చేయలేకపోతే, ఆయన అనుమతితోనే ఇదంతా జరిగిందని, అందుకే కాపాడుతున్నారని అనుకోవాల్సి వస్తుందని అన్నారు.

దేవ్డా వివరణ

తన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా వివాదం రేగడంతో దేవ్డా వివరణ ఇచ్చుకున్నారు. తన ప్రకటనలను కాంగ్రెస్ వక్రీకరిస్తోందన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఉగ్రవాదులపై మన సైన్యం ప్రదర్శించిన ధైర్య సాహసాలు, తెగువను ఎంత పొగిడినా తక్కువేనని, సైన్యాన్ని ప్రశంసించాలన్నదే తన ఉద్దేశమని అన్నారు.



విజయవాడ లో నిర్వహించిన తిరంగ ర్యాలీలో ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరి తదితరులు

జవాన్లకు సెల్యూట్

- తిరంగ యాత్రలో చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ గౌరవం, బలం, బలగం సాయుధ బలగాలే అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా కేంద్రప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు విజయవాడలో శుక్రవారం తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్‌సర్కిల్ వరకు సాగిన ఈ ర్యాలీలో చంద్రబాబుతో పాటు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్రఅధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఉగ్రవాదులు ఈ దేశంపై కన్నెత్తి చూడకుండా రక్షణ దళాలు పోరాడాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు..ఉగ్రవాదంపై సైనిక దళాలు పోరాటం చేస్తున్నాయంటూ సెల్యూట్ చేశారు. అత్యంత కఠినమైన పరిస్థితుల్లో దేశాన్ని జవాన్లు కాపాడుతున్నారని చెప్పారు. పహల్గాం ఘటన గుర్తుకురాగానే అందరిలో పౌరుషం, ఉద్వేగం వస్తుందన్నారు. రక్షణలోనే కాదని, ఆర్థిక శక్తిగానూ దేశం ఎదుగుతోందన్నారు. దేశభద్రత, సమగ్రత కోసం మనమంతా ఏకతాటిపై నడవాలని కోరారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీనాయక్ స్ఫూర్తితో ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య మన ప్రాంతం వారే కావడం అందరికీ గర్వకారణమని తెలిపారు.మన సైనికులను చూసి రాష్ట్రమే కాదు దేశమంతా గర్విస్తోందని, మనం అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ పాకిస్తాన్ పదేపదే మనదేశంలో ఉగ్రవాదాన్ని రెచ్చగొడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారధి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లాశ్రీనివాస్, ఎంపి కేశినేని చిన్ని, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్
- మంత్రి లోకేశ్
5

20 నుంచి స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు
3

ఉపాధ్యాయుల ఉద్యమ బాట

21న డిఇఓ కార్యాలయాలు, 23న విద్యాశాఖ డైరెక్టరేట్ ముట్టడి

- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రకటన
- డైరెక్టర్‌తో చర్చల బహిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యలో సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరచడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 21న ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇఓ) కార్యాలయాలను ముట్టడిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రకటించింది. ఈ మేరకు 16 డిమాండ్ల నోటీస్‌ను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఐక్యవేదిక నాయకులు శుక్రవారం అందించారు. ఆందోళన కొనసాగింపుగా 23న విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ప్రతి శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించే చర్చలను కూడా సంఘాలు బహిష్కరించాయి. విద్యాశాఖ మంత్రి సమక్షంలోనే ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశాయి. అనంతరం ఐక్యవేదిక సంఘాల నాయకులు ఎన్ వెంకటేశ్వర్లు (యుటిఎఫ్), ఎల్ సాయిశ్రీనివాస్ (ఎస్టియు), సిహెచ్ మంజుల (ఎపిటిఎఫ్ 257), జి హృదయరాజు (ఎపిటిఎఫ్), ఎఎం గిరిప్రసాద్ (పిఆర్‌టియు), ఎస్ బాలాజీ (ఎపియుఎస్), ప్రకాష్‌రావు (ఆప్టా), అశోక్‌కుమార్ రెడ్డి (వైఎస్‌ఆర్‌టిఎ), వెంకటరమణ (ఎపిహెచ్‌ఎంఎ) ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. గత 30 వారాలుగా చర్చల్లో ఉపాధ్యాయ సంఘాలు లేవనెత్తుతున్న ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా జివోలను విడుదల చేయడాన్ని ఖండించారు. ప్రపంచ బ్యాంక్ ఆదేశిత విధానాల్లో భాగంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన సాల్ట్ పథకాన్ని యధాతథంగా ప్రస్తుత ప్రభుత్వం కూడా అమలు చేయడం వల్లే ప్రభుత్వ పాఠశాల విద్యారంగం విచ్ఛిన్నమవుతుందన్న ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలు బలహీనపడి సుమారు 3 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని చెప్పి, ప్రస్తుతం మరలా అదేవిధానాలను అమలు చేయడం దారుణమని విమర్శించారు. గత ప్రభుత్వం 6 రకాల పాఠశాలలను ప్రవేశపెడితే కూటమి ప్రభుత్వం 9 రకాలు ప్రతిపాదించడం ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని పేర్కొన్నారు. తెలుగుభాష కలిగిన రాష్ట్రంలో తెలుగు మీడియం లేకుండా ఇంగ్లీష్ మీడియం మాత్రమే ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో సోదర సంఘాలను కలుపుకుని పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.

సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి లేఖపై
రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ప్రకటించాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సుప్రీం కోర్టుకు రాష్ట్రపతి లేఖ రాయడంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగంలోని ఫెడరల్ స్వభావాన్ని పరిరక్షిస్తూ రాష్ట్రాల హక్కులను కాపాడేలా సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును నిర్వీర్యం చేసేందుకు రాష్ట్రపతి ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రశ్నలు సంధింపజేయడం గర్హనీయమని తెలిపారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలపై గవర్నర్ దొడ్డిదారిన పెత్తనం చేసే విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామికశక్తులన్నీ ఐక్యంగా నిలవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరుతోందని పేర్కొన్నారు. రాష్ట్రాల హక్కుల కోసం తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో ఏర్పడిన తెలుగుదేశం పార్టీ రాష్ట్రపతి సంధించిన ప్రశ్నలపై తన వైఖరి తెలియజేయాలని కోరారు.

తమిళనాడు శాసనసభ ఆమోదించిన పది బిల్లులకు సమ్మతి తెలపకుండా ఆ రాష్ట్ర గవర్నర్ ఎ.ఎన్.రవి వ్యవహరించిన రాజ్యాంగ వ్యతిరేక వైఖరికి అడ్డుకట్ట వేస్తూ సుప్రీం కోర్టు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని, ఫెడరల్ స్వభావాన్ని రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాపాడే విషయంలో ఆ తీర్పు ఆదర్శవంతమైందని తెలిపారు. దానిని చిత్తశుద్ధితో అమలు చేసి రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాల్సింది పోయి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా సుప్రీం కోర్టుకి ప్రశ్నలు సంధింపజేయడం ప్రజాస్వామ్యస్ఫూర్తికే విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను బలహీనపర్చే ప్రయత్నమేగాక సుప్రీం కోర్ట అధికారాన్ని సవాలుచేసే ఈ వైఖరిని కేంద్రం విడనాడాలని సూచించారు. ప్రజలచే ఎన్నికైన శాసనసభలు, పార్లమెంటు ఆమోదించిన బిల్లులకు నిర్దిష్ట సమయంలో సమ్మతినివ్వడం లేదా ఏదైనా వివరణ అవసరమైతే అది కూడా వెంటనే చేపట్టడం రాజ్యాంగాధినేతలుగా రాష్ట్రపతి, గవర్నర్ల విద్యుక్త ధర్మమని పేర్కొన్నారు. ఈ ప్రకారం వారు వ్యవహరించాలని, బిల్లుల సమ్మతికి కాల వ్యవధిని నిర్ణయిస్తూ సుప్రీం కోర్టు చెప్పిందని వివరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చేసే వైఖరిని విడనాడి, సుప్రీం కోర్టు తీర్పును తు.చ తప్పకుండా అమలుచేయాలని డిమాండు చేశారు. ఫెడరల్ హక్కులకు భంగం కలిగించే ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులందరూ తమ నిరసన వ్యక్తం చేయాలని శ్రీనివాసరావు కోరారు.

19 నుంచి ఎపిఇఎపి సెట్ పరీక్షలు

ప్రజాశక్తి- కాకినాడ

ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు ఎపిఇఎపి సెట్-2025 ప్రవేశ పరీక్షలను జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు సెట్ కన్వీనర్ వివి.సుబ్బారావు తెలిపారు. కాకినాడలోని జెఎన్‌టియుకె విసి ఛాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొత్తం 3,62,418 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 19, 20 తేదీల్లో వ్యవసాయ, ఫార్మా విద్యార్థులకు, 21 నుంచి 27 వరకూ ఇంజనీరింగ్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా 145 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయని చెప్పారు. తెలంగాణలోని హైదరాబాదులో రెండు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏప్రిల్‌లో నిరుద్యోగ రేటు 5.1 శాతం
- పురుషుల్లో 5.2 శాతం.. మహిళల్లో 5 శాతం
- శ్రామిక శక్తిలో స్త్రీల భాగస్వామ్య రేటు తక్కువే
7

గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడులు
- 120 మంది పాలస్తీనియన్ల మృతి

తక్షణమే పొగాకు కొనుగోళ్లు
- సిఎం ఆదేశం
2

ఉరుములు, మెరుపుల వర్షం

- ఉత్తరాంధ్రలో పలుచోట్ల పిడుగులు
- బాపట్లలో పొంగిన వాగులు
- గుంటూరులో అంధకారం



గుంటూరు జిల్లా బ్రాడీపేటలో తెగిన విద్యుత్‌వైర్లు, నేలవాలిన చెట్టు

ప్రజాశక్తి - యంత్రాంగం

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ప్రకాశం, శ్రీకాకుళం, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో పిడుగులు పడ్డాయి. పిడుగుపాటుకు మత్స్యకారుడు మృతి చెందారు. ప్రకాశంలోని పలు వాగులు పొంగిపొర్లడంతో వాహన రాకపోకలు స్తంభించాయి. గుంటూరులో విద్యుత్‌వైర్లు తెగిపోవడంతో వరకూ నగరం అంధకారమైంది.

ప్రకాశం జిల్లా శింగరాయకొండలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. పాకలలో ఓ ఇంటి మీద పిడుగుపడింది. ఊళ్లపాలెం గ్రామపంచాయతీలోని బిసిన్ పల్లెపాలెంలో పిడుగులు పడడంతో రామాలయం గుడిపైన విగ్రహాలు దెబ్బతిన్నాయి. బాపట్ల జిల్లా ఇంకొల్లులో ఇంకొల్లు-పూసపాడు అడ్డరోడ్డు వద్ద ఉన్న కప్పల వాగు పొంగిపొర్లుతోంది. దీంతో పర్చూరు-నూతలపాడు మీదుగా ఇంకొల్లుకు-అడ్డరోడ్డుకు రాకపోకలు స్తంభించాయి. యద్దనపూడి మండలంలోని గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి పోలూరు వద్ద వాగు పొంగి ప్రవహించడంతో వింజనంపాడు, పోలూరు గ్రామాలకు-మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. కుమ్మరపాలెం, వింజనంపాడు మధ్య తొండి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలీసులు వాహన రాకపోకలను నిలిపివేశారు.

గుంటూరు జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం తెల్లవారుజామున ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ తీగలు తెగిపోవడంతో గుంటూరులో తెల్లవారుజామున రెండు గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గుంటూరులోని కంకరగుంట ఆర్‌యుబి, డొంకరోడ్డు మూడు వంతెనల వద్ద వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

అల్లూరి జిల్లాలోని పాడేరు, అరకులోయ, డుంబ్రిగుడ ప్రాంతాల్లో జోరు వాన మిగతా 7లో

ఇకపై వాట్సాప్‌లో సదరం స్లాట్ బుకింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వికలాంగులకు సదరం సర్టిఫికెట్ల మంజూరును మరింత సరళతరం చేసేందుకు మనమిత్రా వాట్సాప్ గవర్నెన్స్‌లో స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను వికలాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయులు ఆదేశించారు. సదరం స్లాట్ బుకింగ్ సేవలు ఇకపై వాట్సాప్‌లో కూడా పొందే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర సచివాలయం లో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. వికలాంగులకు గుర్తింపు కార్డులు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సదరం స్లాట్ బుక్ చేసుకున్న రోజు నుంచి నెల రోజుల లోపు సదరం సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సుదూర ప్రాంతాలు, గిరిజన తండాల నుంచి వచ్చే వికలాంగులకు ఇబ్బందులు లేకుండా సదరం క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్, వికలాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

లిక్కర్ స్కామ్‌లో
ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అరెస్టు

- సుప్రీం బెయిల్ నిరాకరణ
- చంద్రబాబు కక్ష పూరిత రాజకీయం : బొత్స



ధనుంజయరెడ్డి



కృష్ణమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేపిన లిక్కర్ స్కాము కేసులో మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్‌డి కృష్ణమోహన్‌రెడ్డిని సిట్ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. అంతకుముదు వీరికి బెయిల్ ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారన్న ఆందోళన వ్యక్తం చేయడంతో అటువంటి చర్యలకు పాల్పడకుండా విచారణ చేయాలని పోలీసులను స్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఈ తీర్పు వెలువడిన కాసేపటికి ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి లను అరెస్ట్ చేస్తున్నట్లు సిట్ ప్రకటించింది. మూడు రోజులపాటు సిఐడి కార్యాలయంలో విచారించి, వారి పాత్రకు సంబంధించి సమగ్ర ఆధారాలు సేకరించిన తరువాతే అరెస్ట్ చేసినట్లు సిట్ తెలిపింది. ఈ కేసులో ధనుంజయరెడ్డి ఎ31, కృష్ణమోహన్‌రెడ్డి గా ఉన్నారు. ఎ33 గోవిందప్ప బాలాజీని రెండు రోజుల క్రితం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. బాలజీ భారతీ సిమెంట్స్ ఛార్టర్డ్ ఎకౌంటెంట్‌గానూ ఉన్నారు. రూ.18 వేల కోట్ల లిక్కర్ స్కాము జరిగిందని గతంలో కూటమి ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్న సమయంలో మాజీ ఎంపి విజయసాయిరెడ్డి, రాజ్ కేసిరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఆయనిచ్చిన సమాచారంతో మరికొంతమందిని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఇదే కేసులో నిందితులుగా పేర్కొన్న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి వద్దే కీలక సమాచారం ఉందని, లిక్కర్ వ్యవహారం మొత్తాన్ని వారిద్దరే నడిపించారని విచారణలో విజయసాయిరెడ్డి తెలిపారు.. దీంతో సిట్ అధికారులు హైదరాబాద్ వెళ్లి వారిద్దరికీ నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేకపోవడంతో ఇంట్లో సభ్యులకు ఇచ్చి వచ్చారు. అనంతరం వారిద్దరూ బెయిల్ కోసం తొలుత ఎపి హైకోర్టును ఆశ్రయించగా బెయిల్‌కు మిగతా 7లో


టిటిడి అదనపు ఈవోకు ఆభరణాలు అందిస్తున్న దాతలు ,

శ్రీవారికి బంగారు కఠి, వరద హస్తాలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల
తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారికి శుక్రవారం భారీ బంగారు కానుక విరాళంగా అందింది. కోల్‌కత్తాకు చెందిన సంజీవ్ గోయెంకా రూ.3.63 కోట్లు విలువైన 5.267 కేజీల బంగారంతో వజ్రాలు, రత్నాలతో పొదిగిన కఠి, వరద హస్తాలను చేయించి స్వామివారికి సమర్పించారు. ఈ మేరకు తిరుమలలోని రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరికి ఆభరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, బొక్కసం ఇన్‌ఛార్జ్ గురురాజ స్వామి పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

ప్రత్యేకాభివృద్ధికి రూ.148 కోట్లు

- ఒక్కో త్రైమాసికానికి రూ.37 కోట్ల వ్యయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
జిల్లాల్లో ప్రత్యేకాభివృద్ధి కార్యక్రమాలకు రూ.148 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ నిధులను జిల్లాల కలెక్టర్లకు విడుదల చేస్తూ ప్రణాళికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను త్రైమాసికాల వారీ ఎంత ఖర్చు చేయాలన్నది కూడా ప్రణాళికశాఖ స్పష్టం చేసింది. మూడు పద్దుల ద్వారా ఇస్తున్న నిధులను ఒక్కో త్రైమాసికానికి రూ.37.05 కోట్లు చొప్పున ఖర్చు చేయాలని నిర్దేశించింది. ఈ వ్యయానికి సంబంధించి అన్ని జిల్లాల కలెక్టర్లకు పరిపాలనా ఆమోదాన్ని కూడా అధికారులు ఇచ్చారు. ఎప్పటికప్పుడు ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నిధులను ఖర్చు చేయాలని కలెక్టర్లకు నిర్దేశించారు. అలాగే ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ద్వారా నిధుల వ్యయంపై ఆడిట్ కూడా నిర్వహించాలని స్పష్టం చేశారు.

లెక్చరర్ పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్, టిటిడి డిగ్రీ, ఓరియేంటల్ కళాశాలల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకి సంబంధించిన పరీక్షలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) వాయిదా వేసింది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి పి రాజబాబు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 16 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్లు వెల్లడించారు. పరిపాలనా కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్ష వాయిదా

ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించనున్న డిపార్ట్‌మెంటల్ (శాఖాపరమైన) పరీక్షను కూడా ఎపిపిఎస్‌సి వాయిదా వేసింది. జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించాల్సిన పరీక్షను పరిపాలనా కారణాల వల్ల వాయిదా వేసింది.

జగన్‌కు ధరల విధానం ఏం తెలుసు?

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఉల్లి గడ్డకు, ఆలు గడ్డకు తేడా తెలియని జగన్‌కు వ్యవసాయ ధరల విధానం ఏం తెలుసు? అని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు విమర్శించారు. మద్యం కుంభకోణంలో తాడేపల్లి ప్యాలెస్ పెద్దలపై వస్తున్న ఆరోపణలను దారి మళ్లించేందుకు పంటలకు గిట్టుబాటు ధర లేదని, రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. జాతీయంగా, అంతర్జాతీయంగా పొగాకు, మిర్చి, కోకో ధరలు తగ్గినప్పటికీ రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు.
పొగాకును క్వింటా కనీసం రూ.12,500 కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. పొగాకు రైతులకు అండగా కొనుగోళ్లను రోజువారీ పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. కోకో గింజలను కిలో రూ.500లకు కొనుగోలు చేయాలని మాండలీస్‌తో పాటు అన్ని సంస్థలకూ ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు.

ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులను ఆదివాసీలతోనే భర్తీ చేయాలి

- 20న జరిగే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలి
- ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ డిమాండ్


రాష్ట్ర స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి జిల్లా)
మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులను స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలని, ఈ నెల 20న జరిగే కేబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అందుకు సానుకూలంగా నిర్ణయం చేయాలని ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అల్లూరి జిల్లా పాడేరులోని మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ రాష్ట్ర స్థాయి సమావేశం గిరిజన ఉద్యోగుల సంఘం పూర్వ నాయకులు కుడుముల కాంతారావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది.
ఈ సమావేశంలో సాధన కమిటీ నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యోగాలను స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ ఉద్యమం ద్వారానే సాధ్యమైందని అన్నారు. అడ్వకేట్ జనరల్ ఫైనల్ లీగల్ ఒపినీయన్ ఇచ్చినప్పటికీ నూరు శాతం టీచర్ పోస్టుల్లో ఎస్‌టిలకు రిజర్వేషన్‌పై ఉత్తర్వులు జారీ చేయకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. 2025 మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ ఆదివాసీలకు నూరు శాతం టీచర్ పోస్టులు కేటాయిస్తూ ఈ నెల 15వ తేదీ నాటికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం అన్యాయమన్నారు. మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులను తక్షణం మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వల్ల మెగా డిఎస్‌సిలో అదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరిగేలా ఉందన్న ఆందోళన అందరిలో నెలకొందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకుంటే అరకులో రైలు రోకోను నిర్వహించాలని రాష్ట్ర స్థాయి సమావేశం తీర్మానించింది. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ నాయకులు పి.అప్పలనర్స, కె.సురేంద్ర, సమిరెడ్డి మాణిక్యం, కె.కాంతారావు, పి.బాలదేవ్, ధర్మన్న పడాల్, వంతల నాగేశ్వరరావు, భాను, పి.రాధ, రాజ్ కుమార్, చందు, రమేష్, దాస్, సిహెచ్.రాజబాబు, కిముడు కొత్తయ్య, కార్తీక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ అల్లూరి జిల్లా చైర్మన్‌గా కుడుముల కాంతారావు, జిల్లా కన్వీనర్‌గా సాగిన ధర్మాన పడాల్, సాధన కమిటీ మహిళ విభాగం చైర్మన్‌గా కాంగు సుభ శర్మ, అల్లూరి జిల్లా మహిళా కన్వీనర్‌గా కావడం కాసులమ్మ, డిఎస్‌సి అభ్యర్థుల కన్వీనర్‌గా రబ్బా ప్రశాంత్ కుమార్, విద్యార్థి విభాగం కన్వీనర్‌గా కె.రాజశేఖర్, మేధావుల ఫోరం చైర్మన్‌గా వెంకట రమణ, కన్వీనర్‌గా ఆర్.జగన్ మోహన్, సాధన కమిటీ సలహాదారులుగా సమరెడ్డి మాణిక్యం, కిల్లో సురేంద్ర, పి.అప్పలనర్స ఎన్నికయ్యారు.

రాష్ట్రంలో 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధి

- కేంద్ర రైల్వే సహాయక శాఖ మంత్రి సోమన్న

ప్రజాశక్తి-అనంతపురం
అమృత్ పథకంలో భాగంగా రాష్ట్రంలో 73 రైల్వేస్టేషన్లల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు కేంద్ర రైల్వే సహాయక శాఖ మంత్రి సోమన్న తెలిపారు. అనంతపురం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను ఎంపి అంబికా లక్ష్మినారాయణతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు.
అక్కడ జరుగుతున్న పనుల గురించి రైల్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను అనుకున్న సమయంలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో సోమన్న మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించినట్లు చెప్పారు. ఆ నిధులతో ఇప్పటికే పలు రైల్వే స్టేషన్లు ఆధునీకరించబడ్డాయన్నారు. రూ.30 కోట్లతో అనంతపురం రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అనంతపురం ప్రాంతానికి మరిన్ని రైలు సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని అనంత పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ కేంద్ర రైల్వే సహాయ మంత్రిని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యత పాటిస్తూనే పారిశ్రామికాభివృద్ధి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సమ్మిట్‌లో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)
పర్యావరణ సమతుల్యత పాటిస్తూనే పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సిఐఐ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో శుక్రవారం జరిగిన సస్టైనబిలిటీ సమ్మిట్ - 2025కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. క్లీన్ అండ్ గ్రీన్ ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావానికి అడుగులు వేస్తున్నామని, వాతావరణ సమతుల్యతను పాటిస్తూ అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతున్నామని ఉద్ఘాటించారు. అందులో భాగంగానే ఎంఎస్‌ఎంఇ-4.0 పాలసీని రూపొందించామని, ఒన్ ఫ్యామిలీ ఒన్ ఎంటర్‌ప్రెన్యూర్ కాన్సెప్ట్‌కు ప్రాధాన్యతనిస్తూ తగిన సహాయ, సహకారాలు అందిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో గ్రీన్‌ఫీల్డ్ ఎంఎస్‌ఎంఇ పార్కులను నెలకొల్పుతున్నామని తెలిపారు. సోలార్, పంప్డ్ ఎనర్జీ, బయో ఇంధన వనరులతో కూడిన 20 గిగావాట్ల విద్యుత్ ఇంధన వనరుల ఉత్పత్తికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. సర్క్యులర్ ఎకానమీ, సస్టైనబిలిటీ డెవలప్‌మెంట్, పర్యావరణహిత ఉద్దేశాలకు ప్రాధాన్యతనిస్తూ స్వర్ణాంధ్ర - 2047 సాధనకు అవిరళ కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, గ్రీన్‌కో గ్రూప్ చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ డాక్టర్ పరవస్తు రాంబాబు, సిఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ గన్నమనేని మురళీకృష్ణ, వైస్ చైర్మన్ ఎస్.నరేంద్ర కుమార్, విశాఖపట్నం చైర్మన్ డివిఎస్.నారాయణరాజు పాల్గొన్నారు.

తక్షణమే పొగాకు కొనుగోళ్లు

- సిఎం ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రంలో పొగాకు పండించిన రైతు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదని, రేటు తగ్గకుండా వెంటనే
గిట్టుబాటు ధరకు ట్రేడర్లు కొనుగోలు చేసేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. పొగాకు, కోకో, మిర్చి, ధాన్యం కొనుగోళ్లపై ట్రేడర్లతో శుక్రవారం ఉదయం ఉండవల్లి నివాసంలో సిఎం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సీజన్లో బర్లే రకం పొగాకు సాగు తగ్గించేలా చూడాలని సూచించారు. తాను రైతులు పరిశ్రమలు, సంస్థల యజమానులతో స్నేహపూర్వకంగా ఉంటానని, అలా అని రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని,ఈ విషయాన్ని ట్రేడర్లు దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత పొగాకు సంక్షోభాన్ని నివారించాలని హెచ్చరించారు. అధికారులు రైతుల్లో నమ్మకం నింపి ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూడాలని తెలిపారు. హెచ్‌డి బర్లే పొగాకును నాణ్యత ఆధారంగా క్వింటాలుకు రూ.12,500కు కంపెనీ కొనుగోలు చేయాలని, జిపిఐ, ఐటిసి కంపెనీలు తక్షణమే 20 మిలియన్ కిలోలను కొనుగోలు ప్రారంభించాలని సూచించారు. కంట్రోల్ రూము, వాట్సాప్ గ్రూపు ద్వారా రోజువారీ కొనుగోళ్లను పర్యవేక్షించాలని, వ్యవసాయశాఖ ప్రతి రెండు రోజులకు ఒకసారి కొనుగోలు వివరాలను నివేదించాలని తెలిపారు. వచ్చే సాగుసీజన్లో అంతర్జాతీయ డిమాండు, ధరల ఆధారంగా హెచ్‌డి బర్లే సాగు విస్తీర్ణాన్ని నియంత్రించాలని, ఈ రకం సాగువైపు మళ్లకుండా రైతుల్లో అవగాహన పెంచేందుకు జూన్ నుండి సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి స్పష్టంగా పేర్కొన్నారు. పొగాకు ఎక్కడా ఇళ్లలో నిల్వ లేకుండా ఉంచుకోవాలని సూచించారు. కొనుగోళ్లపై సోమవారం నాటికి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే కోకోకు గిట్టుబాటు ధర కల్పించాలని కిలోకు రూ.500 ధర తగ్గకుండా కొనుగోలు చేయాలని అన్నారు. దీనికోసం ఆయిల్‌పామ్ తరహాలో కొత్త విధానం రూపొందించాలని తెలిపారు. గింజల నాణ్యతను పెంచేందుకు సంస్థలు చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యత తక్కువ పేరుతో వ్యాపారులు ధర తగ్గిస్తున్నారని, దీంతో రైతుల్లో ఆందోళన మొదలైందని తెలిపారు. రైతుల వద్ద మిగిలిపోయిన 2000 టన్నుల కోకోను పూర్తిగా కొనుగోలు చేయాలన్నారు.

పొగాకు బోర్డు విఫలం

పొగాకు ధర పతనం కాకుండా చర్యలు తీసుకోవడంలో పొగాకు బోర్డు విఫలం అయిందని, జిపిఐ, ఐటిసి వంటి ట్రేడర్లతో సరైన సమన్వయం లేలదని ముఖ్యమంత్రి అన్నారు. అత్యధిక ధరలు ఆశచూపించి రైతులు పొగాకు సాగు చేసేలా చేస్తున్న కంపెనీలు తీరా పంట చేతికి వచ్చాక ధరలు తగ్గించడం సరికాదని తెలిపారు. కనీస మద్దతు ధర కూడా సంక్షోభాన్ని సృష్టిస్తున్నారని సిఎం తప్పుబట్టారు. ఇక ముందు కంపెనీలతో రైతులు బైబ్యాక్ ఒప్పందం చేసుకోవాలని సూచించారు.

నష్టపోయిన మిర్చి రైతుల జాబితా

వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా మిరప పంటను విక్రయించిన రైతుల జాబితాను సిద్ధం చేయాలని, వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. తక్కువ ధరకు అమ్మడం ద్వారా రైతులు ఎంత నష్టపోయారనే లిస్టు తయారు చేయాలని చెప్పారు. ఈ జాబితాలో దళారులను తొలగించి నిజమైన రైతులను మాత్రమే ఉంచాలని పేర్కొన్నారు. మిర్చి సాగులో పురుగు మందులు తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం సేకరణ

రాష్ట్రంలో ధాన్యం సన్నరకాలు పండించేలా రైతులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. దీనిపై అధికారులు ధాన్యం కొనుగోలు వివరాలు సిఎంకు తెలిపారు. ఇప్పటి వరకూ రబీలో 1,41,144 మంది రైతుల నుండి 17.62 లక్షల టన్నుల ధాన్యం సేకరించామని, వీరికి రూ.3258 కోట్లు జమచేశామని అధికారులు సిఎంకు తెలిపారు. ఖరీఫ్‌లో 5,65,369 మంది రైతుల నుండి 35.95 టన్నుల ధాన్యం సేకరించామని, వారికి రూ.8278 కోట్లు జమచేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

టెన్త్ రీ వెరిఫికేషన్, రీకౌంటింగ్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
పదోతరగతి-2025 రీ వెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు సంబంధించిన ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాలను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కెవి శ్రీనివాసులురెడ్డి శుక్రవారం విడుదల చేశారు. పదోతరగతి ఫలితాలు ప్రకటించిన అనంతరం ఏప్రిల్ 24 నుంచి మే ఒకటి వరకు విద్యార్థులకు రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. 66,421 మంది విద్యార్థులు వెరిఫికేషన్, కౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. వీటిల్లో 47,484 జవాబు పత్రాల ఫలితాలు విడుదల చేశామని ప్రకటించారు. పాఠశాలల లాగిన్‌లో ఈ ఫలితాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు వాటిని విద్యార్థులకు సాఫ్ట్/హార్డ్‌కాపీ రూపంలో అందజేయాలని సూచించారు.

జగన్ అరెస్టే లక్ష్యంగా లిక్కర్ కేసు

- మాజీ మంత్రి పేర్ని నాని విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
లిక్కర్ స్కామ్ పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, జగన్ అరెస్టే లక్ష్యంగా దీన్ని సృష్టించారని మాజీ మంత్రి పేర్ని నాని తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఆధారం కూడా లేకుండా సాక్షుల స్టేట్‌మెంట్లతో కేసు నడిపిస్తున్నారని, స్కిల్ స్కామ్ కేసులో జైలుకు పంపారన్న కక్షతోనే చంద్రబాబు కుట్రను నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఎపి లిక్కర్ స్కామ్ రాజకీయ ప్రేరేపితమని అత్యున్నత న్యాయస్థానం బెయిల్ రిజక్టు ఆర్డర్‌లోనే స్పష్టంగా పేర్కొనడం కూటమి కక్షసాధింపులకు నిదర్శనమని తెలిపారు. కృష్ణమోహన్‌రెడ్డి, ధనంజయరెడ్డి బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన ఆర్డర్‌లో ప్రస్తావించిన అంశాలను చూస్తే ఈ విషయం తేటతెల్లమవు తోందన్నారు. ఇది పూర్తిగా తప్పుడు కేసని అన్నారు. ధనంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి ఇద్దరూ ఎవరికీ లబ్ధి కలిగించాలని సిఫార్సు చేయలేదని అన్నారు. ఈ కేసులో ఆధారాలు లేవని విచారణ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్ తప్పుకున్నారని, అనంతరం అనుకూల అధికారిని తీసుకొచ్చారని పేర్కొన్నారు. భారతీ సిమెంట్స్‌ను అమ్మేశారని, అయినా దానితో సంబంధం ఉందని జగన్‌పై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.
ఇదే అంశంపై వైసిపి లీగల్ సెల్ నాయకులు జల్లా సుదర్శన్‌రెడ్డి కూడా మాట్లాడారు. లిక్కర్ స్కామ్ కేసులేవీ నిలబడవని అన్నారు.

తొలి పూర్తి సేంద్రియ వ్యవసాయ రాష్ట్రంగా సిక్కిం

- గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
దేశంలోనే సిక్కిం అత్యంత పరిశుభ్రమైన ప్రదేశం, తొలి పూర్తి సేంద్రియ వ్యవసాయ రాష్ట్రం అని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా సిక్కిం 50వ అవతరణ దినోత్సవ వేడుకలను రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. సిక్కిం వివిధ ఆచారాలు, మతాలు, వర్గాల సంప్రదాయాల సమ్మేళనంగా పేర్కొన్నారు.
సహజంగా ఏర్పడిన అద్భుతమైన ప్రదేశాలతో పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతుందని తెలిపారు. హిమాలయాలతో చుట్టుముట్టబడి ఉన్న ఈ ప్రదేశం ఉప ఉష్ణమండల వాతావరణానికి ప్రసిద్ధి చెందినట్లు చెప్పారు.
ఈ ఏడాదికి సిక్కిం ఏర్పడి 50 ఏళ్లు పూర్తైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమా చోడెన్ భూటియా, ఎ సంధ్య తదితరులు ప్రసంగించారు. బి విద్యాసాగర్ దేశభక్తి గీతం ఆలపించగా, ఎస్ మాధవ్ వేణుగాన ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ కార్యదర్శి హరి జవహర్‌లాల్, రాజ్‌భవన్ అధికారులు, సిబ్బంది, వివిధ పాఠశాలల్లోని సిక్కిం విద్యార్థులు పాల్గొన్నారు.

20న జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలు

- ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ఈ నెల 20న నిరసన ప్రదర్శనలను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపునిచ్చింది. ఈ మేరకు సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అఖిల భారత ట్రేడ్ యూనియన్‌ల సమ్మెను జులై 9కి వాయిదా వేశారన్నారు. అదే విధంగా ఈ నెల 20న రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలు, పని ప్రదేశాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమితిలోని అన్ని సంఘాలనూ సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వడ్డే కోరారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు

హెచ్‌పిసిఎల్ పైపులైన్ బాధిత రైతుల ధర్నా

- భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలి : సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
విశాఖ నుంచి రాయపూర్ వరకు వేస్తున్న హెచ్‌పిసిఎల్ పైపులైన్లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన శుక్రవారం విజయనగరం జిల్లా కలెక్టరేట్ వద్ద రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ పైపులైను విజయనగరం జిల్లాలో పది మండలాల్లో సుమారు 45 గ్రామాలు గుండా వెళ్తుందని తెలిపారు. 18 మీటర్ల వెడల్పుగల ఈ పైపులైను వల్ల సాగు భూములు, తోటలను రైతులు కోల్పోవల్సి వస్తుందన్నారు. భూమి విలువను రిజిస్ట్రేషన్ వేల్యూ ఆధారంగా లెక్కించి పరిహారం ఇస్తామంటున్నారని, కానీ జిల్లాలో భూమి రిజిస్ట్రేషన్ విలువకు మార్కెట్ విలువకు సుమారుగా నాలుగు నుంచి ఐదు రెట్లు వ్యత్యాసం ఉందని తెలిపారు. జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని రైతుల కోరికకు అనుగుణంగా కంపెనీతో పరిహారం ఇప్పించాలని, లేకుంటే వేరే ప్రత్యామ్నాం ఆలోచించాలని కోరారు. భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని, లేకుంటే రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సేతమాధవన్‌కు, భూసేకరణ అధికారికి వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలం, బి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు లోకవరపు ఆది నారాయణ మూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో విద్యుత్ రంగం కీలకం

- ట్రైనీ ఐఎఎస్‌లతో జెన్‌కో ఎమ్‌డి చక్రధర్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో విద్యుత్ రంగం కీలకపాత్ర పోషిస్తుందని జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్ బాబు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశాలతో ట్రైనీ ఐఎఎస్‌లకు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం విద్యుత్ సౌధలో విద్యుత్ రంగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెన్‌కో, ట్రాన్స్‌కో విభాగాలకు సంబంధించిన జనరేషన్, హైడల్, ట్రాన్స్‌మిషన్, ప్లానింగ్, గ్రిడ్ ఆపరేషన్, ప్రాజెక్టు అమలు, సిస్టం కంట్రోల్, నూతన ఇంధన వనరుల సమన్వయం వంటి విభాగాలపై ఎమ్‌డి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐఎఎస్‌లు సచిన్ రహార్, చిట్టపులి నరేంద్ర పడాల్, పృథ్వీరాజ్ కుమార్ డోనక, ఫరీన్ జాహిద్, మనీష, సందీప్ రఘువంశీ, చిరంజీవి నాగవెంకట సహిత్‌కనాల, ట్రాన్స్‌కో డైరెక్టర్ ఎకెవి భాస్కర్, అదనపు కార్యదర్శి పెద్ది రోజా తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదుల పరిష్కారానికి కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రవాణా, రోడ్లు భవనాల శాఖలో మహిళా ఉద్యోగులకు ఎదురయ్యే లైంగిక వేధింపులకు సంబంధించి అంతర్గత ఫిర్యాదుల పరిష్కారానికి కమిటీని ప్రభుత్వం పునర్నియమించింది. ఈ మేరకు రవాణా, రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉన్న కమిటీలో కొందరు అధికారులు బదిలీ కావడంతో తాజాగా కమిటీని పునర్నియమించాల్సి వచ్చినట్లు పేర్కొన్నారు. కమిటీలో ప్రిసైడింగ్ అధికారిగా సహాయ కార్యదర్శి డి ఇందిరా రాణి, సభ్యులుగా సహాయ కార్యదర్శి పి వీరాంజనేయులు, విభాగాధికారి బి స్వర్ణలత, మెంబర్ కన్వీనర్‌గా విభాగాధికారి పి దుర్గను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీ ఉద్యోగుల నుంచి వచ్చిన లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిటీ మూడేళ్లపాటు కొనసాగనుంది.


రెండో రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నేతలు

షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ చట్టం చేయాలని దీక్షలు

- ఎఐకెఎంఎస్ మద్దతు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం (ఏలూరు జిల్లా)
షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని, గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలని, ఐటిడిఎలో స్పెషల్ డిఎస్‌సి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరు జిల్లా బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండోరోజూ కొనసాగాయి. ఈ దీక్షలకు అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మల సురేష్ మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఏజెన్సీలో ఉన్న చట్టాలను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని, దీంతో గిరిజనులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వెట్టి సుబ్బన్న పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి వినోద్ దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడారు.

ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి

- పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి
- ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఫీజుల కోసం విద్యార్థులపై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు చేస్తున్న ఒత్తిడిని ఆపాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్న కుమార్, ఎ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం చెల్లించని ఫీజులను తాము అధికారంలోకి రాగానే చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం మాయమాటలు చెప్పిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాది గడుస్తున్నా ఎటువంటి ఫీజు బకాయిలు చెల్లించలేదని పేర్కొన్నారు. చదువు తర్వాత ఉద్యోగాల కోసం విద్యార్థులు ప్రయత్నిస్తున్నారని, కళాశాలల యాజమాన్యాలు మాత్రం వారి సర్టిఫికెట్లను అందించడం లేదని తెలిపారు. ఫీజులు చెల్లించే స్తోమత లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.3 వేలకోట్ల ఫీజుల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు చెల్లించే వరకు విద్యార్థుల నుంచి వసూలు చేయొద్దని కళాశాలలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దయెత్తున విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గోపాలమిత్ర వ్యవస్థ పునరుద్ధరణపై కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో గోపాలమిత్ర వ్యవస్థను పునరుద్ధరించే విషయంలో సూచనలు, సలహాల కోసం ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీకి ఎపి లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎపి ఎల్‌డిఎ) ముఖ్య కార్యనిర్వాహణాధికారి చైర్మన్‌గా వ్యవహరించనుండగా, సభ్యులుగా ముగ్గురు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు, ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లు, మరో ఇద్దరు సహాయ డైరెక్టర్లు, ఇద్దరు డిఎల్‌డిఎ కార్యనిర్వాహణాధికారులు, మరో ఇద్దరు మాజీ అధికారులను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీ పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రల మధ్య జాబ్‌చార్ట్ విషయంలోనూ స్పష్టత ఇవ్వాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సాంకేతికతతోనే దేశ ప్రగతి

భూముల డిజిటలైజేషన్ వర్కుషాపు ముగింపు సభలో పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆధునిక సాంకేతిక విధానాలతో దేశ ప్రగతి సాధ్యమవుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. భూముల డిజిటలైజేషన్‌పై గుంటూరు జిల్లాలో శుక్రవారం రెండో రోజు జరిగిన వర్కుషాపులో ఆయన ముగింపు ఉపన్యాసం చేశారు. భూముల రీ సర్వేలో ఎపి రెవెన్యూ శాఖ ముందుందని తెలిపారు. ఈ సర్వేలో గ్రౌండ్ ట్రూథింగ్ నూరు శాతంతో కర్ణాటక ముందుందన్నారు. ఇప్పటి వరకు పరిష్కరించని భూముల వ్యవహారాన్ని అస్సాం ఇప్పుడిప్పుడే పరిష్కరిస్తోందని, 40 సెంటీమీటర్ల నాణ్యత కలిగిన స్పష్టత గల శాటిలైట్ చిత్రాలతో ముందుకు వస్తున్న రాజస్థాన్ ఈ ప్రక్రియను వేగిరపర్చిందన్నారు. పౌర సాధికారత, సమాజ భాగస్వామ్యం కోసం పని చేస్తున్న బీహార్, ఒడిశాను, అత్యంత పారదర్శక భూ రికార్డు వ్యవస్థను అభివృద్ధి చేస్తున్న హర్యానాను, మొదటి రెండవ తాత్కాలిక సర్వేలు పూర్తి చేసిన త్రిపుర రాష్ట్రాన్ని సైతం ఆయన అభినందించారు. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ పట్టణాల్లో రెవెన్యూ రికార్డులు పక్కాగా అమలు చేసేందుకు, భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ జియోస్పాటిల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్షా) కార్యక్రమాన్ని కేంద్రం తీసుకువచ్చిందన్నారు. నక్షా పైలట్ ప్రోగ్రామ్ ద్వారా దేశంలో 152 మున్సిపాల్టీలను ఎంపిక చేయగా అందులో రాష్ట్రంలో కుప్పం మున్సిపాల్టీ, ఒంగోలు, అనంతపురం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కాకినాడ, మంగళగిరి - తాడేపల్లి , ఏలూరు, తిరుపతి నగరపాలక సంస్థలు మొత్తం పది పట్టణాలను కేంద్రం ఎంపిక చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ సెక్రటరీ మనోజ్ జోషి, కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి, కేంద్ర భూ వనరుల శాఖ డైరెక్టర్ శ్యామ్ కుమార్, గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ్ తదితరులు పాల్గొన్నారు.



వర్కుషాపులో మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

కార్యాలయానికి మహానాడు తీర్మానాలు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్ని పార్లమెంట్, నియోజకవర్గాల్లో జరిగే మహానాడులో తీసుకున్న తీర్మానాలను టిడిపి కేంద్ర కార్యాలయానికి పంపించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాలు ప్రకారం ఈ నెల 18, 19, 20 తేదీల్లో నియోజవర్గాల్లో, 22, 23 తేదీల్లో పార్లమెంట్ల వారీ మహానాడు నిర్వహించాలని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నియోజకవర్గ తీర్మానాలను ఈ నెల 21వ తేదీలోపు, పార్లమెంట్ మహానాడు తీర్మానాలను ఈ నెల 24లోపు పంపించాలని కోరారు. కార్యకర్తలు, అభిమానులు, సానుభూతి పరులు, నాయకులు, మహిళలను కార్యక్రమానికి ఆహ్వానించి జయప్రదం చేయాలని కోరారు.

19న శ్రీవారి ఆన్‌లైన్ టికెట్ల ఆగస్టు కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా సంబంధించిన టికెట్లకు ఆగస్టు నెల కోటాను 19న ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్‌లైన్లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం మే 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు మే 21 నుండి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. 22న ఆర్జితసేవా టికెట్లను విడుదల చేయనున్నారు. అదేరోజు వర్చువల్ సేవల కోటా విడుదల కానుంది. 23న అంగప్రదక్షిణం టోకెన్లు, శ్రీవాణి టికెట్ల ఆన్‌లైన్ కోటా విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, విగలాంగుల దర్శన కోటా విడుదల కానుంది. 24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల చేయనుంది. గదుల కోటాను అదేరోజు అందుబాటులో ఆన్‌లైన్‌లో ఉంచుతారు. 29న శ్రీవారి సేవా కోటా విడుదల కానుంది. ఈ మేరకు టిటిడి తెలిపింది.

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీకి 29 వరకు రిమాండ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్ (ఏలూరు జిల్లా)

నకిలీ పట్టాలిచ్చారనే కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి, ఆయన అనుచరుడు రంగాకు శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడు సెకండ్ అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె శ్రావణి ఈ నెల 29 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను విధించారు. ఈ కేసుకు సంబంధించి వంశీ లాయర్ కెవికె విక్రమ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ 2019లో నమోదు చేసిన కేసుకు సంబంధించి 2024లో ఛార్జిషీట్ వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆ కేసులో వంశీ, రంగాల పేర్లు లేవని చెప్పారు. వంశీని కోర్టుకు తీసుకొచ్చిన నేపథ్యంలో నూజివీడు పట్టణ సిఐ పి సత్యశ్రీనివాస్, రూరల్ సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

21 నుంచి యోగా మాసం

- అన్ని గ్రామ, వార్డుల పరిధిలో సాధన
- జూన్ 21న విశాఖలో యోగా డేకు ప్రధాని
- సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యోగాపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకూ యోగా మాసంగా పాటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో చేపట్టే కార్యక్రమ కార్యాచరణపై తాడేపల్లిలోని సిఎం నివాసంలో అధికారులతో ఆయన శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఈ నెల రోజులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా సాధన నిర్వహించాలన్నారు. దీనిలో ప్రైవేటు వ్యక్తులు, శిక్షకులు, యోగా అసోసియేషన్లు, నిపుణులను భాగస్వాములను చేయాలని సూచించారు. విశాఖలో నిర్వహించనున్న యోగా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటారని తెలిపారు. ఈ ఏడాది యోగా దినోత్సవ ఇతివృత్తంగా 'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్' ను తీసుకున్నట్లు చెప్పారు. 'యోగాంధ్ర - 2025' ఇతి వృత్తంగా రాష్ట్రంలో ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. నెల రోజు పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ప్రజలకు యోగాపై శిక్షణ ఇవ్వాలన్నారు. వీరికి ధృవీకరణ పత్రాలు అందించాలని చెప్పారు. యోగా దినోత్సవంలో పాల్గొనే వారి వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేయాలన్నారు. విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. రాష్ట్రంలో యోగా సాధన వ్యాపకంగా మారాలని సూచించారు. ఆర్‌కె బీచ్‌లో ప్రధాని కార్యక్రమం, ప్రజలు పాల్గొనే ప్రాంతాలు, కార్యక్రమ నిర్వహణపై అధికారులు ఈ సందర్భంగా సిఎంకు వివరించారు. ఆర్‌కె బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకూ అన్ని చోట్లా ప్రజలను యోగాసనాలు వేసేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 2.50 లక్షల మంది యోగాలో పాల్గొనేందుకు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకు 68 ప్రాంతాలను గుర్తించామన్నారు. యోగా దినోత్సవాన్ని ప్రకటించి పదేళ్ళు పూర్తయిన సందర్భంగా ప్రధాని పాల్గొనే ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని సిఎం సూచించారు. 5 లక్షల మంది భాగస్వాములు అయ్యేలా ఆర్కె బీచ్ నుంచి శ్రీకాకుళం వరకూ బీచ్ పొడవునా అన్ని అనుకూల ప్రాంతాల్లో ప్రజలను ఆహ్వానించి యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలని చంద్రబాబు ఆదేశించారు.

సబ్జెక్టు టీచర్ల విధానానికి మంగళం

- ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం సబ్జెక్టు టీచర్ల విధానానికి మంగళం పాడిందని, టీచర్లలో అలజడి మొదలైందని వైసిపి ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. అశాస్త్రీయ రేషియోతో 10 వేల ఎస్ఎ పోస్టులను సర్‌ప్లస్‌గా చూపుతున్నారని వివరించారు. గతంలో విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలను కక్షతో నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల టీచర్ల నిష్పత్తిని 1:53గా చూపుతున్నారని, దీన్ని తొలగించి 1:40 నిష్పత్తిగా చూపించాలని, సెకండ్ సెక్షన్ కూడా హైస్కూళ్లకు ఇచ్చి స్కూల్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలని కోరారు. టీచర్ల బదిలీలో నిబంధనలకు నీళ్ల వదిలారని పేర్కొన్నారు.

వీరయ్య చౌదరి కుటుంబాన్ని మోసం చేస్తున్న టిడిపి
మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు

ప్రకాశం జిల్లాలో హత్యకు గురైన వీరయ్యచౌదరి కుటుంబాన్ని టిడిపి మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు తెలిపారు. హత్యకు పాల్పడిన నిందితులను కాపాడేందుకు టిడిపి ప్రయత్నిస్తోందని, ఇది తెలిసి టిడిపి కార్యకర్తలు లోకేష్ ముందు ఆందోళనకు దిగారని అన్నారు. వీరయ్య చౌదరి హత్యను రాజకీయం చేసి వైసిపి మీద నెట్టేయాలని చూశారని విమర్శించారు. పార్టీ కోసం పనిచేసిన వీరయ్య చౌదరి హత్య కేసును నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు.

20 నుంచి స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఈ నెల 20 నుంచి సమ్మెను ప్రారంభిస్తున్నట్టు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తెలిపారు. విశాఖలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి జనవరిలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారని, అప్పట్లో ప్రకటించిన రూ.11440 కోట్ల ప్యాకేజీని అప్పులు తీర్చడానికే ఉపయోగిస్తున్నారని తెలిపారు. నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల పేర్లను బయోమెట్రిక్‌లో తొలగించి గేటు వద్దే నిలిపివేశారన్నారు. ఎనిమిది నెలల నుంచి ఉక్కు కార్మికుల జీతాలలో 25 శాతం మేర కోత విధిస్తున్నారని తెలిపారు. హెచ్‌ఆర్‌ఎ చెల్లించడం లేదని, అదే సమయంలో ఉక్కునగరంలో 16 రెట్లు విద్యుత్ ఛార్జీలు పెంచేశారన్నారు. ప్రయివేటీకరణను ఆపకపోగా ఆర్సెలార్ మిట్టల్‌ను అనకాపల్లి జిల్లాలో ప్రోత్సహించి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మిట్టల్‌కు కట్టబెట్టాలని టిడిపి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలిపారు. దీనిని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ నెల 20 నుంచి ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మెకు, పర్మినెంట్ ఉద్యోగులు ఒక్కరోజు సమ్మెకు దిగుతున్నట్టు వెల్లడించారు. వైజాగ్ స్టీల్ యాజమాన్యం ఈ నెల 13న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, ఎఐటియుసి అనుబంధ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి జె.రామకృష్ణ సహా ఏడుగురికి షోకాజ్ నోటీసులు ఇచ్చిందన్నారు. మరో నలుగురు నాయకులను అక్రమంగా సస్పెన్షన్ చేసిందని, ఈ చర్యలను ఖండిస్తున్నామని తెలిపారు. గత 40 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా నిర్వహించిన 22 సమ్మెలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జయప్రదంగా జరిగాయన్నారు. ప్రతి సమ్మె సందర్భంగా విరామ సమయాల్లో కార్మికుల సమావేశాలు జరిగాయని గుర్తు చేశారు. కానీ ఈ నెల 13న బ్లాస్‌ఫర్నేస్ వద్ద జరిగిన మీటింగ్ ఫొటోలు తీసి 11 మందిపై అక్రమ చర్యలకు యాజమాన్యం పాల్పడిందన్నారు. ఏప్రిల్ 1 నుంచి 1213 మందిని విఆర్ఎస్ పేరుతో తొలగించారన్నారు. ఐదేళ్ల నుంచి నిర్వాసితులతో సహా ఒక్క కార్మికుడినీ రిక్రూట్‌మెంట్ చేయలేదని, దీంతో ఉన్న కార్మికులపై పనిభారం పడిందని తెలిపారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని తెలిపారు. నాలుగేళ్ల నుంచి కార్మికులు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగిస్తున్నారన్నారు. యాజమాన్యం మాత్రం నిరంకుశంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఆ చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 20న విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిని స్తంభింపజేస్తామని హెచ్చరించారు.

సమ్మెను జయప్రదం చేయండి :
ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాలు


ఈ నెల 20న స్టీల్‌ప్లాంట్‌లో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ బిసి గేట్ వద్ద శుక్రవారం వారు ధర్నా నిర్వహించారు. స్టీల్ కార్మికులకు అక్రమంగా ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని, సస్పెన్షన్లు ఎత్తివేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించరాదని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.రామారావు, ఎఐటియుసి నాయకులు డి.ఆదినారాయణ, అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు డివి.రమణారెడ్డి, టి.జగదీష్, జె.రామకృష్ణ, వైటి.దాస్, యు.రామస్వామి పాల్గొన్నారు.

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్ఎ/ఎస్‌జిటి

విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం : ప్రజ్ఞా పరీక్షలు - ఉపయోగాలు



-కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083



ప్రజ్ఞా పరీక్షలు
-ప్రజ్ఞా పరీక్షలు గణించేదే
ప్రజ్ఞ-వెర్నర్

- వ్యక్తుల మానసిక సామర్థ్యాలను మాపనం చేసే పరీక్షలను ప్రజ్ఞాపరీక్షలు అంటారు.
- ప్రతిభావంతులను గుర్తించడానికి ఈ 'ప్రజ్ఞాపరీక్షల'ను ఉపయోగిస్తారు.

ప్రజ్ఞా పరీక్షలు - రకాలు:

1.ఒకేసారి పరీక్షను 'ఎంతమందిపై' ప్రయోగిస్తారు అని ప్రయోజ్యుల సంఖ్య ఆధారంగా వీటిని రెండు రకాలుగా విభజిస్తారు.

1. వ్యక్తిగత పరీక్షలు:

ఒక్కొక్క వ్యక్తిని విడివిడిగా పరీక్షించేవి వ్యక్తిగత పరీక్షలు

ఉదా:

1.బినే సైమన్
2. వెష్లర్ శాబ్దిక ప్రజ్ఞా పరీక్షలు
3. బాటియా ప్రజ్ఞా మాపని
4. నెప్లర్ అశాబ్దిక ప్రజ్ఞా పరీక్షలు

2. సామూహిక పరీక్షలు:

ఒకేసారి ఒకరి కంటే ఎక్కువ మందిని పరీక్షించేవే సామూహిక పరీక్షలు

1. ఆర్మీ ఆల్ఫా
2.ఆర్మీ జనరల్ క్లాసిఫికేషన్
3. ఓటిస్ మానసిక సామర్థ్యాల పరీక్ష
4. ఆర్మీ బీటా
5. రావన్స్ ప్రోగసివ్ మాట్రిసిస్ టెస్ట్
6. గుడ్ ఎనఫ్ డ్రా ఏ పర్సన్ టెస్ట్

2. పరీక్షలలో ఇచ్చే 'ప్రశ్నాంశాలు/విషయం' ఆధారంగా ప్రజ్ఞా పరీక్షలు 2 రకాలు.

1. శాబ్దిక పరీక్షలు:

- శాబ్దిక అంశాల్లో అక్షరాలు, పదాలు, అంకెలు, సంఖ్యలతో ప్రశ్నలను కలిగి వుండేవే శాబ్దిక పరీక్షలు.
- వీటిని అక్షరాస్యుల ప్రజ్ఞను మాపనం చేయడానికి ఉపయోగిస్తారు.

ఉదా :

1. లినే సైమన్ ప్రజ్ఞామాపని
2. వెష్లర్ శాబ్దిక పరీక్షలు
3. ఆర్మీ ఆల్ఫా
4. ఆర్మీ జనరల్ క్లాసిఫికేషన్
5. ఓటిస్ మానసిక సామర్థ్యాల పరీక్ష

2. శాబ్దికేతర అశాబ్దిక పరీక్షలు:

- అశాబ్దిక అంశాలతో అనగా చిత్రాలు, పటాలతో ప్రశ్నలను కల్గివుండేవే అశాబ్దిక పరీక్షలు
- వీటిని నిరక్షరాస్యులైన వయోజనులు, చిన్న పిల్లల ప్రజ్ఞను మాపనం చేయటానికి ఉపయోగిస్తారు.

ఉదా :

1. భాటియా ప్రజ్ఞామాపని
2. వెష్లర్అశాబ్దిక పరీక్షలు
3. ఆర్మీ బీటా
4. రావెన్స్ ప్రోగ్రెసివ్ మ్యాట్రిసిస్ పరీక్ష
5. డ్రా ఎ పర్సన్ పరీక్ష

III.పరీక్షలలో వుండే ప్రశ్నలకు ప్రయోజ్యుడు జవాబులను /ప్రతిస్పందనలను ఏ విధంగా ఇస్తున్నాడు అనే దాని ఆధారంగా ప్రజ్ఞాపరీక్షలు -2 రకాలు,

1. పేపర్ పెన్సిల్ పరీక్షలు :

ప్రజ్ఞా పరీక్షలోని ప్రశ్నలకు ఇచ్చే జవాబులు / ప్రతిస్పందనలు కోసం పేపర్ & పెన్సిల్ ఉపయోగిస్తే అలాంటి వాటిని పేపర్ - పెన్సిల్ పరీక్షలు అంటారు.

ఉదా :

1. బినే సైమన్ ప్రజ్ఞామాపని
2. వెష్లర్ శాబ్దిక పరీక్ష
3. ఆర్మీ ఆల్ఫా
4. ఆర్మీ జనరల్ క్లాసిఫికేషన్
5. ఓటిస్ మానసిక సామర్థ్యాల పరీక్ష
6. రావెన్స్ ప్రొగ్రెసివ్ మ్యాట్రీన్ పరీక్ష
7. డ్రా ఏ పర్సన్ పరీక్ష

2. నిష్పాదన పరీక్షలు:

- పరీక్షల్లోని అంశాలకు కొన్ని నిష్పాదన పరమైన పనులను ప్రదర్శించడం ద్వారా ప్రజ్ఞను మాపనం చేసేవి. (ఉదా: నమూనాలు తయారుచేయటం, ఆకారాలు అమర్చటం, చిత్రాలు నిర్మించటం)

ఉదా:

1. భాటియా ప్రజ్ఞా మాపని
2. వెష్లర్ అశాబ్దిక పరీక్షలు
3. ఆర్మీ బీటా
4. పరీక్షకు వుండే కాలపరిమితి ఆధారంగా ప్రజ్ఞా పరీక్షలు -2 రకాలు, అవి

1. వేగ పరీక్షలు:

- నిర్ణీత కాలపరిమితిని కలిగి వుండే పరీక్షలను వేగపరీక్షలు అంటారు.

ఉదా:

1. భాటియా ప్రజ్ఞా మాపని
2. ఆర్మీ అల్ఫా
3. ఆర్మీ జనరల్ క్లాసిఫికేషన్
4. ఓటిస్ మానసిక సామర్థ్యాల పరీక్ష
5.ఆర్మీ బీటా

2. శక్తి పరీక్షలు:

- నిర్ణీత కాలపరిమితి లేని పరీక్షలను శక్తి పరీక్షలు అంటారు.

ఉదా:

1. బినే సైమన్ ప్రజ్ఞామాపని
2. వెష్లర్ శాబ్దిక పరీక్షలు
3. వెష్లర్ అశాబ్దిక పరీక్షలు
4. రావెన్స్ ప్రోగ్రెసివ్ న్యూట్రెసిస్ టెస్ట్
5. డ్రా ఏ పర్సన్ టెస్ట్

5.సంస్కృతి పరంగా ప్రజ్ఞా పరీక్షలు - 2 రకాలు, అవి :

1. సంస్కృతి ప్రభావ / సంస్కృతి శీల పరీక్షలు (కల్చర్ ఫ్రీ టెస్టులు)

- ఏదో ఒక సంస్కృతికి, ఒక భాషకి, ఒక ప్రాంతానికి పరిమితమై ఆ కొద్దిమంది వ్యక్తుల ప్రజ్ఞను మాత్రమే ఒక పరీక్ష మాపనం చేస్తే దానిని 'సంస్కృతి ప్రభావ పరీక్షలు' అంటారు. ఉదా: శాబ్దిక పరీక్షలన్నీ సంస్కృతి ప్రభావ పరీక్షలే.

2. సంస్కృతి రహిత పరీక్షలు (కల్చర్ ఫ్రీ టెస్టులు):

ఒక సంస్కృతికి పరిమితం కాకుండా వివిధ సంస్కృతులకు, వివిధ, భాషలకు చెందిన అందరి వ్యక్తుల ప్రజ్ఞను 'సార్వత్రికంగా' మాపనం చేయగలిగే పరీక్షలను 'సంస్కృత రహిత పరీక్షలు' అంటారు.

వ్యక్తిగత పరీక్షలు
శాబ్దిక అండ్ పేపర్ పెన్సిల్
1.బినే సైమన్ (శక్తి)
2.నెష్లర్ శాబ్దిక్ పరీక్షలు (శక్తి)
అశాబ్దిక, నిష్పాదన
1.భాటియా ప్రజ్ఞామాపని (వేగ)
2.నెష్లర్ అశాబ్దిక్ పరీక్షలు (శక్తి)
సామూహిక పరీక్షలు
శాబ్దిక అండ్ పేపర్ పెన్సిల్
1.ఆర్మీ అల్ఫా (వేగ)
2.ఆర్మీ జనరల్ క్లాసిఫికేషన్ (వేగ)
3.ఓటిస్ మానసిక సామర్థ్యాల పరీక్ష (వేగ)
అశాబ్దిక అండ్ పేపర్ పెన్సిల్
1.ఆర్మీ బీటా(వేగ)
2.రావెన్స్ ప్రోగ్రెసివ్ మాట్రిసిన్ టెస్ట్ (శక్తి)
3.డ్రా ఎ పర్సన్ టెస్ట్ (శక్తి)

ప్రజ్ఞా పరీక్షల డిజైన్స్:

ఆర్మీ ఆల్ఫా, ఆర్మీ బీటా, ఆర్మీ జనరల్ క్లాసిఫికేషన్ ప్రజ్ఞాపరీక్షలను (ప్రజ్ఞ) అమెరికాకు చెందిన 'యార్క్స్' అనే మనోవిజ్ఞాన వేత్త రూపొందించారు.

- ఈ మూడు పరీక్షలు 1వ, 2వ ప్రపంచ యుద్ధ కాలంలో ప్రతిభావంతులైన వ్యక్తులను సైన్యంలోకి ఎంపిక చేయడానికి ఉపయోగించుకున్నారు.

నోట్ : ఆర్మీ అల్ఫాలో 8 పరీక్షలు, ఆర్మీబీటాలో 7 పరీక్షలు ఉంటాయి.

ఆర్‌పిఎంటి :

'రావెన్స్ ప్రోగ్రెసివ్ మ్యాట్రిసిస్ టెస్ట్"

- ఆర్‌పిఎంటిను డిజైన్ చేసిన వారు : జెసి రావెన్ (ఇంగ్లాండ్)
- ఆర్‌పిఎంటిను అభివృద్ధిపర్చిన వారు : జె.రావెన్ అండ్ జెహెచ్ కార్ట్
- ఆర్‌పిఎంటిలో '5 సిరీస్'లో మాత్రికా రూపంలో ఒక భాగం లోపించిన సమస్యాత్మక చిత్రాలు ఉంటాయి. ఆ లోపించిన భాగాన్ని క్రింద ఉన్న ఐచ్ఛికాల్లో గుర్తించాల్సివుంటుంది.

ఒక్కొక్క సిరీస్‌లో 12 ప్రశ్నలు ఉంటాయి. ఇలా మొత్తంగా 60 ప్రశ్నలు ఉంటాయి.

2. భాటియా ప్రజ్ఞామాపని:

- భారతీయ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించబడిన మొట్టమొదటి దేశీయ ప్రజ్ఞామాపని
- దీనిని రూపొందించినవారు- సిఎం భాటియా (ఇండియా) (చందర్ మోహన్ భాటియా)

భాటియా ప్రజ్ఞా మాపనిలో మొత్తం ఐదు రకాల పరీక్షలు ఉంటాయి

అవి

1.కె.-కొహ్‌బ్లాక్ డిజైన్ పరీక్ష
10 నమూనాలు నిర్మించాలి-25 నిముషాల కాలపరిమితి
2. అలెగ్జాండర్ పాస్ ఎలాంగ్ టెస్ట్-8 నమూనాలు నిర్మించాలి-20 నిముషాల కాలపరిమితి
3. పి.-పింటర్న్, పాటర్న్ డ్రాయింగ్ పరీక్ష- 8 నమూనాలు గీయాలి-20 నిముషాల కాలపరిమితి
4. టి.-తక్షణ స్మృతి పరీక్ష - కొన్ని పదాల జాబితాను వినిపిస్తారు. వెంటనే గుర్తుకు తెచ్చుకొని ఆ జాబితా చెప్పాలి.
5. సి-చిత్ర నిర్మాణ పరీక్ష - 5 బ్రోకెన్ పిక్స్‌తో కలపాలి. 17 నిమిషాల కాలపరిమితి

నోట్ : ఒక్కోసారి భాటియా ప్రజ్ఞామాపనిలోని పరీక్షలను ఇచ్చి వాటి లక్షణాలు కూడా అడుగుతుంటారు.

ఉదా: కొహ్ బ్లాక్ డిజైన్ పరీక్ష ఒక
1.వ్యక్తిగత పరీక్ష 2.నిష్పాదన పరీక్ష 3.వేగ పరీక్ష
4) పైవన్నీయూ
3. డబ్లుఐఎస్‌సి :
వెష్లర్ ఇంటెలిజెన్సీ ఫర్ చిల్డ్రన్ (వెష్లర్ బాలల ప్రజ్ఞామాపని)

- డబ్లుఐఎస్‌సిను రూపొందించినవారు- వెష్లర్ (అమెరికా) -డబ్లుఐఎస్‌సిను ఏ వయస్సు పిల్లల ప్రజ్ఞను మాపనం చేయడంలో ఉపయోగిస్తారు : 5 నుంచి 15 సం॥లు
- డబ్లుఐఎస్‌సిలో 5 శాబ్దిక, 5 అశాబ్దిక పరీక్షలు అనగా మొత్తం 10 పరీక్షలు ఉంటాయి. ఈ పరీక్షను శాబ్దిక, అశాబ్దిక పరీక్షగా ఉపయోగిస్తారు.
- ఈ పరీక్ష - అక్షరాస్యులు, నిరక్షరాస్యులు ఇద్దరి ప్రజ్ఞను మాపనం చేసే విధంగా డిజైన్ చేయబడింది.

డబ్లుఐఎస్‌సిలోని 5 శాబ్దిక పరీక్షలు:
1. వి.పదజాలం (వకాబులరీ)
2.ఐ.సమాచారం (ఇన్ఫర్మేషన్)
3.ఎస్.సాదృశ్యాలు/పోలికలు (సిమిలారిటీస్)
4.సి.అవబోధం(కాంప్రహెన్సివ్)
5.ఎ.అంకగణితం (అర్థమెటిక్)
డబ్ల్యుఐఎస్‌సిలో 5 అశాబ్దిక పరీక్షలు:
1. చి-చిత్ర పూరణ పరీక్ష చిత్రంలో లోపించిన భాగాన్ని గుర్తుపట్టాలి.
2.చి-చిత్ర క్రమీకరణ పరీక్ష-కథకు అనుగుణంగా చిత్రాన్ని క్రమంలో అమర్చాలి.
3.బి.బ్లాక్ డిజైన్ పరీక్ష-నమూనాలు తయారుచేయాలి
4.ఎ.అంకచిహ్న పరీక్ష-చిహ్నమును గుర్తించాలి
5.వి.వస్తు కూర్పు, వస్తు సమాఖ్య-ముక్కలుగా ఉన్న వస్తువును అసలైన వస్తువుగా రూపొందించాలి.
4. డ్రా ఎ పర్సన్ టెస్ట్

- డ్రా ఏ పర్సన్ పరీక్షను రూపొందించినవారు-ఫ్లోరెన్స్ గుడ్ ఎనఫ్ (అమెరికా)
- ఈ పరీక్షలో ప్రతి పిల్లవాడు 51 చిత్రాలను గీయాలి.

స్టాన్ఫర్డ్ బినే సైమన్ ప్రజ్ఞా మాపని

- స్టాన్ఫర్డ్ బినే సైమన్ ప్రజ్ఞామాపనిని - అమెరికాకు చెందిన లూయిస్ టెర్మన్ ప్రతిపాదించారు.
- దీనిని 2-18 సం॥ల వారి ప్రజ్ఞాను మాపనం చేసేందుకు ఉపయోగిస్తారు.
- ప్రస్తుత మాపనంలో 5 రకాల పరీక్షలు ఉంటాయి అవి :

1. ఫ్లూయిడ్ రీజనింగ్
2. క్వాంటిటేటివ్ రీజనింగ్
3. విజువల్-స్పేషియల్ ప్రాసెసింగ్
4. వర్కింగ్ మెమరీ
5. నాలెడ్జ్

సిఏవిడి

- సిఏవిడి ప్రజ్ఞాపరీక్షను అమెరికాకు చెందిన ధారన్‌డైవ్ రూపొందించారు.
- ఈ పరీక్ష అమూర్త ప్రజ్ఞను మాపనం చేస్తుంది.
- ఈ పరీక్షలో

సి-వ్యాకరణాంశాలు (కంప్లీషన్ ఆఫ్ సెంటెన్సెస్)
ఎ.అంకగణితము(అర్థమెటిక్)
వి.పదజాలము (వకాబులరీ)
డి.నిర్దేశాలు(డైరెక్షన్స్)కు చెందిన ప్రశ్నలు ఉంటాయి.

ప్రజ్ఞా పరీక్షలు- ఉపయోగాలు:

1. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి మేథోపరమైన ప్రాజెక్టులను నిర్వహించొచ్చు.
2. ప్రజ్ఞ తక్కువగా ఉన్న వారిని గుర్తించి వారి మానసిక సామర్థ్యాల మెరుగుకు కార్యక్రమాలు చేపట్టొచ్చు.
3. ప్రజ్ఞ అవసరమైన ఉద్యోగాలకు మేథావులైన వ్యక్తులను ఎంపిక చేయొచ్చు.
4. మేథస్సు ఎక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి జాతీయ స్థాయిలో జరుగు ఒలంపియాడ్ లాంటి పోటీలకు పంపొచ్చు.

ప్రజ్ఞ పరీక్షలు- పరిమితులు:

1. విశ్వసనీయత లోపం
2. సప్రమాణత లేనివి
3. అన్నీ సామర్థ్యాలను మాపనం చేయలేనివి
4. వివిధ సందర్భాల్లో వివిధ ఫలితాలను ఇస్తాయి.
5. ఖచ్చితమైన ప్రాగుక్తీకరణ చేయలేవు.
6. సంస్కృతి ప్రభావితమైనవి

ప్రజ్ఞలు - రకాలు:

- అమెరికాకు చెందిన 'జంతు మనోవిజ్ఞాన శాస్త్ర పితామహుడి'గా పేరు గాంచిన - 'థారన్డైక్'-ప్రజ్ఞను 3 రకాలుగా వర్గీకరించారు.

1. అమూర్త ప్రజ్ఞ
2. యాంత్రిక ప్రజ్ఞ
3. సాంఘిక ప్రజ్ఞ
1. అమూర్త ప్రజ్ఞ:

- అక్షరాలు, పదాలు, సంఖ్యలు, చిత్రాలు, చిహ్నాలు, సంకేతాలు, సాంకేతికాలు మొదలగు వాటిని గ్రహించగలిగే సామర్థ్యం. అభ్యసించగలిగే సామర్థ్యం. వాటి రూపంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించగలిగే సామర్థ్యమే అమూర్త ప్రజ్ఞ.

హింట్ :

- వ్యక్తి యొక్క ఆలోచన, వివేచన, సమస్యా పరిష్కార సామర్థ్యం, భాషా సామర్థ్యాలతో కూడిన శాబ్దిక, అశాబ్దిక అంశాలతో కూడిన సమస్యా పరిష్కారాలన్నీ అమూర్త ప్రజ్ఞలే.

నోట్ :

- థారన్ డైక్ ప్రకారం 'అమూర్త ప్రజ్ఞకు' కేంద్రస్థానం-మస్తిష్కం/ముందు మెదడు

ఉదా : ఒక విద్యార్థి ఒక గణిత సమస్యను పరిష్కరించడంలో, ఒక ఉపాధ్యాయుడు ఒక గణిత సమస్యను రూపొందించడంలో ఉపయోగపడే ప్రజ్ఞ- **అమూర్త ప్రజ్ఞ**

ఉదా : ఒక విద్యార్థి ఆంగ్ల భాష యొక్క వ్యాకరణాన్ని సులువుగా గ్రహించగలుగుతూ వ్యాకరణ సంబంధిత అంశములను సమర్థవంతంగా అభ్యసించగలుగుతున్నాడు. ఇది అతనిలోని ఏ ప్రజ్ఞను సూచిస్తుంది **- అమూర్త ప్రజ్ఞ**

రేపు : వివిధ ప్రజ్ఞలు-వర్గీకరణలు

సంపాదకీయం


సబబు కాదు

తమిళనాడు శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ సమ్మతి తెలపకుండా ఏళ్లతరబడి తొక్కిపట్టిన వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా ప్రశ్నావళిని సంధించడం సబబు కాదు. ఈ చర్య సుప్రీంకోర్టు తీర్పు నుండి కేంద్రం తప్పించుకోజూస్తోందన్న వ్యాఖ్యానాన్ని ఎవరూ కొట్టిపారేయలేరు. వాస్తవానికి దేశ సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగం యొక్క సమాఖ్య స్వభావాన్ని, రాష్ట్రాల హక్కులను పరిరక్షిస్తూ ఆ తీర్పును వెలువరించింది. అలాంటి గొప్ప తీర్పుపై రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టుకు ప్రశ్నలు పంపడం కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంపై చేస్తున్న మరో దాడి అని ఎవరైనా అంటే వారిని తప్పుబట్టలేం. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి 10 బిల్లులను తన వద్ద అట్టే పెట్టుకోవడం చట్టవిరుద్ధమని, బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రపతికి, రాష్ట్ర గవర్నర్లకు కాలపరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనది. ఆ తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీం కోర్టుకు 14 ప్రశ్నలు సంధించారు. రాష్ట్రపతికి కాలపరిమితి విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉన్నదా? అని సందేహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పులో ప్రధానంగా ఉపయోగించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 201, 202 ల గురించే ఆ ప్రశ్నల్లో ఎక్కువగా వుండడం ఆ తీర్పును నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నది జనవాక్యం. తమ అనుమతి కోసం వచ్చిన బిల్లులపై చర్య తీసుకోవడానికి ఆర్టికల్ 143 ప్రకారం గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి నిర్దేశించి విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉన్నదా? అని ఆమె ప్రశ్నించడం సుప్రీం కోర్టు పరిధిని కుదించే యత్నమే!

భారత రాజ్యాంగం చట్ట, పరిపాలన, న్యాయ అంగాల మధ్య సన్నటి లక్ష్మణ రేఖను గీసింది. వీటిలో ఏ ఒక్కటి కూడా మరోదానిలోకి చొరబడరాదు. అదే సమయంలో రాజ్యాంగ ఉల్లంఘనకు ఎవరూ పాల్పడరాదు. ఈ మూడింటిలో రాజ్యాంగానికి భాష్యం చెప్పే బాధ్యతను న్యాయ వ్యవస్థకు ప్రధానంగా సుప్రీం కోర్టుకు దఖలుపర్చింది. మన రాజ్యాంగ ప్రధానాంశాల్లో ఫెడరలిజం ఒకటి. దానికి విఘాతం కలిగించే రీతిలో వ్యవహరించిన గవర్నర్ వైఖరిని సరి చేయడానికే సుప్రీం కోర్టు ఆ తీర్పునిచ్చింది. ఆ క్రమంలోనే 201, 202 అధికరణాలను, వాటినిబట్టి రాష్ట్రపతి, గవర్నర్లు వ్యవహరించవలసిన విధానాన్ని నిర్దేశించింది. రాజ్యాంగం విహితపర్చిన ప్రక్రియను అమలు చేయడమేతప్ప ఆ తీర్పును అన్యధా భావించ వీలు లేదు. కేంద్ర ప్రభుత్వం సుప్రీం తీర్పును తలదాల్చి అమలు చేయడం విజ్ఞతగా ఉంటుంది. న్యాయ వ్యవస్థతో వివాదపడడం శ్రేయస్కరం కాదు.

కేంద్ర ప్రభుత్వ చర్యలనుబట్టి తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి బిజెపి చెప్పినట్టు వ్యవహరించారన్న విషయం నిర్ధారణ అవుతోంది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు చర్య తీసుకోవడానికి సమయ పరిమితులను నిర్ణయించడంపై అభ్యంతరాలను లేవనెత్తడం తగదు. సుప్రీంకోర్టు తీర్పును కేంద్రం ప్రశ్నించడం ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాన్ని బలహీనపరిచే ప్రక్రియగా భావించవలసి ఉంటుంది. గవర్నర్లను ప్రయోగించి బిజెపి యేతర రాష్ట్ర శాసనసభలను కేంద్ర ప్రభుత్వం స్తంభింపజేయాలని చూస్తోందన్న విషయం మరోమారు రుజువవుతోంది. గతంలో వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల అనంతరం ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కమలనాథులు 'కొనుగోలు' చేయడం, ఆ తరువాత గవర్నర్ల ద్వారా అధికార పీఠాన్ని అధిష్ఠించడం జగమెరిగినదే! ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని రక్షించడానికి, రాష్ట్రాల హక్కులను పరిరక్షించడానికి బిజెపి యేతర పార్టీలు, ప్రజాస్వామిక శక్తులు పోరాడాలి. తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో ఏర్పడిన టిడిపి వంటి పార్టీలు రాష్ట్రాల హక్కుల కోసం జరిగే పోరాటంలో భాగస్వామి అవుతుందని ప్రజలు ఆశిస్తారు. అలాగాకుండా కేంద్రంలోని బిజెపికి లొంగి మౌనం వహిస్తే ఆ పార్టీ మూల సూత్రాల నుండి దూరమవుతోందని భావించకతప్పదు.

మంచి మాట



విజ్ఞానం మనల్ని శక్తిమంతుల్ని చేస్తే, మంచి వ్యక్తిత్వం మనపై గౌరవం కలిగేలా చేస్తుంది.

- ఎ.పి.జె. అబ్దుల్ కలామ్,
శాస్త్రవేత్త, భారత మాజీ రాష్ట్రపతి.

వ్యాఖ్య

కాల్పుల విరమణలో సమాధానం లేని సవాళ్లు

సరిహద్దులకు ఇరువైపులా వున్న ప్రజలకు ఉపశమనం లభించింది. భారత్ పాకిస్తాన్‌ల మధ్య నాలుగు రోజుల పాటు సాగిన సైనిక సంఘర్షణ మే 10వ తేదీ మధ్యాహ్నానికి ముగింపుకొచ్చింది. అయినా సరే రాత్రి పొద్దుపోయాక కూడా తుపాకీ మోతలు వినిపించాయి. అయితే తర్వాత ఇరు దేశాల డిజిఎంవోలు కాల్పుల విరమణ జరిగిందని ధృవీకరించారు. యుద్ధ మేఘాలు ప్రస్తుతానికి సద్దుమణిగాయని వెల్లడించారు.

ఏమైనా ఈ మూడు వారాలు దక్షిణాసియాలో నాటకీయమైన పరిణామ క్రమాన్ని ఆవిష్కరించాయి. ఒక వినాశకర పోకడను వెల్లడించాయి. 26 మంది అమాయకులను బలిగొన్న అమానుష హత్యాకాండతో ఈ ఈ ఘటనల పరంపర మొదలైంది. అమాయకులైన ఆ పర్యాటకులను కాపాడేందుకు ప్రాణాలే త్యాగం చేసిన స్థానిక కాశ్మీరీ అశ్వికుడు కూడా వారిలో వున్నాడు. పర్యాటకులనే లక్ష్యంగా చేసుకుని మత విశ్వాసాన్నిబట్టి ఎంపిక చేసుకుని టెర్రరిస్టులు ఈ హత్యాకాండకు పాల్పడ్డారన్నది స్పష్టమే. లష్కరే తోయిబా ఈ దాడి వెనక వున్నదనీ, హంతకులతో వారు టెలిఫోన్‌లో మాట్లాడుతున్నారని సైన్యం విడుదల చేసిన స్పష్టమైన సాక్ష్యాధారాలు చెబుతున్నాయి. అప్పటికీ ఇంకా సందేహాలేమైనా మిగిలివుంటే-వాటికి ఆస్కారం లేకుండా పాక్ పాలక వ్యవస్థ గౌరవ లాంఛనాలు ప్రదర్శించిన టెర్రరిస్టుల చిత్రపటాలు కూడా తర్వాత సాగిన సైనిక చర్యలో లభ్యమైనాయి.

అటు మద్దతు.. ఇటు విద్వేషం..

ఈ విధంగా వాస్తవాలేమిటో నగ్నంగా బయటపడ్డాక శిక్షించే చర్య తీసుకోవడం తప్ప మరో అవకాశమేదీ లేకుండా పోయింది. ఈ ఘటనపై చాలా సహేతుకమైన ఆగ్రహంతో రగిలిపోయిన ప్రజలు ప్రస్ఫుటమైన ఐక్యతతో నిలవడం కనిపించింది. టెర్రరిజంపై చర్య తీసుకోవడానికి దేశంలోని రాజకీయ పార్టీలు ప్రభుత్వానికి మద్దతు నిచ్చాయి. అదే సమయంలో అది టెర్రరిస్టులపై చర్యగా తప్ప పూర్తి స్థాయి యుద్ధంగా వుండరాదని కూడా అత్యంత విశదంగా స్పష్టం చేశాయి.

> **ఈ సంక్షోభం నుంచి బయటికి రావాలంటే ప్రభుత్వానికి ఉన్న ఒకే ఒక మార్గం విషయాలను తేటతెల్లంగా వెల్లడించడమే. దురుద్దేశపూర్వకమైన ఏకపక్ష కట్టుకథల అతిశయోక్తులు ప్రధానమంత్రి వినిపించడం పార్లమెంట్‌లో నిర్మాణాత్మకమైన చర్చకు ప్రత్యామ్నాయం కాదు. ఒక కార్యశీల ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్చ జరపడం కనీస అవసరం.**

సరిగ్గా ఈ సమయంలోనే కాశ్మీరీలకు, ప్రత్యేకించి ముస్లింలకు వ్యతిరేకంగా ఒక విద్వేష ప్రచారం మొదలైంది. చాలా కాలంగా పెంచి పోషించిన విద్వేష యంత్రాంగం రంగంలోకి దిగింది. ముస్లింలు, ఇంకా ఆ మాటకొస్తే పూర్తిస్థాయి యుద్ధం గురించి వ్యతిరేకంగా మాట్లాడిన వారెవరైనా సరే అలాంటి వారందరినీ లక్ష్యంగా చేసుకొని దాడి ప్రారంభమైంది. నిజానికి ఇది చాలా కాలం కిందటే జరిగి వుండవలసింది.

అయితే సైనిక బలగాలు తమ లక్ష్యం టెర్రరిస్టు యంత్రాంగాన్ని విధ్వంసం చేయడం తప్ప పాకిస్తాన్ ప్రజల పైన గాని, పాలక వ్యవస్థ పైన గాని దాడి కాదన్న అంశాన్ని నొక్కి చెప్పేలాగా వ్యవహరించినందుకు ధన్యవాదాలు చెప్పాలి. అందువల్లనే సైనిక బలగాల ప్రతినిధులు మీడియాతో మాట్లాడినప్పుడు వృత్తిపరంగా తమ లక్ష్యాలను నొక్కిచెబుతూనే మాట్లాడారు. సహజంగా దీనివల్ల విద్వేష ప్రచారకుల కోపం కట్టలు తెంచుకుంది. ప్రభుత్వాన్ని నడిపించే రాజకీయ నాయకత్వం ఈ విద్వేష చర్యల పట్ల నోరు విప్పకపోవడం ఒక ప్రమాదకర లక్షణంగా స్పష్టమైంది.

సరిహద్దుకు ఇరువైపులా ఉన్న ప్రజలు సైనిక కార్యకలాపాలు ముగిసిపోవాలని తహతహలాడుతున్నారు. దేశం ఇతర ప్రాంతాల్లోనూ ప్రజలు, సామాన్యులు నష్టపోతున్నారు. పూంచ్, రాజౌరి ప్రాంతాల్లోని ప్రజలు దీనివల్ల కడగండ్లపాలయ్యారు. విద్యార్థులు, వలస కార్మికులు అందరి కంటే ఎక్కువగా దెబ్బతిన్నారు. అంతిమంగా పరిస్థితులు చేయి దాటక ముందే కాల్పుల విరమణ అమలు చేయాల్సి వచ్చింది.

పార్లమెంటు చర్చకు నిరాకరణ

సరిగ్గా ఈ సమయంలో అసలు రహస్యం బహిర్గతమైంది. అధికారికంగా ఎలాంటి ప్రకటన రాకముందే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన ప్రభుత్వ మధ్యవర్తిత్వంతో ఇరుపక్షాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ట్వీట్ చేశారు. ఇది భారత ప్రభుత్వాన్ని ఇరుకులో పెట్టింది. ప్రత్యేకించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండుసార్లు జరిగిన అఖిలపక్ష సమావేశాలకు హాజరు కాకపోవటం ఇందుకు తోడైంది. దీనిపై ప్రభుత్వం చెప్పే కథనం ఒప్పించేదిగా లేదు. ఈ నేపథ్యంలో ఈ మొత్తం పరిణామ క్రమాన్ని పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరిపి చర్చించాలనే కోర్కె ప్రతిపక్షాల నుంచి వచ్చింది. ఇందుకు ప్రభుత్వం వెనకడుగు వేస్తున్నది. పార్లమెంటు భవనంలో మెట్లకు శిరసాభివందనం చేసి, దాన్ని ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించి, వినయ విధేయతలు ప్రకటించి, ప్రధానిగా ప్రయాణం ప్రారంభించిన నరేంద్ర మోడీ ఇప్పుడు మాట్లాడటం లేదు. ఈ మార్పు ఎందుకు వచ్చిందో తెలియడానికి మనం గత పదేళ్ల చరిత్ర మొత్తంలోకి వెళ్ళనవసరం లేదు. అయితే పార్లమెంట్ సమావేశాలు జరపాల్సిన ఆవశ్యకత మాత్రం మాసిపోయేది కాదు. ట్రంప్ సామ్రాజ్యవాద తరహా ప్రకటన మోడీ ఘన భంగిమలకు తూట్లు పొడిచింది.



సరిగ్గా ఈ సమయంలో అసలు రహస్యం బహిర్గతమైంది. అధికారికంగా ఎలాంటి ప్రకటన రాకముందే అమెరికా అధ్యక్షుడు దోనాల్డ్ ట్రంప్ తన ప్రభుత్వ మధ్యవర్తిత్వంతో ఇరుపక్షాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ట్వీట్ చేశారు. ఇది భారత ప్రభుత్వాన్ని ఇరుకులో పెట్టింది. ప్రత్యేకించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండుసార్లు జరిగిన అఖిలపక్ష సమావేశాలకు హాజరు కాకపోవటం ఇందుకు తోడైంది. దీనిపై ప్రభుత్వం చెప్పే కథనం ఒప్పించేదిగా లేదు. ఈ నేపథ్యంలో ఈ మొత్తం పరిణామ క్రమాన్ని పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరపి చర్చించాలనే కోర్కె ప్రతిపక్షాల నుంచి వచ్చింది. ఇందుకు ప్రభుత్వం వెనకడుగు వేస్తున్నది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ఏది ఏమైనా ప్రభుత్వం కదలిక చూపక తప్పని పరిస్థితి ఇది. అయితే ప్రతిపక్షం నుంచి మద్దతు ఉన్నప్పటికీ ప్రభుత్వం పార్లమెంటును ఎదుర్కోవడానికి జంకుతున్నది. కార్యశీల ప్రజాస్వామ్య వ్యవస్థలో ముందుకు వచ్చే ప్రశ్నలకు అవకాశమివ్వడం లేదు.

మళ్లీ దెబ్బతీసిన ట్రంప్, పాక్‌కు ఆశీస్సులు

ఈ సమయంలో ఇరకాటం నుంచి బయట పడటానికి ప్రధాని పార్లమెంటును పక్కకు పెట్టి నేరుగా దేశాన్ని ఉద్దేశించి మాట్లాడే మార్గం ఎంచుకున్నారు. అయితే ఆ తర్వాత ప్రధాని ప్రియతమ నేస్తమైన డోనాల్డ్ ట్రంప్ నుంచే తిరుగులేని ఎదురు దెబ్బ తగిలింది. కాల్పుల విరమణకు దారి తీసిన ఘటనల క్రమాన్ని ఆయన బట్టబయలు చేశారు. సైనిక శత్రుత్వాల తీవ్రతను భారత పాకిస్తాన్ ప్రభుత్వాలు రెండూ గుర్తించక తప్పని పరిస్థితిని ట్రంప్ వెల్లడించారు. ట్రంప్ నుంచి వచ్చిన ఈ రెండు జోక్యాలు ప్రభుత్వం ప్రభుత్వం ఒత్తిడికి తట్టుకోలేకపోయిన అసహాయతను బహిర్గతం చేశాయి. వారు కోరిన మేరకు 100 కోట్ల డాలర్ల రుణం వేగంగా మంజూరు చేయడం ద్వారా పాకిస్తాన్ పాలక వ్యవస్థకు ఆశీర్వాదం లభించింది. పాకిస్తాన్ సైనిక దళాలు అత్యున్నత పాత్ర వహిస్తున్నప్పుడు ఈ డబ్బు ఎవరి చేతిలో పోతుందో ఎవరైనా ఊహించవచ్చు.

సైనిక చర్యలతో పాటు దౌత్యపరమైన మార్గాల వంటివి కూడా అన్వేషించాలని ప్రతిపక్షాలు చేసిన సూచనను పెడచెవిన పెట్టడమే ఇక్కడ విషాదంగా మారింది. ఈ సూచనను విస్మరించిన దాని ఫలితం ఇప్పుడు అందరికీ కనిపిస్తుంది. 25 సభ్య దేశాలుగల ఐఎంఎఫ్ పాలక మండలిలో ఇండియా ఒక్కటే ఏకాకిగా ఓటింగ్ నుంచి దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. టెర్రరిస్ట్ కార్యకలాపాలకు ప్రేరణగా నిలిచిన పాకిస్తాన్ ఏకగ్రీవంగా రుణం పొందగలిగింది.

ప్రధానమంత్రి దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించడానికి కొన్ని గంటల ముందే ట్రంప్ ఈ దారుణ పరిస్థితికి మరింత ఆజ్యం పోశారు. ఎవరూ ఏదీ ఊహించుకోవాల్సిన అవసరం లేకుండా చేశారు ఆయన. రెండు ఇరుగు పొరుగు దేశాలను లొంగదీసుకోవడానికి ఆర్థిక వాణిజ్య అస్త్రాలను అమెరికా ప్రయోగించినట్లు ట్రంప్ ప్రకటించాడు.

దీనస్థితిలో వీరంగం

మొత్తానికి చూస్తే భారతదేశ మృతుల గురించిన ప్రస్తావన లేదు. పహల్గాం ఘాతుకానికి పాల్పడిన వారి అప్పగింత లేదు. భారతదేశ సామాన్యులు ఎదుర్కొన్న విపరీత సమస్యల సంగతి సరేసరి. ఇవన్నీ ఒక దీనాతిదీన పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయి.

టెర్రరిస్టులు మతపరమైన విభజన తేవాలని చాలా గట్టి ప్రయత్నాలే చేశారు. ఆ విషయం విదేశాంగ శాఖ కార్యదర్శి సూటిగానే ఒప్పుకున్నారు. అలాంటి సమయంలో ఈ విద్వేష ప్రచారాలపై పోరాటం అన్నది టెర్రరిజం పైన విస్తృత పోరాటంలో భాగం కావాల్సింది. కానీ హతవిధీ! హిందుత్వ దళాల విద్వేష ప్రచార యంత్రాంగం రక్తపిపాసతో రేగిపోయింది. వచ్చిన ఈ ఫలితాన్ని అంగీకరించడానికి అది సిద్ధంగా లేదు. వారి దురాగ్రహం మనం అర్థం చేసుకోవచ్చు. మే 8వ తేదీన వారు వీరావేశంతో ఊగిపోయారు. ప్రధాన మీడియాలో కూడా కట్టు కథలతో నిజాలను కప్పిపుచ్చుతూ చిందులు తొక్కారు. పాకిస్తాన్ ఏ స్థాయిలో సర్వనాశనమై పోయిందో కథలు కథలుగా వినిపించారు.

ఈ పోకడలు దేశ ప్రయోజనాలకు హాని కలిగించాయి. అంతర్జాతీయ సమాజంలో భారత దేశ ప్రతిష్టను దెబ్బతీశాయి. అందువల్లనే ఇది లౌకిక దేశమని, కార్యశీల ప్రజాస్వామ్యమని వివరించేందుకు విదేశాంగ కార్యదర్శి, సాయుధ బలగాల ప్రతినిధులు ఎంతో శ్రమపడ్డారు. తమ 'అధినేత'ను ప్రశ్నించలేని పరిస్థితిలో పై శక్తులు విదేశాంగ కార్యదర్శిని లక్ష్యంగా చేసుకోవటం ఆశ్చర్యం కలిగించదు. హిమాన్షి నర్వాల్ తర్వాత వారి ఘోరమైన ట్రోలింగుకు గురైన వ్యక్తి విదేశాంగ కార్యదర్శి అయ్యారు.

ఏకైక మార్గం

ఈ సంక్షోభం నుంచి బయటికి రావాలంటే ప్రభుత్వానికి ఉన్న ఒకే ఒక మార్గం విషయాలను తేటతెల్లంగా వెల్లడించడమే. దురుద్దేశపూర్వకమైన ఏకపక్ష కట్టుకథల అతిశయోక్తులు ప్రధానమంత్రి వినిపించడం పార్లమెంట్‌లో నిర్మాణాత్మకమైన చర్చకు ప్రత్యామ్నాయం కాదు. ఒక కార్యశీల ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్చ జరపడం కనీస అవసరం.

ఇదిలా ఉంటే అమెరికా సామ్రాజ్యవాదం దక్షిణాసియాలో ఒక సరికొత్త అనాగరిక పెత్తనం రుద్దడానికి చేస్తున్న ప్రయత్నాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇది భారత ప్రజలకు తీవ్ర ప్రమాదాలు తెచ్చి పెట్టే పరిస్థితి. ఈ ప్రమాదాన్ని పూర్తిగా ఎదుర్కొని నిలబడటంలో మన దఢ సంకల్పం ద్విగుణీకృతం కావలసిన సందర్భం.

(మే14 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

జనవాక్యం

ఏం బడులు బాబోయ్...!



ప్రస్తుత కూటమి ప్రభుత్వం, పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పేరుతో కొత్తగా 19, 20, 21 జీవోలు తీసుకొచ్చింది. వీటిని అమలు చేస్తే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కాకపోగా బలహీనపడే అవకాశం ఉంది. గత ప్రభుత్వం విద్యా రంగాన్ని విధ్వంసం చేసిందని, విద్యా రంగాన్ని గాడిలో పెడతామని గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ప్రాథమిక విద్యా రంగాన్ని మరింత గందరగోళంలోకి నెట్టే పరిస్థితులు తీసుకు వస్తున్నది. గత ప్రభుత్వం కేవలం 3,4,5 తరగతులను మాత్రమే ఉన్నత పాఠశాలలో విలీనం చేస్తే ఈ ప్రభుత్వం ఒకటి, రెండు తరగతులను కూడా విలీనం చేయడం విడ్డూరంగా ఉంది. మోడల్ ప్రాథమిక పాఠశాలల కోసం, ఫౌండేషన్ పాఠశాలలను నెలకొల్పడం సరికాదు. మోడల్ ప్రాథమిక పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టు టీచర్లను నియమించడం అశాస్త్రీయంగా ఉంది. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి. ముఖ్యంగా 20 లోపు విద్యార్థులు ఉన్నప్పుడు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారుతున్నాయి. కాబట్టి విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. విద్యార్థులకు తెలుగు మాధ్యమంలో చదువుకునే అవకాశం కోసం తెలుగు ఇంగ్లీషు మాధ్యమాలను కొనసాగించాలి. మైనారిటీ భాషల మాధ్యమాలను కూడా కొనసాగించాలి. మోడల్ ప్రాథమిక పాఠశాలలలో 120 మంది విద్యార్థులు దాటితే ఆరుగురు ఉపాధ్యాయులను నియమించాలి. ఉన్నత పాఠశాలలలో 1 నుంచి 5 తరగతులు విలీనం చేసే ప్రతిపాదనను విరమించుకోవాలి. హైస్కూళ్లలో ఆరు నుంచి పది తరగతులు మాత్రమే నిర్వహించాలి. ప్రాథమిక తరగతులను హైస్కూళ్ళలో ఉంచరాదు. కొత్తగా ప్రతిపాదిత ప్రభుత్వ ఉత్తర్వు 21 లో ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు 40 పీరియడ్ల భారం పడనున్నది. దానిని 32 పీరియడ్లకు మించకుండా చూడాలి. ఉన్నత పాఠశాలలో 45 మంది విద్యార్థులు దాటిన చోట రెండవ సెక్షన్ ఏర్పాటు చేయాలి. క్లస్టర్ స్థాయిలో ఉపాధ్యాయులను మిగులు చూపించకుండా వారిని విద్యార్థుల సంఖ్యను బట్టి డిసెండింగ్ ఆర్డర్లో పాఠశాలలకు కేటాయించాలి. పెరిగిన జనాభాకు అనుగుణంగా మునిసిపాలిటీ, కార్పొరేషన్, నూతనంగా వెలిసిన ఆవాసాలలో నూతన పాఠశాలలు ఏర్పాటు చేయాలి. అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ తెలుగు ప్రమోషన్లలో సీనియారిటీ జాబితాలో చేర్చి ప్రమోషన్లు ఇవ్వాలి.

- వాసిలి సురేష్,
నెల్లూరు జిల్లా.

సమస్య


అంతటా దోపిడి అవుతున్న ఆమె శ్రమ



డా॥ కత్తి పద్మారావు

దేశంలోని తల్లులు రక్తలేమితో బాధపడుతున్నారు. నిజానికి కార్మిక రంగంలో వున్న మహిళల పట్ల చాలా నిర్లక్ష్యం కనిపిస్తున్నది. రైతు కూలీలు, బీడీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, చేనేత కార్మికులు, మత్స్యకార, పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న స్త్రీలపై జరిగిన పరిశోధనలో వారు రక్తలేమితో మధ్య వయస్సులోనే వంగిపోయి, కీళ్ళు అరిగిపోయి, ప్రభుత్వాల నుండి యాజమాన్యాల నుండి ఎటువంటి సహాయం లేక పిల్లలకు పాలు కూడా ఇవ్వలేని స్థితిలో జీవిస్తున్నారు. గర్భవతులుగా వున్నప్పుడు కూడా కూలికి వెళ్ళకపోతే జరగక మురికి వాడల్లో వుంటూ పౌష్టికాహారం లేక పచ్చళ్ళు తింటూ జీవిస్తున్నారు. వ్యవసాయ రంగంలోనైతే నడి ఎండల్లో నాట్లు వేయడం, పగిలిన కాళ్ళతో కూడా బురదలో దిగి కలుపు తీయడం, మధ్యాహ్నానికి కళ్ళు తిరిగి పడిపోతున్నా అటు పాలకులు గాని ఇటు భూస్వాములు గాని మజ్జిగ కూడా ఇవ్వని దయలేని ప్రభుత్వంలో అభాగ్యంగా జీవిస్తున్నారు. ముఖ్యంగా చేనేత రంగంలో వున్న స్త్రీలు రక్తలేమితో బాధ పడుతున్నట్లుగా సర్వేలు చెపుతున్నాయి. మహిళల శ్రమ దోపిడీ గురించి మహిళా మేధావులు వ్యధాపూరితమైన విషయాలను ప్రపంచం ముందుకు తెస్తున్నా పాలకులు పట్టించుకోవటం లేదు.

మహిళలు ఇంటా బయటా చాకిరీ చేస్తున్నారు. కాని కోట్లాది మంది మహిళల కోట్లాది గంటల శ్రమకి ఆర్థిక విలువ లేదు. గుర్తింపు లేదు. ఎవరైనా గృహిణిని 'మీరేం పని చేస్తారు?' అంటే 'నేనేమీ చెయ్యను!' అంటుంది. రోజంతా తను చేసే పనిని 'పని' కాదు అని చెబుతుంది. ఆమె కుటుంబం కూడా ఆమె పని చెయ్యదు అని చెబుతుంది. విరామం లేకుండా ఇంట్లో ఆమె చేసే చాకిరీకి ఎలాంటి విలువ లేదు. ఈ దేశంలో కోట్లాది మంది మహిళలు ప్రతి రోజూ చేసే పని అదృశ్యం అవుతుంది. కుటుంబానికే కాదు, ప్రభుత్వాలకూ కనబడదు. కొన్ని గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మహిళలు చేసే గృహ, సంరక్షణ శ్రమకు ఆర్థిక విలువ లెక్కించినట్లైతే అది కొన్ని బిలియన్ డాలర్ల విలువైనదిగా ఉంటుంది. అయినప్పటికీ ఈ శ్రమ ఎప్పుడూ ఆర్థిక లెక్కల్లోకి రాదు. దానికి కారణం తరతరాలుగా మహిళల శ్రమను సహజమైన బాధ్యతగా చూడడం. అంటే మహిళలు పుడుతూనే చీపుళ్ళు, చాటలు, గరిటెలు పట్టుకుని పుట్టినట్టు.



> **మహిళలు ఇంటా బయటా చాకిరీ చేస్తున్నారు. కాని కోట్లాది మంది మహిళల కోట్లాది గంటల శ్రమకి ఆర్థిక విలువ లేదు. గుర్తింపు అంతకంటే లేదు. ఎవరైనా గృహిణిని 'మీరేం పని చేస్తారు?' అంటే 'నేనేమీ చెయ్యను!' అంటుంది. రోజంతా తను చేసే పనిని 'పని' కాదు అని చెబుతుంది. ఆమె కుటుంబం కూడా ఆమె పని చెయ్యదు అని చెబుతుంది. విరామం లేకుండా ఇంట్లో ఆమె చేసే చాకిరీకి ఎలాంటి విలువ లేదు. ఈ దేశంలో కోట్లాది మంది మహిళలు ప్రతి రోజూ చేసే పని అదృశ్యం అవుతుంది. కుటుంబానికే కాదు, ప్రభుత్వాలకూ కనబడదు. కొన్ని గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మహిళలు చేసే గృహ, సంరక్షణ శ్రమకు ఆర్థిక విలువ లెక్కించినట్లైతే అది కొన్ని బిలియన్ డాలర్ల విలువైనదిగా ఉంటుంది. అయినప్పటికీ ఈ శ్రమ ఎప్పుడూ ఆర్థిక లెక్కల్లోకి రాదు.**

ఇంటి పని మహిళలకు చాలా సహజమైనదనే ప్రచారం పితృస్వామ్య సమాజం చేసింది.

భారత రాజ్యాంగం స్త్రీల కోసం, మహిళల రక్షణ కోసం వారి ఆర్థిక వెసులుబాటు కోసం, వారి విద్యాభివృద్ధి కోసం ఎన్నో చట్టాలు చేసింది. కాని చాలామంది కొడుకుతో సమానంగా కూతురుకి సమాన ఆస్తి ఇవ్వడంలేదు. అందువల్ల వాళ్ళు నిర్భాగ్యులుగా జీవించాల్సి వస్తుంది. గ్రామాల్లో కొడుకుతో సమానంగా కూతుర్ని చదివించటం లేదు. చివరకు కార్పొరేట్ స్కూళ్లలో కొడుకులను, గవర్నమెంటు స్కూల్‌లో కూతుళ్లను చదివిస్తుంటారు. ఇప్పుడు పదవ తరగతి పాసయిన ఆడపిల్లల్ని ఇంటర్మీడియట్‌లో చేర్చటం లేదు. వందల మంది ఆడపిల్లలకి బాల్య వివాహాలు జరుగుతున్నాయి. వాళ్ళు ఇంటర్‌కి వెళితే, ఊరు దాటి వెళితే ప్రేమలో పడతారనే అపోహతో తల్లిదండ్రులే వారిని నిరోధిస్తున్నారు. నిజానికి మనుస్మృతి చదవకపోయినా ఆ భావజాలం మాత్రం తండ్రుల మీద, భర్తల మీద బలంగా వుంది.

దళిత వాడల్లో తాగుడు ఎక్కువై తల్లిని, భార్యను నిందిస్తున్నారు. తాగుడు కోసం భార్యను కొట్టి డబ్బు తీసుకుంటున్నారు. ఇంట్లో పిల్లలు చదువుకొనే వాతావరణం లేకుండా చేస్తున్నారు. కొన్ని ఇళ్ళలో స్త్రీలు పొయ్యి మీద కుండ పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. మరొకవైపు వ్యవసాయంలో పని దినాలు బాగా తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో కార్పొరేటు సంస్థలు రొయ్యలు బాగు చేయటం కోసం రాత్రి పూట 11 గంటల నుండి స్త్రీలను ఆటోల్లో పనులకు తీసుకొని వెళ్తున్నారు. అందుకు వాళ్ళకు అనేక జబ్బులు వస్తున్నాయి. పిల్లలకు ఆలన పాలన చూడలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వాలు వ్యవసాయ కూలీల జీవన వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నాయి.

బడుగు వర్గాల్లోనే కాదు. అన్ని వ్యవస్థల్లోను స్త్రీలు పురుష పెత్తనం కింద నలిగిపోతున్నారు. ఇదే అదనుగా మత వ్యవస్థలు, పాలకులు మత కులోన్మాదాలను ప్రోత్సహిస్తున్నారు. మత క్షేత్రాలను సందర్శించే యాత్రలను ప్రోత్సహిస్తూ ఉత్పత్తి క్రమం నుండి ఆచార సాంప్రదాయాల్లోకి స్త్రీలను నెడుతున్నారు. నిజానికి ఇప్పుడు స్త్రీ మాతృత్వం మీద విపరీతమైన నిర్లక్ష్యం జరుగుతున్నది. ఎంతోమంది యువతులు ఉద్యోగాలు లేక, కట్న కానుకలు ఇవ్వలేక, పెళ్ళిళ్ళు గాక, ఒంటరి మహిళలుగా జీవిస్తున్నారు. ఇక భర్త చనిపోయిన, భర్తలు వలసలు పోయిన స్త్రీల మీద అరాచక శక్తులు దాడులు చేస్తున్నాయి. అసెంబ్లీలోనే వీటిపైన చర్చ జరుగుతుంది. ఒకపక్క గుట్కా, గంజాయి వంటి రకరకాల మత్తు పదార్థాలు, రకరకాల లిక్కర్లు ప్రతి వీధిలో దొరుకుతున్నాయి. ఇంటింటికి సరాఫరా చేసేవాళ్ళు కూడా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో స్త్రీ మాతృత్వాన్ని, వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం, విద్యా వ్యాపార, కార్మిక రంగాల్లో పనిచేస్తున్న స్త్రీలను శ్రమ దోపిడీ నుంచి రక్షించుకోవడం కోసం భారత రాజ్యాంగ స్ఫూర్తితో ఉద్యమించాల్సిన సందర్భం ఇది.

(వ్యాసకర్త సెల్ : 9849741695)

త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

రాయలసీమలోని కర్నూలు జిల్లాలో త్వరలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని, ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విచ్చేస్తారని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతాపల్లి వద్ద రూ.22 వేల కోట్ల వ్యయంతో రెన్యూ సంస్థ ఏర్పాటు చేస్తున్న 4.8 గిగావాట్ల హైబ్రిడ్ ఇంటిగ్రేటెడ్ పవర్ ప్రాజెక్టుకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ ఇంత పెద్ద ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేయడం సాహసోపేతమైన నిర్ణయమని పేర్కొన్నారు. దీని ఏర్పాటు ద్వారా గ్రిడ్‌లు బలోపేతం అవుతాయని, నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఎపి క్లీన్ ఎనర్జీ పాలసీ హరిత విప్లవానికి బ్లూ ప్రింట్ వంటిదన్నారు. 72 గిగావాట్ల పునరుద్పాదక శక్తిని రాష్ట్రంలో అమలు చేయాలని, రెన్యూవబుల్ ఎనర్జీ రంగంలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలపడం లక్ష్యమని తెలిపారు. ఇందులో అత్యధికం రాయలసీమ ప్రాంతంలోనే ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ ప్రాంతాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెన్యూ ఎనర్జీ సంస్థ సిఇఒ సుమంత్ సిన్హా, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. అనంతరం లోకేష్ అనంతపురం విచ్చేశారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుమార్తె వివాహానికి హాజరై వధువరులను ఆశీర్వదించారు. ఆ తర్వాత రాజ్యసభ మాజీ సభ్యులు కెఎం.సైఫుల్లా నివాసానికెళ్లారు. ఆయన కుమారుడు టిడిపి మైనార్టీ నాయకులు జకీవుల్లా ఇటీవలనే మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని లోకేష్ పరామర్శించారు.



బేతాపల్లి వద్ద రెన్యూ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్సు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేష్

ప్రధాని పిలుపుతో జిల్లా పర్యటన అర్ధాంతరంగా ముగింపు

మంత్రి లోకేష్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అపాయింట్ రావడంతో అనంతపురం జిల్లా పర్యటనను అర్ధాంతరంగా ముగించుకుని ఢిల్లీకి పయనమై వెళ్లారు. ముందు షెడ్యూల్ ప్రకారం సురేంద్రబాబు కుమార్తె వివాహానికి హాజరైన తర్వాత నగరంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాలులో జిల్లా టిడిపి నేతలు, కార్యకర్తలతో సమావేశం కావాల్సి ఉంది. శనివారం ఉదయం అనంతపురం జెఎన్‌టియు స్నాతకోత్సవంతో గవర్నర్ జస్టిజ్ నజీర్ అహమ్మద్‌తో కలసి పాల్గొనాల్సి ఉంది. ప్రధాని నుంచి పిలుపు రావడంతో ఈ కార్యక్రమాలను రద్దు చేసుకుని శుక్రవారం మధ్యాహ్నం బెంగళూరుకు,అక్కడి నుంచి ఢిల్లీకి లోకేష్ వెళ్లారు.

ఎసిబికి దొరికిన విద్యుత్‌శాఖ ఎడిఇ

- రూ.30 వేలు లంచం తీసుకుంటూ దొరికినవైనం

ప్రజాశక్తి-రుద్రవరం

రుద్రవరం మండలం చిన్న కంబలూరు మెట్ట దగ్గర విద్యుత్ సబ్ స్టేషన్ లో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బిల్లు ఆపరేటర్ ప్రతాప్ పట్టుపడ్డారు. ఎసిబి డిఎస్‌పి సోమన్న వివరాల మేరకు చిన్న కంబలూరు గ్రామానికి చెందిన రైతులు రామకృష్ణమాచారి, లింగమూర్తి గత సంవత్సర క్రితం తమకున్న 2.50 ఎకరాల భూమిలో విద్యుత్ స్తంభాలు (ట్రాన్స్ ఫార్మర్) ఏర్పాటు చేసుకోవడానికి విద్యుత్ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తును పరిశీలించిన అధికారులు సంబంధిత రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ నాలుగు విద్యుత్ స్తంభాల మంజూరు కోసం దరఖాస్తుల పరిశీలించి రైతులకు మంజూరు చేయాలని ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రైతులు ఎడిఇ రవికాంత చౌదరిని కలిసి తమకు తొందరగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఆయన మంజూరు చేయాలంటే రూ.50 వేలు ఇవ్వాలని రైతుల దగ్గర డిమాండ్ చేశారన్నారు. దీంతో రైతులు అంత ఇవ్వలేమని రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. ఆయన ఒప్పుకోలేదు రూ.30 వేలు ఇస్తేనే ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు ఇస్తామని చెప్పారు. రైతులు ఎడిఇ దగ్గర ఒప్పందం కుదుర్చుకొని కర్నూలులోని అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారికి రూ.30 వేలు రంగు పూసిన నోట్లను ఇచ్చారు. వీటిని తీసుకొని రైతులు ఎడిఇ రవికాంత చౌదరికి ఇస్తామని ఫోన్ చేశారు. ఆయన చిన్న కంబలూరు గ్రామంలో పనిచేస్తున్న బిల్ ఆపరేటర్ ప్రతాప్ రూ.30000 ఇవ్వండని చెప్పారు. ఈ మొత్తాన్ని ఆయనకు ఇచ్చారు. వెంటనే దాడి చేసి అతని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఎడిఇ రవికాంత చౌదరిని కూడా అదుపు లోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డిఎస్‌పి సోమన్న వెల్లడించారు.

అమరావతిలో రెండోదశ పూలింగు ప్రక్రియ వేగవంతం

- గుంటూరు జిల్లా కలెక్టర్‌గా శ్రీధర్?
- చెన్నకేశవులుకు మరలా పోస్టింగు?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి విస్తరణలో భాగంగా చేపట్టిన రెండోదశ పూలింగు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇప్పటికే సిఆర్‌డిఏ ఆధ్వర్యాన గ్రామసభలను అధికారులు పూర్తి చేస్తున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో గ్రామాల రైతులు స్వల్ప అభ్యంతరాల నడుమ పూలింగుకు అంగీకారం తెలుపుతున్నా, తాడికొండ మండల గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అడ్డంకులూ లేకుండా భూసమీకరణ ముందుకు సాగాలంటే గతంలో అనుభవం ఉన్న అధికారులను సిఆర్‌డిఏ జిల్లాల పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉన్నతాధికారులతోపాటు 50 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల(ఎస్‌డిసి) అవసరం ఉందని, తక్షణ అవసరంగా 30 మంది కావాల్సి ఉంటుందని ప్రభుత్వం నిర్ణయించింది. వీరే పూలింగు సమయంలో కాంపిటెంట్ అథారిగా వ్యవహరించనున్నారు. తొలిగా గతంలో సిఆర్‌డిఏ భూపరిపాలన విభాగం డైరెక్టర్‌గా విశేష అనుభవం ఉన్న చెన్నకేశవులును మరలా డైరెక్టర్‌గా తీసుకురానున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయన సిఆర్‌డిఏలో పూలింగు ప్రక్రియకు సంబంధించి కార్యాచరణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే ఆయన నియామకంపై స్పష్టమైన ప్రకటన రానున్నట్లు తెలిసింది. అదే సమయంలో 2014లో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అమరావతిలో పూలింగు ప్రక్రియను వేగంగా నడిపించిన చెరుకూరి శ్రీధర్‌ను ఈసారి గుంటూరు జిల్లా కలెక్టర్‌గా నియమించే అవకాశాలున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయనతో సంప్రదింపులు పూర్తయ్యాయినట్లు తెలిసింది. ప్రస్తుతం శ్రీధర్ వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ బాధ్యతల్లో ఉన్నారు. ఆయనకు చెన్నకేశవులు భూపరిపాలన డైరెక్టర్‌గా పూర్తిగా సహకరించారు. గతంలో పనిచేసిన సామర్థ్యం, రైతులను నయానో భయానో ఒప్పించగల నేర్పు, ఆర్అండ్ఆర్ కమిషనర్‌గా చేసిన అనుభవం శ్రీధర్‌కు ఉండటంతో మరలా సిఆర్‌డిఏ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. భూ పరిపాలనకు సంబంధించిన నిర్ణయాలన్నీ జిల్లా నుండే చేయాల్సి ఉండటంతో కలెక్టర్ బాధ్యతల్లో నియమించడం ద్వారా ప్రక్రియను వేగవంతం చేయొచ్చని అంచనా వేస్తున్నారు. ఒకవేళ సాధ్యంకాని పక్షంలో పట్టణాభివృద్ధిశాఖ కమిషనర్‌గా నియమించొచ్చని సమాచారం. మొత్తంగా గత పూలింగు సమయంలో కీలకంగా వ్యవహరించిన అధికారులందరినీ రెండోదశ పూలింగు ప్రక్రియలో భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

అన్నదాతకు వర్షం టెన్షన్..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీసాగులో అన్నదాత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అకాల వర్షాలు రైతులను వెంటాడటంతో ధాన్యం రైతు అడుగడుగునా నలిగిపోయిన పరిస్థితి నెలకొంది. ధాన్యం కొనుగోలు చివరి దశకు చేరుకున్నప్పటికీ అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రబీలో పశ్చిమలో 2.13 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 80 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ఏప్రిల్ రెండో వారం నుంచి ముమ్మరంగా వరి మాసూళ్లు ప్రారంభమయ్యాయి. 'పశ్చిమ'లో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసిన అధికారులు, ఏడు లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ 71,469 మంది రైతుల నుంచి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.1,515 కోట్లు సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఏలూరు జిల్లాలో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం కాగా 2.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు చేసి రూ.485.62 కోట్లు వరకూ రైతుల ఖాతాల్లో జమ చేశారు. ధాన్యం సొమ్ము మాత్రం 24 గంటలు గడవక ముందే రైతుల ఖాతాల్లో జమ కావడం రైతులకు ఊరటనిచ్చే అంశంగా చెప్పొచ్చు. రబీ ధాన్యం కొనుగోలు ప్రారంభం నుంచి అకాల వర్షాలు అన్నదాతను వెంటాడుతూనే ఉన్నాయి. రెండు, మూడు రోజులకోసారి పెద్దఎత్తున ఈదురుగాలులు, వర్షం రైతులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కొనుగోలులో టార్గెట్లతో ఏర్పడిన ఇబ్బందులు రైతులను కొంత ఉక్కిరిబిక్కిరి చేసింది. గడిచిన రెండు రోజులుగా వెంటాడుతున్న అకాల వర్షాలతో వరి రైతులు ఇంకా ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా పశ్చిమగోదావరి జిల్లాలో లక్ష టన్నులు, ఏలూరు జిల్లాలో 20 వేల టన్నుల వరకూ ధాన్యం రైతుల వద్దనే ఉంది. కొనుగోలుకు ఇబ్బంది లేకపోయినప్పటికీ మాసూళు కొంత ఆలస్యమైనచోట్ల రైతులు వర్షాలతో ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బతిన్న పంటలకు 24 గంటల్లో నష్టపరిహారం ఇవ్వాలని సిఎం చెప్పారు. రెండు జిల్లాల్లో ధాన్యం తడిసినప్పటికీ నష్టం పరిగణనలోకి రాదనే కారణంతో జిల్లా రైతులకు ఎటువంటి పరిహారమూ అందని పరిస్థితి ఏర్పడింది. రబీలో ఈసారి ధాన్యం దిగుబడులు బాగా వచ్చినప్పటికీ అకాల వర్షాలతో రైతులు నానావస్థలు పడ్డారు. చివరి దశలో సైతం తిప్పలు తప్పకపోవడంపై అన్నదాత తీవ్ర ఆవేదనకు గురవుతున్నాడు.

మామిడి రైతులకు కోలుకోలేని దెబ్బ

అకాల వర్షాలు మామిడి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. ఏలూరు జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల్లో రైతులు మామిడి విస్తీర్ణం ఉంది. ఒక్క నూజివీడు డివిజన్‌లోనే 35 వేల ఎకరాల్లో మామిడి ఉంది. ఈదురు గాలులు, అకాల వర్షాలకు మామిడికాయలు రాలిపోవడంతో రైతులకు తీరని నష్టం ఏర్పడింది. మొన్నటి వరకూ టన్ను మామిడి ధర రూ.13 వేల వరకూ ఉండగా గడిచిన రెండు రోజుల్లో టన్ను రూ.ఏడు వేలకు పడిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ధర కోసం ఆగుదామని రైతులు వేచిచూసే పరిస్థితి లేకుండా పోయింది. ఈదురుగాలులకు కాయలు రాలిపోతున్నాయి. దీంతో రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సిన దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది అకాల వర్షాలు మామిడి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. అకాల వర్షాలు వరి, మామిడి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయని చెప్పొచ్చు.

'లేపాక్షి నంది'తో పోస్ట్‌కార్డు విడుదల

ప్రజాశక్తి-లేపాక్షి



లేపాక్షిలో శుక్రవారం నంది విగ్రహంతో కూడిన శాశ్వత తపాలా ముద్రను, వీరభద్రస్వామి దేవస్థానంపై ప్రత్యేక పోస్ట్ కార్డులను సిపిఎంజి ప్రకాష్ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ తపాలా ముద్రణతో లేపాక్షి నంది విశిష్టత ప్రపంచ నలుమూలలా విస్తరిస్తుందన్నారు. లేపాక్షి నంది చిత్రంతో పాటు ఆలయంలోని వేలాడే స్తంభం, వినాయకుడు, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణ మండపం చిత్రాలతో పోస్ట్ కార్డులు ముద్రించారన్నారు. వీటి పోస్టు కార్డులు పోస్ట్ ఆఫీస్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో కర్నూల్ రీజినల్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ వెన్నం ఉపేంద్ర, పోస్టల్ సూపరింటెండెంట్ విజయకుమార్, లేపాక్షి పుస్తక రచయిత చిదంబరరెడ్డి, పోస్టల్ శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై తహశీల్దార్ ఫిర్యాదు

- దుర్భాషలాడారని ఆవేదన

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రపై మండల తహశీల్దార్ జయలక్ష్మి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 15 రాత్రి 9.59 నిమిషాలకు తనకు వాట్సాప్ కాల్ చేసి అసభ్య పదజాలంతో దుర్భాషలాడారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. చెప్పడానికి వీలుకాని భాషలో ఎమ్మెల్యే దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఆయన ఎందుకు దుర్భాషలాడారనేది తహశీల్దార్ ఫిర్యాదులో పేర్కొనలేదు. భూముల వ్యవహారాలకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలని ఒత్తిడి చేయడం.. తహశీల్దార్ జయలక్ష్మి ఆ పనులు చేయని కారణంగా ఎమ్మెల్యే బోనెల దుర్భాషలాడినట్లు తెలిసింది. తహశీల్దార్ జయలక్ష్మి కొద్ది నెలల క్రితం బదిలీపై రాయలసీమ ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వ్యవహారశైలిపై తహశీల్దార్ జయలక్ష్మి.. డిఆర్ఒ, జెసిలకు కూడా ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

మహిళల పురోగతికి ఆటంకంగా లింగ అంతరాలు

- ఎంట్రీ లెవెల్ నుంచి ఉన్నత స్థాయి వరకు అనేక సవాళ్లు
- భారత్, నైజీరియా, కెన్యాలో ఆందోళనకరం
- మెకిన్సే తాజా నివేదిక వెల్లడి

దేశంలో మహిళల అభ్యున్నతి పట్ల తమకెంతో శ్రద్ధ ఉన్నదన్నట్టు ఉపన్యాసాలతో ఊదరగొట్టే మోడీ సర్కారు.. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను మాత్రం పరిష్కరించలేకపోతున్నది. 'బేటీ బచావో, బేటీ పడావో', 'ఉజ్వల్ యోజన', 'నారీ శక్తి', అంటూ ఉదాహరణలుగా చూపే బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం... ఉద్యోగాల విషయంలో మహిళలకు అడ్డంకిగా మారిన లింగ అంతరం అనే సమస్యను నియంత్రించే విషయంలో మాత్రం విఫలమవుతున్నది. దీంతో అన్ని అర్హతలున్నా.. ప్రతి రంగంలోనూ మహిళలు వెనుకబడి పోతున్నారు. మెకిన్సే నివేదిక 'ఉమెన్ ఇన్ ది వర్క్‌ప్లేస్ 2025' నివేదిక ఇదే విషయాన్ని వెల్లడించింది.



న్యూఢిల్లీ : భారత్‌లో రంగమేదైనా లింగ అంతరం అనే సమస్య ఇప్పటికీ ఆందోళన కలిగిస్తున్నది. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ సమస్య మాత్రం పూర్తిగా తొలగిపోవటం లేదు. అంతేకాదు, ఇంతో ప్రభుత్వ పర్యవేక్షణ ఉండే అధికారిక రంగం (ఫార్మల్ సెక్టార్)లోనూ ఈ పరిస్థితే ఉన్నాయి. లింగ అంతరంతో మహిళలు వెనుకబడిపోతున్నారు. ఫార్మల్ సెక్టార్‌లలో భారత్‌తో పాటు నైజీరియా, కెన్యా దేశాలలో లింగ అంతరాలు స్పష్టంగా ఉన్నాయని మెకిన్సే నివేదిక చెప్తున్నది. 14 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్న 324 సంస్థల డేటా ఆధారంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. వ్యవస్థాగత అడ్డంకులు, ప్రత్యేక సవాళ్లను ఇది హైలెట్ చేసింది.

ఈ నివేదిక ప్రకారం... భారత్‌లో ఈ పరిస్థితులు కఠినంగా ఉన్నాయి. ప్రారంభస్థాయి (ఎంట్రీ లెవెల్) నుంచి నిర్వాహక పాత్ర(మేనేజరియల్ రోల్స్)ల వరకు మహిళల పురోగతికి ఆటంకం కలిగించే కఠిన దశను ఎదుర్కొంటున్నది. భారత్‌లోని అధికారిక ప్రయివేటు రంగంలో మహిళలు తమ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లే విషయంలో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వారు తమ కెరీర్‌లో ఎంట్రీ లెవెల్ నుంచి నిర్వాహక పాత్ర వరకు ప్రమోషన్లలో అవకాశాలు దక్కటం లేదు. ఇది వారి కెరీర్‌లో పురోగతిని పరిమితం చేస్తున్నది. విశ్వ విద్యాలయం గ్రాడ్యుయేట్లలో దాదాపు సగం మంది వారు ఉన్నప్పటికీ.. ఉన్నత స్థాయిలలో మాత్రం మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉన్నది.

ప్రారంభ అడ్డంకులు, శ్రామిక శక్తిలో తీవ్ర తగ్గుదల

ఫార్మల్ సెక్టార్‌లో ముందుకెళ్లే విషయంలో మహిళలకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. యూనివర్సిటీ గ్రాడ్యుయేట్లు 48 శాతం ఉంటే.. ప్రారంభస్థాయిలో కేవలం 33 శాతం రోల్స్‌ను వారు పోషిస్తుండటం గమనార్హం. ఇక మేనేజరియల్ స్థాయిలో ఈ ప్రాతినిధ్యం ఇంకా తగ్గుదలను చూస్తున్నది. 24 శాతం మంది మాత్రమే ఇలాంటి స్థానాల్లో ఉంటున్నారు. ఈ స్థాయిలో పురుషులు పదోన్నతిని పొందే అవకాశం 2.1 రెట్లు ఉన్నట్టు తెలుస్తున్నది. ఇది అభివృద్ధి అవకాశాలలో వ్యవస్థాగత లింగ అసమానతలను ఎత్తి చూపుతున్నది. భారత ప్రయివేటు సెక్టార్‌లోని సీ-సూట్ స్థానాల్లో 17 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. సీనియర్ లీడర్‌షిప్‌నకు వెళ్లటంలో మహిళలకు ఉన్న పరిమిత యాక్సెస్‌ను ఇది తెలియజేస్తున్నది.

శ్రామికశక్తిలోకీ ఆలస్యంగా స్త్రీలు


మహిళల ప్రాతినిధ్యం విషయంలో వయసు అనే అంశం కూడా కీలకంగా మారుతున్నది. పురుషుల కంటే మహిళలు శ్రామికశక్తిలో చాలా ఆలస్యంగా చేరుతారు. ఈ విషయంలో ప్రారంభస్థాయిలో పురుషుల సగటు వయసు 32 ఏండ్లుఉంటే.. మహిళది 39 ఏండ్లుగా ఉన్నది. అంటే సగటు వయసు అంతరం ఏడేండ్లు. కొన్ని రంగాలలో ఈ అసమానతలు మరింత ఎక్కువగా కనిపిస్తాయి. ఆర్థిక సేవలలో మహిళలు ఎంట్రీ-లెవెల్ పాత్రలలో 31 శాతం ఉన్నారు. కానీ, సీ-సూట్ స్థానాల్లో 13 శాతమే ఉండటం గమనార్హం. న్యాయవాద వృత్తి కూడా ఇదే విధమైన క్షీణతను చూపిస్తున్నది. మహిళలు ఎంట్రీ-లెవెల్ రోల్స్‌లో 51 శాతం ఉన్నారు. కానీ.. సీనియర్ లీడర్‌షిప్‌లో మాత్రం వారి వాటా 32 శాతంగానే ఉండటం గమనార్హం.

'ప్రభుత్వాలు వారిని ప్రోత్సహించాలి'

సామాజిక, కుటుంబ సమస్యలు, బాధ్యతలను ఎదుర్కొని మరీ ఉద్యోగాలు చేస్తున్న మహిళల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింతగా దృష్టిని సారించాలని సామాజికవేత్తలు, కార్యకర్తలు అంటున్నారు. వారిని మరింతగా ప్రోత్సహించాలని చెప్తున్నారు. మహిళాసాధికారతను సాధించటం కోసం మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. ఈ విషయంలో ఫార్మల్ సెక్టార్‌లోని సంస్థలకూ ఆదేశాలివ్వాలని చెప్తున్నారు.

'గుజరాత్ సమాచార్' సహ వ్యవస్థాపకుడి అరెస్టు

- ఇది చర్య ప్రజాస్వామ్యానికి ప్రమాదం : కాంగ్రెస్



న్యూఢిల్లీ : గుజరాత్‌లోని ప్రముఖ వార్తాపత్రిక 'గుజరాత్ సమాచార్' వ్యవస్థాపకుల్లో ఒకరైన బాహుబలిషాను ఇడి అదుపులోకి తీసుకుంది. గురువారం రాత్రి అహ్మదాబాద్‌లోని బాహుబలిషా కార్యాలయ ప్రాంగణంలో ఇడి అధికారులు సోదాలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారు జామున అతన్ని అరెస్టు చేశారు. గుజరాత్ సమాచార్‌ను నడిపే లోక్‌ప్రకాశన్ లిమిటెడ్ డైరెక్టర్లలో బాహుబలిషా ఒకరు. ఆయన సోదరుడు శ్రేయాన్స్ షా పత్రికకు మేనేజింగ్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున బాహుబలిషాను ఇడి అదుపులోకి తీసుకుందని శ్రేయాన్స్ నిర్వహిస్తున్న గుజరాతీ వార్తా చానల్ జిఎస్‌టివిలో డిజిటల్ సేవల చీఫ్ తుషార్ దవే పేర్కొన్నారు. ఇడి షాను మొదట వివిఎస్ ఆస్పత్రికి తీసుకువెళ్లిందని, ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించిన అనంతరం నగరంలోని జైడస్ ఆస్పత్రికి తరలించిందని అన్నారు. ఈ అరెస్టుపై ఇడి ఇంత వరకూ స్పందించలేదు.

ప్రజాస్వామ్య గొంతును అణచివేసే కుట్ర : రాహుల్‌గాంధీ

బాహుబలి షాను నిర్బంధించడం దేశ ప్రజాస్వామ్య గొంతును అణచివేసే కుట్రగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. దేశాన్ని దండన లేదా భయంతో నడపలేరని, సత్యం, రాజ్యాంగంతో భారత్ పరిపాలించబడుతుందని శుక్రవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. గుజరాత్ సమాచార్ దాడి వార్తాపత్రిక గొంతుకే కాదు, మొత్తం ప్రజాస్వామ్య గొంతును అణచివేసేందుకు చేసిన మరో కుట్ర అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాహుబలిషా అరెస్టుపై కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కూడా తీవ్రంగా స్పందించారు. స్వతంత్ర మీడియాపై ప్రభుత్వం ఒత్తిడి తెస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రాణాంతకమని తెలిపారు.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM

O.A. No. 1080 / 2024

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the RDBI Rules, 1993.

Between:

Union Bank of India, Kanuru Branch, Ashok Nagar, Opposite Time Hospital, Kanuru, Vijayawada Andhra Pradesh-520007. ....Applicant Bank

And

Kokkiligadda Jhansi, W/o John Babu ....Defendant

To,

SD- Kokkiligadda Jhansi, W/o. John Babu, D.No. 8-100, Kamayyathopu, Kanuru, Autonagar, Vijayawada, Andhra Pradesh-520007.

SUMMONS TO THE DEFENDANT SD BY THE WAY OF PAPER PUBLICATION

WHEREAS, OA-1080/2024 filed was listed before Hon'ble Presiding Officer/ Registrar on 28/05/2025.

WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under Section 19(4) of the Act, OA-1080/2024 filed against you for recovery of debts of Rs. 40,46,189.05/- (Application and copies of document enclosed) In accordance with Sub-Section (4) of the Sec 19 of the Act you the defendant are directed as under:-

(i) to show cause within 15 days of the service of summons as to why relief prayed for should not be granted:

(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;

(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment;

(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;

(v) You shall be liable to account for the sale proceeds realized by the sale of secured assets or other assets and properties in the ordinary course of the business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institution holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on 28/05/2025 at 10:30 AM failing the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this 6th May, 2025

Signature of the Officer,
Authorized to issue summons

హిమానీనదాలు కరిగిపోతున్నాయి

- కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్

ఖాట్మండు : హిమాలయ ప్రాంతంలోని హిమానీనదాలు వేగంగా కరిగిపోతున్నాయని, పర్యావరణం దెబ్బతింటోందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచంలోని ఎత్తయిన పర్వతాలలో వాతావరణ సంక్షోభం తీవ్రమవుతోందని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ చెప్పారు. శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి, కీలకమైన పర్యావరణ వ్యవస్థలను రక్షించుకోవడానికి ప్రాంతీయ సహకారం అవసరమని ఆయన అన్నారు. ఖాట్మండులో శుక్రవారం ప్రారంభమైన 'సాగర్ మాత సంబాద్' కార్యక్రమంలో యాదవ్ ప్రసంగిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన అంతర్ ప్రభుత్వ వేదిక ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ (ఐబిసిఎ) కింద హిమాలయ దేశాలు వన్యప్రాణుల సంరక్షణలో నాయకత్వ పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నేపాల్ ప్రభుత్వం శుక్రవారం నుండి ఆదివారం వరకూ వాతావరణ మార్పులు, పర్వతాలు అనే అంశంపై మొట్టమొదటి సాగర్ మాత సంబాద్‌ను నిర్వహిస్తోంది. మన పర్వతాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయని యాదవ్ చెప్పారు. వాతావరణ మార్పుల కారణంగా మంచు కరిగిపోవడం, జీవవైవిధ్య ఒత్తిడులు, జల అభద్రత వంటి ఆందోళనకరమైన పరిణామాలు సంభవిస్తాయని, వీటిపై వెంటనే దృష్టి సారించాలని సూచించారు. పర్వతాల జీవనోపాధి, పురాతన సంస్కృతికి ముప్పు పొంచి ఉన్నదని అన్నారు. పర్యావరణ సంక్షోభ భారంలో హిమాలయాలది గణనీయమైన భాగమని చెప్పారు. సంపన్న దేశాలు తమ నిబద్ధతను విస్మరించాయని యాదవ్ ఆరోపించారు.

సల్మాన్ రష్దీపై దాడి కేసులో దోషికి 25 ఏళ్ల జైలు

న్యూయార్క్ : ప్రముఖ సల్మాన్ రష్దీపై కత్తితో దాడి చేసిన కేసులో దోషిగా నిర్ధారించిన 27 ఏళ్ల హది మాటర్‌కు అమెరికాలోని కోర్టు 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 2022లో న్యూయార్క్‌లో ఒక వేదికపై సల్మాన్ రష్దీ ప్రసంగిస్తుండగా, హది మాటర్ కత్తితో అనేకసార్లు దాడి చేయడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ దాడిలో రష్దీ తీవ్రంగా గాయపడటమే కాకుండా, ఒక కన్నును కోల్పోయారు. ఈ కేసు విచారించిన న్యూయార్క్ రాష్ట్రంలోని చౌటౌక్వా కౌంటీ జిల్లా అటార్నీ జాసన్ స్మిత్ ఈ మేరకు తీర్పు వెల్లడించారు. రష్దీపై హత్యాయత్నం చేసినందుకు మాటర్‌కు గరిష్టంగా 25 ఏళ్లు, రష్దీని తీవ్రంగా గాయపర్చినందుకు ఏడేళ్ల జైలు శిక్ష విధించారు. ఈ శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని ఆదేశించారు. మాటర్‌కు 12 ఏళ్ల జైలు శిక్ష సముచితమని వాదించిన పబ్లిక్ డిఫెండర్ నథానియల్ బరోన్ వాదనలను జడ్జి ఖండించారు. ఈ విచారణకు బాధితుడు, కీలక సాక్షి 77 ఏళ్ల సల్మాన్ రష్దీ స్వయంగా హాజరుకాలేదు. కోర్టుకు తన ప్రకటనను సమర్పించారు. ముసుగు ధరించిన వ్యక్తి తన తలపై, శరీరంపై దాడి చేస్తున్నప్పుడు తాను చనిపోతున్నాననే భావన కలిగిందని ప్రకటనలో వివరించారు.

దాహం దాహం!

ప్రజాశక్తి -సోమల

చిత్తూరు జిల్లా సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని 42 కుటుంబాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. గతంలో గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే బోరుబావిలో నీటి మట్టం తగ్గి నీరు పుష్కలంగా రాకపోవడంతో పంచాయతీ వారు బోరు వద్దే నీటిని పట్టుకునే ఏర్పాటు చేశారు. బోరు నుండి ప్రజలకు సరిపడ నీరు రావడం లేదు. దీంతో గంటలు తరబడి నిరీక్షించి పట్టుకుని ఇళ్లకు తీసుకువెళుతున్నారు. దీనిపై సర్పంచి రెడ్డెప్పను విలేకరి ఫోన్ ద్వారా సంప్రదించగా బోరు బావిలో నీటిమట్టం తగ్గిందని అదనపు పైపులు ఏర్పాటు చేస్తే ప్రజలకు అవసరమైన తాగునీరు అందించవచ్చని తెలిపారు. శనివారం అదనపు పైపులు బోరులో దించి ప్రజలకు తగినంత తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు.

ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందే

- నిరాకరిస్తే సహించేది లేదంటూ ఢిల్లీ, యుపి పోలీసులపై హైకోర్టు ఆగ్రహం
- విద్యార్థి అనుమానాస్పద మృతిపై కేసు నమోదుకు ఆదేశం

న్యూఢిల్లీ : గత ఏడాది డిసెంబరులో 20 ఏళ్ల విద్యార్థి అనుమానాస్పద మృతిపై ఇంకా కేసు నమోదు చేయని ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ పోలీసుల తీరుపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధితుడు, లేదా ఫిర్యాదుదారుడు వెల్లడించిన విషయాల ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా పోలీసులు నిరాకరించడాన్ని ఎప్పటికీ సహించలేమని స్పష్టం చేసింది. విద్యార్థి అనుమానాస్పద మృతిపై ఢిల్లీ పోలీసులు తక్షణమే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, వారు సేకరించిన అన్ని ఆధారాలతో సహా వారం రోజుల్లోగా ఉత్తర ప్రదేశ్ పోలీసులకు కేసు బదిలీ చేయాలని జస్టిస్ అనుప్ జైరామ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఆదేశించించింది. ఉత్తర ప్రదేశ్ పోలీసులు మరింత ఆలస్యం, నిర్లక్ష్యం లేకుండా కేసు వెంటనే దర్యాప్తు చేయాలని కోర్టు పేర్కొంది. గతేడాది డిసెంబరు 3 ఉదయం నోయిడాలోని తన ఇంటి నుంచి కళాశాలకు కారులో బయలుదేరిన ఢిల్లీ కళాశాల విద్యార్థి హర్ష్ కుమార్ శర్మ అదృశ్యమయ్యాడు. అదేరోజు రాత్రి 11:30 గంటల సమయంలో గ్రేటర్ నోయిడాలోని ఆర్‌సిఐ హాస్టల్ సమీపంలో ఆ కారులోనే అతని మృతదేహాన్ని గుర్తించారు. కారు లోపల కార్బన్ మోనాక్సైడ్ సిలిండర్, సిరంజిలు, డైరీలను గుర్తించారు. పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు. కారు, సిలిండర్, సిరంజిలను స్వాధీనం చేసుకోలేదు. ఫోరెన్సిక్ దర్యాప్తును కూడా నిర్వహించలేదు. ముఖ్యమైన సాక్ష్యం కారును కుటుంబానికి తిరిగి ఇవ్వడంపై కూడా కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

శాసనసభలు పనిచేసింది సగటున 20 రోజులే

- ఆమోదించిన బిల్లులు 500

న్యూఢిల్లీ : దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన శాసనసభలు గత సంవత్సరం సగటున 20 రోజుల 100 గంటలు మాత్రమే పనిచేశాయి. ఆ కాలంలో 17 బిల్లులను ఆమోదించాయి. వీటిలో 51 శాతం బిల్లులు ప్రవేశపెట్టిన ఒక రోజు వ్యవధిలోనే ఆమోదం పొందాయి. పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్ సంస్థ అధ్యయనం ఈ విషయాలను తెలియజేసింది. ఒడిషా శాసనసభ 42 రోజులు, కేరళ శాసనసభ 37 రోజులు, పశ్చిమ బెంగాల్ శాసనసభ 36 రోజులు పనిచేసి కొంత మెరుగనిపించాయి. కర్నాటక శాసనసభ ఏడాదికి 60 రోజులు సమావేశం కావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ కేవలం 29 సిట్టింగ్స్ మాత్రమే జరిగాయి. అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ ఏడాదికి 90 సిట్టింగ్స్ జరపాలని అనుకుంటే కేవలం 16 సమావేశాలతోనే సరిపెట్టింది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ కూడా 16 రోజులే సమావేశమైంది. మణిపూర్‌లో 14, జమ్మూకాశ్మీర్‌లో 5, నాగాలాండ్‌లో 6, సిక్కింలో 8 రోజుల పాటు శాసనసభ సమావేశాలు జరిగాయి.

రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర శాసనసభలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేశం కావాల్సి ఉంటుంది. ఒకటి రెండు రోజుల స్వల్పకాలిక సిట్టింగ్స్‌తో కలిపి 11 రాష్ట్రాలలో ఈ నియమాన్ని పాటించారు. 2017 నుండి ఏడాదికి సగటున 30 రోజుల కంటే తక్కువగా సమావేశాలు జరిగాయి. ఆ సమయంలో 28 సిట్టింగ్స్ జరిగాయి. 2020లో కోవిడ్ కారణంగా ఆ సంఖ్య 16కు పడిపోయింది. అప్పటి నుండి సగటున ఏడాదికి సుమారు 20 రోజుల పాటే సమావేశాలు జరిగాయి. 2018లో సగటున 26 సిట్టింగ్స్, 2019లో 24 సిట్టింగ్స్, 2021, 2022లో 21 సిట్టింగ్స్ చొప్పున, 2023లో 22 సిట్టింగ్స్ జరగగా గత సంవత్సరం ఆ సంఖ్య 20కి తగ్గిపోయింది.

కొన్ని రాష్ట్రాలు శాసనం ద్వారా లేదా నిబంధనలను రూపొందించుకోవడం ద్వారా కనీస వార్షిక సిట్టింగ్స్‌ను నిర్దేశించుకున్నప్పటికీ 2017-2024 మధ్య వాటిలో ఏ రాష్ట్రమూ లక్ష్యాన్ని చేరలేదని నివేదిక వేలెత్తి చూపింది. గత సంవత్సరం శాసనసభలు సగటున 100 గంటలు సమావేశమయ్యాయి.

కేరళ అత్యధికంగా 228 గంటల పాటు సమావేశం నిర్వహించగా ఒడిషా (193 గంటలు), మహారాష్ట్ర, రాజస్థాన్ (187 చొప్పున), గోవా (172), ఛత్తీస్‌గఢ్ (155), తెలంగాణ (149), కర్నాటక (145 గంటలు) తర్వాతి స్థానాలలో నిలిచాయి. బిల్లులకు సంబంధించి సగటున ప్రతి శాసనసభ 17 బిల్లులను ఆమోదించింది. గత సంవత్సరం మొత్తంమీద 500 బిల్లులు ఆమోదం పొందాయి. 49 బిల్లులతో కర్నాటక మొదటి స్థానంలో నిలవగా తమిళనాడు (45), హిమాచల్ ప్రదేశ్ (32), మహారాష్ట్ర (32) తర్వాతి స్థానాలలో నిలిచాయి. ఢిల్లీ శాసనసభ కేవలం ఒకే బిల్లును ఆమోదించగా రాజస్థాన్ అసెంబ్లీ రెండు బిల్లులకు ఆమోదం తెలిపింది.



భుజ్‌లో సైనికులతో మాట్లాడుతున్న రాజ్‌నాథ్‌సింగ్

పాక్‌కు నిధులిస్తే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్టే

- రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

న్యూఢిల్లీ : పాకిస్తాన్‌కు నిధులిస్తే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్టే అవుతుందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. గుజరాత్‌లోని భుజ్‌లో భారత వైమానిక దళం (ఐఎఎఫ్) స్థావరాన్ని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శుక్రవారం సందర్శించారు. ఆయనతోపాటు వైమానిక దళ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ కూడా ఉన్నారు. పాక్ దాడులను తిప్పికొట్టిన సైనికులను మంత్రి అభినందించారు. భారత ప్రజల తరపున మన సైన్యం మనకు గర్వకారణం అనే సందేశాన్ని తీసుకొచ్చామన్నారు. పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయిన పౌరులకు, ఆపరేషన్ సిందూర్ సమయంలో వీరమరణం పొందిన సైనికులకు రక్షణమంత్రి నివాళులర్పించారు. గాయపడిన సైనికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి వచ్చిన నిధుల్లో ఎక్కువ భాగాన్ని పాకిస్తాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేస్తోందని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన ఉగ్రవాద స్థావరాలను పునర్నిర్మించడానికి జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు రూ.14 కోట్లు ఇస్తున్నట్లు పాక్ ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. ఐఎంఎఫ్ పాక్‌కు నిధులు సమకూర్చడంపై పునరాలోచన చేయాలని కోరారు.

జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్లు

- ఆరుగురు ఉగ్రవాదులు మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో గత మూడు రోజుల్లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లల్లో ఆరుగురు ఉగ్రవాదులు మరణించినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. దక్షిణ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లా అవంతిపోరాలో విక్టర్ ఫోర్స్ ప్రధాన కార్యాలయంలో కాశ్మీర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి) వికె బిర్ది మీడియాతో మాట్లాడారు. మంగళవారం షోపియన్ జిల్లా కెల్లర్ ప్రాంతంలోనూ, గురువారం పుల్వామాలోని త్రాల్‌లోని నాదర్ ప్రాంతంలోనూ జరిగిన ఎన్‌కౌంటర్లలో ముగ్గురేసి చొప్పున ఉగ్రవాదులు మరణించారని చెప్పారు.

జమ్ముకాశ్మీర్ పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) సమన్వయంతో ఆ ఆపరేషన్లు నిర్వహించాయన్నారు. విక్టర్ ఫోర్స్ కమాండింగ్ జనరల్ ఆఫీసర్ మేజర్ జనరల్ ధనంజయ్ జోషి మాట్లాడుతూ కాశ్మీర్ లోయలో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగిన నేపథ్యంలో అన్ని భద్రతా దళాలు తమ వ్యూహాలను సమీక్షించాయని చెప్పారు. మంచు కరగడం వల్ల ఉగ్రవాదులు ఎత్తైన ప్రాంతాలకు తరలివెళ్లారని నిఘా సమాచారం అందిందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తమ బృందాలు నిరంతరం ఎత్తైన ప్రాంతాలు, పర్వత ప్రాంతాలు, అడవుల్లో మోహరించాయని చెప్పారు. మృతుల్లో షాహిద్ కుట్టాయ్ సర్పంచ్‌పై దాడి, డానిష్ రిసార్ట్‌లో కాల్పుల సంఘటన వంటి వాటిలో ప్రధాన నిందితుడని తెలిపారు.

MANAPPURAM HOME FINANCE LTD.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
CIN: U65923K12010PIC039179, యూనిట్ నెం.301 నుండి 315, ఎ వింగ్, 'కనకియా వాల్ స్ట్రీట్', అంధేరి-కుర్లా రోడ్, అంధేరి ఈస్ట్, ముంబై 400093

డిమాండ్ నోటీసు

ఏదైతే, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, మా రిజిష్టర్డు ఆఫీసు: 4/470ఏ (పాతది) డబ్ల్యు/368ఏ (కొత్తది), మణప్పురం హౌస్, వలపాడ్, త్రిస్సూర్, కేరళ-680567 కలిగియుండి మరియు ఇండియాలోని వివిధ ప్రదేశాలలో శాఖలు (ఇకపై "MAHOFIN"గా పేర్కొనబడును) అనేది కంపెనీల చట్టం, 1956 క్రింద నమోదైన కంపెనీ మరియు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంట్రెస్ట్(ఇకపై చట్టంగా సూచిస్తారు)లోని సెక్షన్ 2 యొక్క ఉప-సెక్షన్ 1యొక్క క్లాజు(4) అర్ధంలోపు ఫైనాన్సియల్ ఇన్‌స్టిట్యూషన్‌గా నోటిఫికేషన్ నెం.ఎస్.ఓ 3466 (ఇ), తేదీ.18 డిసెంబర్, 2015తో చదవగల భారత ప్రభుత్వం, ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ, నిర్మాణం మరియు /లేదా నివాసయూనిట్ల కొనుగోలు కోసం అడ్వాన్సింగ్ లోన్‌ల వ్యాపారాన్ని కొనసాగించడం మరియు దిగువ కాలమ్ నెం.2లో పేర్కొన్న విధంగా రుణగ్రహీత / సహ-రుణగ్రహీతలు పేర్కొన్న చార్ట్ MAHOFIN నుండి రుణం పొందింది మరియు అయితే SARFAESI, చట్టం కింద రుణదాత, మరియు పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(2) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించండం ద్వారా సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట) రూల్స్ 2002లోని రూల్ 2తో చదవగల, దిగువ పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు / సహ-రుణగ్రహీతలను నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు తదుపరి వడ్డీతో నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని డిమాండ్ నోటీసు జారీచేయబడినది కానీ వివిధ కారణాల వలన వారిలో కొందరికి నోటీసులు అందజేయబడలేదు. దానితో పాటుక్రింద పేర్కొనబడిన రుణగ్రహీతల సమాచారం ప్రయోజనాల కోసం, ఈ పబ్లిక్ నోటీసు ద్వారా సదరు రుణగ్రహీతలకు తెలియజేయబడుతోంది.

క్ర.సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత పేరు/ లాన్/ బ్రాంచ్	క్రియేట్‌చేసిన ఇంట్రెస్ట్‌కు సంబంధించి సెక్యూర్డు అసెట్ వివరణ	ఎన్‌పిఏ తేది	నోటీసు పంపిన తేదీ & బాకీపడిన మొత్తం
1	భీమవరపు వీర్లంకయ్య, భీమవరపు పావని, భీమవరపు శ్రీనివాసరావు/ NHL00310015833/ విజయవాడ	ఆర్ఎస్ నెం.36/5లోని ఆర్‌సిసి దాబా కలిగిన 141.4 చదరపు గజాల స్థలం, డోర్ నెం.3/416, అసెస్ట్ నెం.416, కొటికలపూడి గ్రామం, కొటికలపూడి గ్రామ పంచాయతీ, ఇబ్రహీంపట్నం మండలం, పి.ఓ. ఇబ్రహీంపట్నం, జిల్లా ఎన్టీఆర్, ఆంధ్రప్రదేశ్, పిన్-521456. సరిహద్దులు: తూర్పు: పంచాయతీ బజార్, పడమర: భీమవరపు మార్తమ్మ ఆస్తి, దక్షిణం: నంబూరి పూర్ణ చంద్రరావు ఆస్తి, ఉత్తరం: దాసరి దేవదాసు ఆస్తి.	24-04-2025	28-04-2025 & Rs.993362/-
2	బొల్లం ప్రవీణ్, బొల్లం నవీన్‌రాజ్, రాచమల్ల రాజు/ MO90LALONS000005 011038/విజయవాడ	ఆర్‌సిసి గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు నివాస గృహం దాని ఇంటి నెం. 1-74/1 (పాతది), 47-1-74/1 (పాతది), 47-1-110 (కొత్తది), ఓపెన్ ప్లాట్ విస్తీర్ణం 290.00 చ.గ.లు లేదా 242.46 చ.మీ.లు, ప్లింత్ ఏరియా 757.00 చ.అ.లు, పడిపల్లి గ్రామం, హన్మకొండ మండలం, వరంగల్ జిల్లా, పి.ఓ. దేశాయిపేట (వరంగల్), వరంగల్, ఆంధ్రప్రదేశ్, పిన్: 506006. సరిహద్దులు: తూర్పు: బొల్లం రంగయ్య ఇంటి నెం.47-1-71 మరియు బొల్లం కొమురయ్య ఇంటి నెం.47-1-72, పడమర: బొల్లం చేరాలు ఇంటి నెం.47-1-71, దక్షిణం: 15-0 వెడల్పు రోడ్డు, ఉత్తరం: పల్లం వీరస్వామి ఇంటినెం.47-1-68 మరియు బాసబోయిన కట్టయ్య ఇంటి నెం.47-1-70.	24-04-2025	28-04-2025 & Rs.1933177/-
3	బచల అపరంజి, బచ్చల ప్రశాంత్/ MA90MHL ONS000005010717/ విజయవాడ	ఆర్‌సిసి ఇల్లు దాని ఇంటి నెం.11-18-442 (గ్రౌండ్ ఫ్లోర్), మొత్తం 110.68 చదరపు గజాలు లేదా 92.54 చ.మీ.లస్థలంలో 56.00 చ.గ.లు లేదా 46.82 చ.మీ.లు, ప్లింత్ ఏరియా 410.00 చ.అ.ల విస్తీర్ణపు ఆర్‌సిసి మరియు 200.00 చ.అ.లతో కాశీబుగ్గ సొసైటీ కాలనీ పక్కన, ఓ సిటీ దగ్గర, వరంగల్ టౌన్, జిల్లా-వరంగల్, పి.ఓ గ్రెయిన్ మార్కెట్, వరంగల్, ఆంధ్రప్రదేశ్, పిన్: 506002. సరిహద్దులు: తూర్పు: ఎం.డి.రహీం ఇంటి నెం.11-18-444, పడమర: నంగి శరత్ కుమార్ ఇంటి నెం.11-18-469/3, దక్షిణం: పద్మ ఇ.నెం.11-18-447, ఉత్తరం: 20 అడుగుల వెడల్పు రోడ్డు.	23-04-2025	28-04-2025 & Rs.338850/-

ఇందు పై పేర్కొన్నట్లుగా రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలకు ప్రకటన ఇస్తూ, ఈ నోటీసు ప్రచురించబడిన 60 రోజుల్లోగా సదరు రుణగ్రహీత/ సహ-రుణగ్రహీతల పై ఇందు పై చూపినట్లుగా పూర్తి బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా వారికి తెలియజేయబడుచున్నది. ఏదైతే సదరు రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత ద్వారా తదుపరి వడ్డీతో పాటు పూర్తి బకాయి మొత్తాలను చెల్లించుటలో విఫలం చెందినట్లైతే, ఎంఎహెచ్ఓ ఫైనాన్స్ పై వివరించినట్లు ఆస్తులపై ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ కొరకు సెక్షన్ 13(4) క్రింద తగిన చర్యలు తీసుకొంతాయి, చట్టం మరియు దాని క్రింద రూపొందిచిన రూల్స్ క్రింద సిఫారసుచేసినట్లుగా ఇతర విధానాల ద్వారా కూడా నోటీసు వారికి అందే విధంగా చర్యలు తీసుకోబడుతుంది. మీ దృష్టికి తేవడమేమనగా, సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(8)లో వివరించినట్లుగా అమ్మకం రూపేనా ట్రాన్స్‌ఫర్ కొరకు బహిరంగ వేలం లేదా ప్రైవేట్ ట్రీటీ కొరకు నోటీసు ప్రచురణ తేదీకి ముందే ఏ సమయమునైనా, ఎంఎహెచ్ఓ ఫైనాన్స్ ద్వారా వెచ్చించిన ఖర్చులు, చార్జీలు మరియు వ్యయాలతోపాటు పూర్తి బకాయి మొత్తాలను చెల్లించి సదరు తాకట్టు ఆస్తులను విడిపించుకోగలరని గమనించ వలసిందిగా మీ దృష్టికి తేవడమైనది.

అమ్మకం, లీజు లేదా ఏదేని ఇతర విధానాల ద్వారా సెక్యూర్డ్ ఆస్తులతో లావాదేవీలు జరుపుట లేదా బదిలీచేయుట నుండి మీరు సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్-13(13) యొక్క నియమాల ద్వారా నిషేధింపబడినారని దయచేసి గమనించగలరు.

తేది: 17.05.2025, ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ — సం/-, అధీకృత అధికారి - మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఎవరి కోసం గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్.?

- నాలుగు దశాబ్దాలుగా హంద్రీనీవా అస్తవ్యస్తం
- సదస్సులో జలసాధన సమితి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అట్టహాసంగా నిర్మాణం చేస్తున్న గోదావరి-బనకచర్ల లింకు ప్రాజెక్టు ఎవరి ప్రయోజనాల కోసం తెరపైకి తెచ్చారో రాయలసీమ ప్రజలకు వివరించాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో 'సాగునీటి సమస్యలు-పరిష్కార మార్గాలు' అనే అంశంపై జలసాధన సమితి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతు సంఘం రాష్ట్ర నాయకులు దనాపురం వెంకటరామిరెడ్డి, జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు అట్టహాసంగా ప్రకటించి, నిర్మాణం చేస్తున్న గోదావరి-బనకచర్ల లింకు ప్రాజెక్టు అస్పష్టంగా ఉందన్నారు. పిపిపి పద్ధతిలో సాగునీటి ప్రాజెక్టు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారుతున్నా హంద్రీనీవా ప్రాజెక్టు అస్తవ్యస్తంగా ఉందన్నారు. రాయలసీమలోని అన్ని నీటి ప్రాజెక్టుల పరిస్థితీ ఇలానే ఉందన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ చేయడం రాయలసీమ ప్రాంత ప్రజలకు అన్యాయం చేయడమే అన్నారు. కృష్ణానదిపై సిద్ధేశ్వరం వద్ద అలుగు నిర్మించాలని ఈ నెల 31వ తేదీన కృష్ణానది సంగమేశ్వరం వద్ద జరుగు బహిరంగ సభలో రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సదస్సులో జలసాధన సమితి నాయకులు పరిగి నవీన్, జమీల్, ఆదినారాయణ, అమానుల్లా, జయరాం రెడ్డి, సోమందేపల్లి హనుమంత రెడ్డి, జన విజ్ఞాన వేదిక నాయకులు రాజశేఖర్ రెడ్డి, లెక్చరర్ గంగిరెడ్డి, పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.

లాంఛనప్రాయ స్వాధీనత నోటీసు

ICICI Bank శాఖా కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068.

ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజుల లోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.

రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ క్రింద వివరించిన ఆస్తిని దిగువసంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకోవడమైనది. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరిండమేమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి జరుపవలెను.

క్ర.సం	రుణగ్రహీత పేరు/ లోను ఖాతా సంఖ్య	ఆస్తి వివరణ/లాంఛనప్రాయ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	ఆర్.కె. స్టోర్స్, వెంకటశివ రామకృష్ణ కలెపల్లి మరియు మద్దుల స్వప్న ప్రియ/ ప్రొప్రైటర్. వెంకటశివ రామకృష్ణ కలెపల్లి ద్వారా ప్రాతినిధ్యం, డో.నం.12-165, వెజిటబుల్ మార్కెట్ ఎదురు, పాతరెడ్డిపాలెం, చేబ్రోలు మట్లూరు రోడ్డు, గుంటూరు-522212/ 058905009174	ఆస్తి వివరణ : పై సైట్ వాటా కొరకు నిర్మించబడిన "మైత్రి ఎన్‌క్లేవ్" యొక్క గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఒక సెమీ ఫినిష్డ్ ఫ్లాట్ నం.101 తో ప్లింత్ ఏరియా 1100 చ.అ.లు. (సాధారణ ఏరియాలు మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియాతో సహా) తో పాటు అవిభక్త మరియు పేర్కొనబడని వాటా కొలత 52.384 చ.గ.లు. (లేదా) 43.89 చ.మీ.లు. సైట్ మొత్తం పరిధి 758.76 చ.గ.లు. (లేదా) 656.99 చ.మీ.లు. మరియు హద్దులు : సైట్ సరిహద్దులు : తూర్పు : కామన్ కారిడార్, దక్షిణం : ఓపెన్ ఏరియా మరియు లిఫ్ట్, పడమర : గ్రౌండ్ లో ఓపెన్ ఏరియా, ఉత్తరం : గ్రౌండ్ లో ఓపెన్ ఏరియా. స్థలం సరిహద్దులు : తూర్పు : ప్లాట్ నం.లు. 4,5,6,7- 136'-0", దక్షిణం : ప్లాట్ నం.18- 52'-0", పడమర : 40' అ.లు. వెడల్పు రోడ్డు 136'-0", ఉత్తరం : ప్లాట్ నం.23- 52'-0". ఈ సరిహద్దుల పేర్కొన్న అనగా పైన పేర్కొన్న "మైత్రి ఎన్‌క్లేవ్" యొక్క గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఒక సెమీ ఫినిష్డ్ ఫ్లాట్ నం.101 తో అన్నీ సౌలభ్య హక్కులు మరియు ఉపకరణాలు మొదలైన వాటితో ఒక కార్ పార్కింగ్ కేటాయింపు. ఆస్తి-2 : గుంటూరు జిల్లా, చేబ్రోలు ఉపజిల్లా, చేబ్రోలు గ్రామ పంచాయతీ ఏరియా, చేబ్రోలు గ్రామం, ప్లాట్ నం.3 కవర్‌చేయబడిన "ఫార్చ్యూన్ హనుమ" లో డో.నం.191/2, డో.నం.191/3, డో.నం.209, డో.నం.210/1, డో.నం.210/2, డో.నం.211, డో.నం.220 అందులో బ్లాక్ నం.1, డో.నం.1-1 వద్ద సైట్ విస్తీర్ణం 196.44 చ.గ.లు. తో పాటు ఆర్‌సిసి రూఫ్ట్ రెసిడెన్షియల్ భవనం గ్రౌండ్ మరియు రెండు అప్పర్ ఫ్లోర్లు ఉన్న హద్దులు : తూర్పు : 40 అ.లు. వెడల్పు రోడ్డు 34.0 అ.లు., దక్షిణం : ప్లాట్ బేరింగ్ నం.4- 52.0 అ.లు., పడమర : ప్లాట్ బేరింగ్ నం.23- 34.0 అ.లు., ఉత్తరం : ప్లాట్ బేరింగ్ నం.2- 52.0 అ.లు. ఈ సరిహద్దుల కవర్‌చేయబడిన సైట్ పరిధి 196.44 చ.గ.లు. తో పాటు గ్రౌండ్ మరియు రెండు అప్పర్ ఫ్లోర్లు ఆర్‌సిసి రూఫ్ట్ రెసిడెన్షియల్ భవనంతో ఇప్పటికే ఉన్న అన్నీ నిర్మాణాలు. లాంఛనప్రాయ స్వాధీనతా తేది : 13 మే, 2025	January 13, 2025 Rs. 1,03,65,747.14/-	గుంటూరు

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్స్ 8 మరియు 9 క్రింద నిబంధనల ప్రకారం ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరిన తర్వాత తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 17 మే, 2025, ప్రదేశం : గుంటూరు — అధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

అల్లర్ల కేసులో 11 మంది నిర్దోషులే

- ఢిల్లీ కోర్టు తీర్పు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో 2020లో జరిగిన అల్లర్ల కేసులో సాక్ష్యాధారాలు లేవంటూ 11మందిని నిర్దోషులగా ఢిల్లీ కోర్టు విడిచిపెట్టింది. గృహ దహనాలు, చౌర్యం వంటి అభియోగాలు వీరిపై మోపారు. విచారణ సందర్భంగా ఈ కేసులో నిందితులను గుర్తించిన ఇద్దరు పోలీసు సాక్షులు కృత్రిమ ప్రత్యక్ష సాక్షులుగా కనిపించారని అదనపు సెషన్స్ న్యాయమూర్తి పులస్త్య ప్రమచాలా వ్యాఖ్యానించారు. నిందితులు 2020 ఫిబ్రవరి 24 అర్ధరాత్రి దొంగతనాలకు, విధ్వంసానికి, గృహ దహనాలకు పాల్పడ్డారని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. ఈ నేరంలో పాల్గొన్న గుంపు నుండి నిందితులను గుర్తించడమనేది ఈ కేసులో కీలకమైన అంశమని కోర్టు తన తీర్పులో వ్యాఖ్యానించింది. ఈ నెల 14న తీర్పు వెలువడింది. దాదాపు 10మాసాల విరామం తర్వాత ఆ ఇద్దరు పోలీసు సాక్షులు నిందితుల ఫొటోలను గుర్తించారని కోర్టు పేర్కొంది. ఒకవేళ వారిద్దరు ఫిబ్రవరి 24నే అల్లర్లకు పాల్పడిన వారిని చూసినట్లైతే వారిని గుర్తించేందుకు అంత కాలం మౌనంగా వుండాల్సిన అవసరం లేదని కోర్టు వ్యాఖ్యానించింది.

ఏప్రిల్‌లో నిరుద్యోగ రేటు 5.1 శాతం

- పురుషుల్లో 5.2 శాతం.. మహిళల్లో 5 శాతం
- శ్రామిక శక్తిలో స్త్రీల భాగస్వామ్య రేటు తక్కువే
- తొలిసారిగా నెలవారీ పిఎల్‌ఎఫ్‌ఎస్ డేటా విడుదల చేసిన కేంద్రం



న్యూఢిల్లీ : భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో నిరుద్యోగం ఒకటి. కేంద్రంలో మోడీ సర్కారు విధానాలతో ప్రజలు ఈ నిరుద్యోగ రక్కసికి తీవ్రంగా బలవుతున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలు సైతం ఇదే విషయాన్ని వెల్లడించాయి. కానీ, నిరుద్యోగ మహమ్మారిని రూపుమాపే విషయంలో మాత్రం మోడీ సర్కారు విఫలమవుతూనే ఉన్నది. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిరుద్యోగ రేటు ఐదు శాతానికిపైనే ఉన్నది. కేంద్ర ప్రభుత్వ తాజా గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది. దీనికి సంబంధించి కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ మొదటిసారి నెలవారీ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్‌ఎఫ్‌ఎస్)ను విడుదల చేసింది. ఇప్పటి వరకు ఈ లేబర్ ఫోర్స్ సర్వేను త్రైమాసిక, వార్షిక ప్రాతిపాదికన విడుదల చేసేవారు.

కరెంట్ వీక్లీ స్టేటస్ (సిడబ్ల్యూఎస్)లో సేకరించిన సమాచారం ప్రకారం.. ఈ ఏడాది ఏప్రిల్‌లో అన్ని వయసుల వారిలో నిరుద్యోగ రేటు 5.1 శాతంగా ఉన్నది.

మహిళల ఎల్‌ఎఫ్‌పిఆర్ 38 శాతమే..!

దేశవ్యాప్తంగా ఏప్రిల్ నెలలో 15 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసున్నవారిలో శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు (ఎల్‌ఎఫ్‌పిఆర్) 55.6 శాతంగా ఉన్నది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో 58 శాతం, పట్టణ ప్రాంతాల్లో 50.7 శాతంగా నమోదైంది. ఇక ఎల్‌ఎఫ్‌పీఆర్‌కు సంబంధించి పురుషుల విషయానికొస్తే.. గ్రామీణ ప్రాంతాల్లో 79 శాతంగా, పట్టణాల్లో 75.3 శాతంగా ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఎల్‌ఎఫ్‌పిఆర్ తక్కువగా నమోదైంది. ఇది 38.2 శాతంగానే ఉన్నది. శ్రామికశక్తిలో వ్యక్తుల శాతం(పని చేస్తున్నవారు, పనిని కోరుతున్నవారు)ను ఎల్‌ఎఫ్‌పీఆర్ సూచిస్తుంది. దీనిని బట్టి చూస్తే మహిళల భాగస్వామ్య రేటు తక్కువగా ఉండటం గమనార్హం.

పురుషులలో నిరుద్యోగ రేటు 5.2 శాతంగా, మహిళల్లో ఐదు శాతంగా ఉన్నది. దేశవ్యాప్తంగా 15-29 ఏళ్ల వయసు వారిలో నిరుద్యోగం 13.8 శాతంగా ఉన్నది. పట్టణ ప్రాంతాల్లో 17.2 శాతంగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం 12.3 శాతంగా ఉన్నది. ఇక ఇదే ఏజ్ గ్రూపు మహిళల్లో నిరుద్యోగ రేటు 14.4 శాతంగా ఉన్నది. నగరాల్లో అత్యధికంగా 23.7 శాతంగా, గ్రామాల్లో 10.7 శాతంగా నమోదైంది. ఇక ఇదే ఏజ్ గ్రూపు పురుషుల విషయానికొస్తే.. దేశవ్యాప్తంగా నిరుద్యోగ రేటు 13.6 శాతంగా ఉన్నది. ఇది నగరాల్లో అత్యధికంగా 15 శాతమైతే.. గ్రామాల్లో 13 శాతంగా నమోదైంది.

ఉపాధి పొందుతున్న మహిళల నిష్పత్తి తక్కువ

ఇక మొత్తం జనాభాలో ఉపాధి పొందుతున్నవారి నిష్పత్తిని వర్కర్ పాపులేషన్ రేషియో (డబ్ల్యూపీఆర్) నిర్వచిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్నవారిలో డబ్ల్యూపీఆర్ ఏప్రిల్ నెలలో 55.4 శాతంగా ఉన్నది. పట్టణ ప్రాంతాల్లో 47.4 శాతంగా నమోదైంది. దేశవ్యాప్తంగా మాత్రం 52.8 శాతంగా ఉన్నది. మహిళల విషయానికొస్తే.. ఈ నిష్పత్తి తక్కువగా ఉండటం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లో 36.8 శాతం, పట్టణాల్లో 23.5 శాతంగా నమోదైంది. దేశస్థాయిలో ఒకే వయస్సు కలిగిన మొత్తం మహిళా డబ్ల్యూపీఆర్ 32.5 శాతంగా ఉన్నది.

సర్వేలో 3.80 లక్షల మంది కవర్

ఈ ప్రక్రియలో మొత్తం 7,511 మొదటి-దశ నమూనా యూనిట్లను సర్వే చేశారు. దేశవ్యాప్తంగా 89,434 గృహాలను కవర్ చేశారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 49,323, పట్టణ ప్రాంతాల నుంచి 40,111 ఇండ్లు ఉన్నాయి. 3,80,838 మంది వ్యక్తులను సర్వే చేశారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 2,17,483 మంది, పట్టణ ప్రాంతాల నుంచి 1,63,355 మంది ఉన్నారు.



మహాసభల్లో అధ్యక్షోపన్యాసం ఇస్తున్న కె.నారాయణ

యువత చేతిలోనే 'రాజ్యాంగ' రక్షణ

- ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలో వక్తలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ


మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు రహీం

రాజ్యాంగం గురించి ఏమాత్రమూ అవగాహన లేని, గౌరవం లేని శక్తులు ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్నాయని, రాజ్యాంగ పవిత్రతకు ప్రమాదం వాటిల్లుతున్న నేపథ్యంలో నేటి యువత అప్రమత్తం కావాల్సిన తరుణం ఆసన్నమైందని సిపిఐ జాతీయ కార్యదర్శి, అఖిల భారత యువజన సమాఖ్య 17వ జాతీయ మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ అన్నారు. శుక్రవారం తిరుపతిలోని కామ్రేడ్ కనం రాజేంద్రన్ హాలులో (కచ్చపి ఆడిటోరియంలో) ప్రతినిధుల సభ ప్రారంభమైంది. ఆహ్వానసంఘం తరపున నారాయణ అధ్యక్షోపన్యాసం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపిత బిజెపి పాలనలో రాజ్యాంగ వ్యవస్థలు అవమానాలను ఎదుర్కొంటున్నాయని, గవర్నర్ల అధికారాల విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలను రాష్ట్రపతి సైతం ఖండించిన తీరు చూస్తుంటే, రాజ్యాంగానికి ముప్పు పతాకస్థాయికి చేరిందన్నారు. డివైఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు, ఎంపి రహీం మాట్లాడుతూ... పాలకులు వ్యవహరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశం సంక్షోభంలోకి నెట్టబడుతోందన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయకపోగా అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారని తెలిపారు. చివరకు అగ్ని వీర్ ఉద్యోగాలు కూడా అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న యువతకు ఉద్యోగ భద్రత కల్పించినప్పుడే దేశంలో ఆర్థిక అసమానతలు తొలగిపోతాయన్నారు. కేరళ రాష్ట్రంలో లెఫ్ట్ పార్టీ అధికారంలో ఉండటంతో యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను దేశంపై రుద్దుతోందని, దానిని ఎదుర్కోవాలంటే లెఫ్ట్ పార్టీలన్నీ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

విజయ్‌షాను తొలగించండి

- సైనిక స్కూల్‌కు నేరస్తుడి పేరు పెట్టొద్దు
- ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నేతలకు కేటాయించిన స్కూళ్లను వెనక్కి తీసుకోవాలి
- సిపిఎం డిమాండ్

ఇండోర్ : సైన్యం గౌరవాన్ని, గుర్తింపును దెబ్బతీసే చర్యలను ఇప్పటికైనా నిలిపివేయాలని సిపిఎం మధ్యప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి జస్విందర్ సింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కల్నల్ సోఫియా ఖురేషిపై వ్యాఖ్యలు చేసిన విజయ్ షాను కేబినెట్ నుండి వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. గోటేగావ్‌లోని సైనిక్ స్కూల్‌కు నేరస్థుడి పేరు పెట్టడాన్ని ఖండించారు. సైనిక్ స్కూళ్లను ప్రభుత్వమే నడపాలని, ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి నాయకులకు కేటాయించిన స్కూళ్లను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని గ్వాలియర్, ఇండోర్ తదితర ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు.

ప్రపంచంలో అత్యంత క్రమశిక్షణ, అంకితభావం, ధైర్యసాహసాలు కలిగిన సైన్యాలలో ఒకటిగా భారత సైన్యానికి గుర్తింపు ఉందని జస్విందర్ సింగ్ పేర్కొన్నారు. లౌకికవాదం, సామాజిక సామరస్యం, మానవత్వం పట్ల దాని నమ్మకం, దాని గొప్ప చరిత్ర భవిష్యత్తులో ఉజ్వల ఆశలను రేకెత్తిస్తాయని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి, సైన్యం గౌరవం, గుర్తింపు ప్రమాదంలో పడుతోందని అన్నారు. సైన్యంలో సామాజిక విషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇది మన దేశ భద్రత, ఐక్యత, సమగ్రతకు ప్రమాదకరంగా ఉంటుందని చెప్పారు. మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా కల్నల్ సోఫియా ఖరేషీపై చేసిన వ్యాఖ్యల పట్ల బిజెపి మౌనంగా ఉండటంతో ఈ విషయం మరింత స్పష్టమైందని అన్నారు.

గతంలో రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన సైనిక స్కూళ్లు నడపబడేవని, ఇప్పుడు పిపిపి కింద వంద కొత్త సైనిక స్కూళ్లను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. గత నాలుగేళ్లలో మధ్యప్రదేశ్‌లో ఈ విధానంలో ఏర్పాటు చేసిన ఐదు స్కూళ్ల నిర్వహణను ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుబంధం ఉన్న సంస్థలకు అప్పగించారన్నారు. ఇది సరస్వతి శిశుమందిర్‌ల మాదిరిగా పిల్లల మనసులను విషపూరితం చేసే ప్రయత్నమని విమర్శించారు. ఈ స్కూళ్ల నుంచి వచ్చే విద్యార్థులు సైన్యంలో చేరితే, సైన్యం లౌకిక, స్వతంత్ర స్వభావం ఏమవుతుందని ప్రశ్నించారు. ఇలా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 61 స్కూళ్లు పిపిపి మోడ్‌లో ఏర్పాటు చేశారని, వీటిలో 70 శాతం స్కూళ్ల నిర్వహణ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నాయకులకు అప్పగించారని విమర్శించారు. మధ్యప్రదేశ్‌లోని నర్సింగ్‌పూర్ జిల్లా గోటేగావ్‌లో ఏర్పాటు కానున్న ఆరవ సైనిక స్కూల్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ స్కూల్‌కు మణినాగేంద్ర సింగ్ పేరు పెట్టటం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. 2023లో అనుమానాస్పదంగా మరణించిన బిజెపి నేత నాగేంద్ర క్రిమినల్ కేసులో ఏడాది జైలు శిక్షకు గురై, బెయిల్‌పై విడుదలయ్యాడన్నారు. దళిత వ్యక్తపై దాడి చేసినందుకు 15 రోజులపాటు జైలులో ఉన్నాడన్నారు. నాగేంద్ర డ్రగ్ ఎడిక్ట్ అని, వేధింపులు, వరకట్న ఆరోపణలపై అతని భార్య కేసు పెట్టిందని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ప్రముఖులకు, దేశ అభివృద్ధికి గణనీయమైన కృషి చేసిన వారి పేర్లు పెడతారని, డ్రగ్ అడిక్ట్, వివిధ కేసుల్లో ఆరోపణలున్న వ్యక్తి పేరును సైనిక స్కూలుకు పెట్టడం ద్వారా బిజెపి ప్రభుత్వం ఏమి సందేశం ఇస్తుందని ప్రశ్నించారు.



మంత్రికి వ్యతిరేకంగా ఇండోర్‌లో ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

సుప్రీం మహిళా న్యాయమూర్తి జస్టిస్ బేలా త్రివేది పదవీ విరమణ



న్యూఢిల్లీ : సుప్రీం కోర్టు 75ఏళ్ల చరిత్రలో 11వ మహిళా న్యాయమూర్తి జస్టిస్ బేలా ఎం.త్రివేది శుక్రవారం పదవీ విరమణ చేశారు. మూడున్నరేళ్ల పాటు ఆమె బెంచ్‌లో వున్నారు. 1995 జులైలో గుజరాత్‌లో ట్రయల్ కోర్టు జడ్జిగా ప్రారంభించిన జస్టిస్ త్రివేది క్రమంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థానానికి ఎదిగారు. 2021 ఆగస్టు 31న ఆమె మహిళా న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1996లో ఒకే కోర్టులో తండ్రి కుమార్తెలు న్యాయమూర్తులుగా వున్న లిమ్కా బుక్ రికార్డు ఆమె పేరిట వుంది. బాలిక మర్మావయాలను తాకడం లేదా లైంగిక ఉద్దేశంతో శారీరక కలయికకు ప్రయత్నించడమనేది పోక్సో చట్టంలోని సెక్షన్ 7 కింద లైంగిక దాడిగానే పరిగణించాల్సి వుంటుందని 2021లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ బెంచ్‌లో జస్టిస్ త్రివేది సభ్యురాలిగా వున్నారు. క్రమంగా ఎదుగుతూ వచ్చిన జస్టిస్ త్రివేదిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ అభినందించారు. జస్టిస్ త్రివేదికి సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సిబిఎ) వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించకపోవడం పట్ల సిజెఐ విచారాన్ని వెలిబుచ్చారు. ఎస్‌సిబిఎ తీసుకున్న వైఖరిని తాను బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నానని అన్నారు.

మరాఠా రిజర్వేషన్లపై బాంబే హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం

ముంబయి : మరాఠా రిజర్వేషన్లపై చట్టపరమైన చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణకు బాంబే హైకోర్టు ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. జస్టిస్ రవీంద్ర ఘుగే, జస్టిస్ ఎన్‌జె జమాదార్, జస్టిస్ సందీప్ మార్నెలతో కూడిన పూర్తిస్థాయి ధర్మాసనాన్ని ఏర్పాటు చేసినట్లు శుక్రవారం జారీ చేసిన నోటీసుల్లో పేర్కొంది. ఈ నోటీసులో విచారణ తేదీని వెల్లడించలేదు. మరాఠాలు రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించాల్సిన వెనకబడిన సమాజం కాదంటూ, ఆ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన కొన్ని పిటిషన్‌లపై హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డికె ఉపాధ్యాయ నేతృత్వంలోని పూర్తి ధర్మాసనం గతేడాది విచారణ ప్రారంభించింది. రిజర్వేషన్లపై మహారాష్ట్ర ఇప్పటికే 50శాతం పరిమితిని దాటిందని కూడా పిటిషన్లు వాదించాయి. ఈ ఏడాది జనవరిలో హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఉపాధ్యాయను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయడంతో విచారణ నిలిచిపోయింది. ఈ పిటిషన్‌లపై ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి అత్యవసరంగా విచారించాలని ఈ నెల 14న సుప్రీంకోర్టు బాంబే హైకోర్టును ఆదేశించిన సంగతి తెలిసిందే. 2025లో జరిగిన నీట్ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్ల విచారణ సమయంలో సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. మహారాష్ట్ర జనాభాలో మూడింట ఒక వంతు ఉన్న మరాఠా కమ్యూనిటీకి విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్లు కల్పించే 2024 చట్టం గతేడాది లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాజకీయ చర్చల్లో ప్రధానాంశంగా నిలిచింది.

మాజీ మంత్రి కాకాణికి దక్కని ఊరట

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. నెల్లూరు జిల్లాలో జరిగిన క్వార్ట్జ్ అక్రమాలు, భారీ ఎత్తున పేలుడు పదార్థాల వినియోగం, అట్రాసిటీ కేసులో ఎ4గా ఉన్న కాకాణికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. గతంలో ముందస్తు బెయిల్‌ను హైకోర్టు నిరాకరించింది. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ అరవింద్ కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. తనపై ఎలాంటి నేరారోపణ కేసులు లేవని పిటిషన్‌లో పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో కాకాణి ఎన్నికల అఫిడవిట్‌ను ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనం ముందుకు తీసుకెళ్లారు. కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారని అన్నారు. దీంతో కాకాణిపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలా కోర్టును తప్పుదారి పట్టించి ఊరట పొందాలని చూస్తారా? అని పేర్కొంది. ప్రభుత్వ విజ్ఞప్తితో ఉపశమనం ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. పిటిషన్ విత్‌డ్రా చేసుకోవడానికి అనుమతినివ్వాలని కాకాణి తరపున న్యాయవాదులు కోరారు. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

ముగిసిన రష్యా, ఉక్రెయిన్ చర్చలు

- చెరో వెయ్యిమంది యుద్ధ ఖైదీల విడుదలకు ఓకే



ఇస్తాంబుల్, మాస్కో : గత మూడేళ్లలో మొదటిసారిగా రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య ప్రత్యక్షంగా చర్చలు జరిగాయి. ఈ చర్చలు దాదాపు రెండు గంటల పాటు సాగాయి. బేషరతుగా కాల్పుల విరమణ జరగాలని ఉక్రెయిన్, అసలు ఈ ఘర్షణలకు మూల కారణాలను పరిష్కరించాలని రష్యా డిమాండ్ చేస్తున్నాయి. శాంతి చర్చలు ముగిసిన అనంతరం రష్యా ప్రతినిధి బృంద నేత వ్లాదిమిర్ మెదినిస్కీ మాట్లాడుతూ, ఇరు దేశాలు చెరో వెయ్యి మంది ఖైదీలను విడుదల చేసేందుకు అంగీకరించాయని చెప్పారు. 2022లో యుద్ధం ప్రారంభమైన తర్వాత కుదిరిన అతిపెద్ద యుద్ధ ఖైదీల మార్పిడి ఒప్పందమిది.

పుతిన్, ట్రంప్ సమావేశం అవసరమే ! కానీ... : క్రెమ్లిన్ వ్యాఖ్యలు

మాస్కో : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య సమావేశం అవసరమైనదేనని, అయితే దానికి ముందస్తుగా చాలా సన్నాహాలు అవసరమని, సమావేశమంటూ జరిగితే కచ్చితంగా ఫలితం సాధించాల్సిందేనని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వ్యాఖ్యానించారు. సాధ్యమైనంత త్వరగా పుతిన్‌తో తాను భేటీ కావాలనుకుంటున్నట్లు ట్రంప్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో పెస్కోవ్ ప్రకటన శుక్రవారం విడుదలైంది. అమెరికా, రష్యా ద్వైపాక్షిక సంబంధాల దృష్ట్యా చూస్తే ఈ సమావేశం కచ్చితంగా ప్రాధాన్యత గలదే, అంతర్జాతీయ వ్యవహారాలపై,అలాగే ప్రాంతీయ సమస్యలపై ఉన్నతస్థాయిలో తీవ్రంగా చర్చించడం అవసరమేనని పెస్కోవ్ పేర్కొన్నారు. ఇస్తాంబుల్‌లో జరుగుతున్న రష్యా, ఉక్రెయిన్ మధ్య చర్చల గురించి ప్రస్తావిస్తూ, రష్యా ప్రతినిధి బృందం మాస్కో నాయకత్వానికి నిరంతరంగా సమాచారం తెలియచేస్తోందని చెప్పారు. వాస్తవ సమాచారం పుతిన్‌కు అందుతోందన్నారు. మరోవైపు రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు పుతిన్, ట్రంప్ సమావేశం అవసరమని ట్రంప్ డిప్యూటీ అసిస్టెంట్ సెబాస్టియన్ గోర్కా చెప్పారు.

ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహణకు కేంద్రం నిరాకరణ..!

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పహల్గాం దాడి అనంతరం నెలకొన్న భారత్-పాక్ ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసేందుకు కేంద్రం సుముఖంగా లేదని సమాచారం. ఈ ఏడాది జులైలో జరిగే వర్షాకాల సమావేశాల్లోనే ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రశ్నలకు కేంద్రం సమాధానం చెప్పాల్సి ఉంది. పహల్గాం దాడి అనంతరం జరిగిన పరిణామాలు, కలిసికట్టుగా తీసుకున్న నిర్ణయాలను చర్చించేందుకు పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఇటీవల ప్రధాని మోడీకి లేఖ రాశారు. 'ఐక్యత, సంఘీభావం అవసరమైన ఈ తరుణంలో, వీలైనంత త్వరగా ఉభయ సభల్లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం ముఖ్యమని ప్రతిపక్షం భావిస్తోంది' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ ప్రధాని మోడీకి లేఖ రాశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇండియా బ్లాక్‌లో ఉన్న అన్ని పార్టీలూ ఇదే డిమాండ్ చేస్తున్నాయి. కేంద్రం ఇందుకు సుముఖంగా లేనట్లు తాజాగా వార్తలు వినిపిస్తున్నాయి.


ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఊరట

ముస్తాఫిజుర్‌కు బంగ్లాబోర్డు అనుమతి

న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి ఊరట లభించింది. ఆ ఫ్రాంచైజీ తరపున ఆడేందుకు ముస్తఫిజుర్ రెహ్మాన్‌కు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌ఓసి) మంజూరు చేసింది. దీంతో అతడు ఢిల్లీ జట్టులో త్వరలో చేరనున్నాడు. మెక్‌గర్క్ స్థానంలో బంగ్లాపేసర్ ముస్తఫిజుర్ రెహ్మాన్‌ను తీసుకుంది. యుఎఇతో టి20 సిరీస్ ఆడేందుకు తొలుత దుబాయ్‌కు పయనమైన ముస్తాఫిజుర్‌కు బంగ్లా క్రికెట్ బోర్డు చివర్లో ఎన్‌ఓసి మంజూరు చేసింది.

చరిత్ర సృష్టించిన నీరజ్ చోప్రా

- డైమండ్ లీగ్‌లో 90మీ. మార్క్



దోహా: భారత స్టార్ జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా మరోసారి చరిత్ర సృష్టించాడు. కెరీర్‌లో తొలిసారి 90మీ. మార్క్‌ను అధిగమించాడు. ఖతార్ వేదికగా జరుగుతున్న దోహా డైమండ్ లీగ్ మూడో రౌండ్‌లో ఈటెను 90.23 మీటర్లు విసిరి ఈ ఘనత అందుకున్నాడు. ఇప్పటి వరకు నీరజ్ అత్యుత్తమ ప్రదర్శన 89.94 మీటర్లు. 2022లో స్టాక్ హోమ్ డైమండ్ లీగ్‌లో నీరజ్ ఈ ప్రదర్శన చేశాడు. తొలి రౌండ్‌లో 88.84మీ. విసిరాడు. రెండో రౌండ్ ఫౌల్ అయింది. ఇక మూడో రౌండ్‌లో తన కెరీర్ బెస్ట్‌ను అందించాడు. ఏకంగా 90మీ మీటర్లు విసరడం విశేషం. అయితే జర్మనీ ప్లేయర్ జులియన్ వెబర్ (91.06 మీటర్లు) చివరి రౌండ్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. దీంతో నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు.



గాజాపై ఇజ్రాయిల్ భీకర దాడులు

- 120 మంది పాలస్తీనియన్ల మృతి
- చర్చలు జరపాలంటే సాయం అందాల్సిందే : హమాస్
- గాజా అమ్మకానికేమీ లేదంటూ వ్యాఖ్యలు

గాజా : గాజాపై ఇజ్రాయిల్ అమానుషంగా కొనసాగిస్తున్న భీకర దాడుల్లో 120మంది మరణించినట్లు పాలస్తీనా సహాయక సిబ్బంది బృందం వెల్లడించింది. గురువారం తెల్లవారుజాము నుండి ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న బాంబు దాడుల్లో మరణించిన వారి సంఖ్య 120కి పెరిగిందని గాజా పౌర రక్షణ సంస్థ తెలిపింది. ఈ నెలాఖరు నాటికి మానవతా సాయం పంపిణీని ప్రారంభించనున్నట్లు అమెరికా మద్దతు గల ఒక స్వచ్ఛంద సంస్థ తెలిపింది.

హమాస్‌పై ఒత్తిడి పెంచే ఉద్దేశ్యంతో మార్చి 2 నుండి గాజాకు సాయాన్ని ఇజ్రాయిల్ నిలిపివేసింది. సానుకూల, నిర్మాణాత్మక చర్చలు జరపాలంటే ముందుగా యుద్ధంతో అతలాకుతలమైన గాజాకు మానవతా సాయాన్ని పునరుద్ధరించడమన్నది కనీస అవసరమని హమాస్ సీనియర్ అధికారి బాసెం నయూమ్ స్పష్టం చేశారు. ఆహారం, నీరు, మందులు వంటి ప్రాథమిక అవసరాలను పొందడం హక్కు గానీ చర్చలకు సంబంధించిన అంశం కాదని ఆయన తీవ్రంగా విమర్శించారు.

ఫ్రీడమ్ జోన్‌గా మారుస్తా : మళ్లీ అవే వ్యాఖ్యలు చేసిన ట్రంప్

తగిన ఆహారం అందక అనేకమంది కరువు కాటకాల బారినపడి మరణిస్తున్నారని, తాము గాజాలో పరిస్థితులను చూస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. గాజాను తాము స్వాధీనం చేసుకుని ఫ్రీడమ్ జోన్‌గా మారుస్తామని ట్రంప్ తిరిగి వ్యాఖ్యానించడంతో గాజా అమ్మకానికి రడీగా లేదని హమాస్ వ్యాఖ్యానించింది.

ఇజ్రాయిల్ ఈ విధంగా చంపుతోంది : ఐరాస ప్రత్యేక దూత

ఆహారం, నీరు, ఇంధనం, మందులు వంటి నిత్యావసర వస్తువులు కనిష్ట స్థాయికి చేరుకున్నాయని గత కొన్ని వారాలుగా ఐక్యరాజ్యసమితి సంస్థలు హెచ్చరిస్తూనే వస్తున్నాయి. మంగళవారం దాడుల తర్వాత గాజాలో కేన్సర్, గుండె సంరక్షణకు సేవలందించే చివరి ఆస్పత్రి పనిచేయడం ఆగిపోయిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) తెలిపింది. దాడుల్లో పోగా ఇంకా మిగిలున్నవారిని ఇజ్రాయిల్ ఈ రకంగా చంపుతోంది అని పాలస్తీనాలో ఐరాస ప్రత్యేక దూత ఫ్రాన్సిస్కా ఆల్బనీస్ వ్యాఖ్యానించారు. డెర్ అల్-బలాహ్‌పై జరిగిన దాడి అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక దాడులు చాలని, యుద్ధం ముగియాలని ప్రార్థిస్తున్నామని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ యుద్ధానికి ఇక స్వస్తి చెప్పేలా అన్ని అంతర్జాతీయ సంస్థలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

యుఎఇతో 20వేల కోట్ల డాలర్ల ఒప్పందాలు

- ప్రకటించిన వైట్‌హౌస్

వాషింగ్టన్ : యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)తో అమెరికా సంబంధాలు మరింత బలపడ్డాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆ దేశంతో 20వేల కోట్ల డాలర్లకు పైగా విలువైన ఒప్పందాలను చేసుకున్నట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. కృత్రిమ మేథస్సు రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి కూడా ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. జిఇ ఏరోస్పేస్ తయారు చేసిన ఇంజన్లతో నడిచే 28 బోయింగ్ 787, 777ఎక్స్ విమానాలపై పెట్టుబడులు పెట్టేందుకు ఇతిహాద్ ఎయిర్‌వేస్ నుండి వచ్చిన హామీ కూడా ఈ ఒప్పందాల్లో వుంది. తదుపరి తరం 777ఎక్స్ విమానాన్ని తమ వైమానికదళంలో చేర్చుకుంటుండడంతో ఈ పెట్టుబడుల వల్ల యుఎఇ, అమెరికా మధ్య శాశ్వత వాణిజ్య పౌర విమానయాన భాగస్వామ్యం కూడా బలపడుతోందని వైట్‌హౌస్ పేర్కొంది. రెండు దేశాలు ఎఐ యాక్సిలరేషన్ పార్టనర్‌షిప్‌కు సంబంధించి ఒక చట్రపరిధిని కూడా ఏర్పాటు చేసుకునేందుకు అంగీకరించారని అమెరికా వాణిజ్య శాఖ తెలిపింది. అమెరికా వెలుపల అతి పెద్దదైన 5జిడబ్ల్యు ఎఐ కేంపస్‌ను ఆవిష్కరించే కార్యక్రమానికి ట్రంప్, షేక్ మహ్మద్ హాజరయ్యారు. ఎంతకాలంగానో ఎదురుచూస్తున్న ఈ ఒప్పందం అటు అమెరికాతో పాటు ఇటు యుఎఇకి కూడా విజయమే. ప్రధాన చమురు ఉత్పత్తిదారైన యుఎఇ అంతర్జాతీయంగా ఎఐ శక్తిగా ఆవిర్భవించేందుకు కోట్లాది డాలర్లను ఖర్చు చేస్తోంది. చైనాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా వున్నందున బైడెన్ హయాంలో అమెరికా చిప్‌లకు పరిమితంగానే సౌలభ్యం వుండేది.

సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేస్తూ ముగ్గురు కార్మికులు మృతి

అహ్మదాబాద్ : గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తూ ముగ్గురు కార్మికులు మరణించారు. పట్టణంలో డానిలిమ్డా ప్రాంతంలోని ఒక జీన్స్ వాషింగ్ యూనిట్‌లో భూగర్భ సెప్టిక్ ట్యాంక్‌ను శుక్రవారం ఉదయం శుభ్రం చేస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ వైఎ గోహిల్ తెలిపారు. ప్రకాశ్ పర్మార్, విశాల్ ఠాకూర్, సునీల్ రథ్వా అనే కార్మికులు సెప్టిక్ ట్యాంక్‌లోని విషవాయులు పీల్చి మరణించారని చెప్పారు.

లిక్కర్ స్కామ్‌లో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

నిరాకరించింది. అనంతరం వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.. శాసనమండలిలో వైసిపి పక్షనేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ అరెస్ట్‌లపై స్పందిస్తూ ప్పుడు కేసులు పెట్టి అన్యాయంగా ప్రవరిస్తున్నారని, మాజీ ఉద్యోగులపైనా రాజకీయ కక్షసాధింపులకు దిగారని విమర్శించారు. ఈ సంప్రదాయం భవిష్యత్‌లో ఇబ్బంది తెచ్చిపెడుతుందని పేర్కొన్నారు. వైసిపి హయాంలో కల్తీ మద్యం అమ్మారని ప్రచారం చేసిన డిస్టిలరీల నుండే ప్రస్తుత ప్రభుత్వం అదే మందును కొంటోందని తెలిపారు. మాజీ మంత్రులు పేర్ని నాని, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ తదితరులు కూడా ఈ అరెస్ట్‌ల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఉరుములు, మెరుపుల వర్షం

(మొదటి పేజీ తరువాయి)

కురిసింది. డుంబ్రిగుడ మండలంలోని కొర్ర పంచాయతీ పరిధి గొందివలస గ్రామంలో భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా రెండు ఇళ్లు నేలమట్టమయ్యాయి. శ్రీకాకుళం జిల్లాలో బూర్జ, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో వాన పడింది. మెళియాపుట్టిలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది.

పిడుగుపాటుకు ముగ్గురు మృతి

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పంచాయతీ తీర గ్రామమైన వాసాలతిప్పకు చెందిన కర్రి లీలా కృష్ణ (39) గ్రామంలోని చెరువులో చేపలు పడుతుండగా ఆయనకు సమీపంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం దేవనాపురం పంచాయతీ జగత్‌పల్లి బూర్జిగూడ చెందిన సవర చంద్రావు (28) పొలంలో ట్రాక్టర్ దున్నుతుండగా అతనికి సమీపంలో పిడుగుపడి అక్కడికక్కడే మరణించారు. పాలకొండ పట్టణంలోని ఎన్‌ఎన్‌ఎన్ కాలనీకి చెందిన జోగులక్ష్మి (40) తన ఇంటిపై ఆరబెట్టిన బట్టలు తీసుకునేందుకు వెళ్లిన క్రమంలో వారి ఇంటి సమీపంలో పిడుగుపాటుకు గురై మరణించారు.



వేసవి విడిది

రామయ్య - సోమయ్య



రామాపురం అనే గ్రామంలో రామయ్య, సోమయ్య ఉన్నారు. రామయ్యది పేద కుటుంబం. సోమయ్యది ధనిక కుటుంబం. డబ్బు ఉందన్న అహంకారాన్ని సోమయ్య తన మాటల్లో, చేతల్లో చూపిస్తాడు. రామయ్య మాత్రం అలా కాదు. చాలా మంచివాడు. ఎవరు ఆపదలో ఉన్నా తన చేతనైన సాయం చేస్తాడు.

ఒకసారి రామయ్య మిత్రుడు చంద్రయ్యకు ఆరోగ్యం బాగోలేదు. ఆపరేషన్ కోసం డబ్బు అవసరమవుతుంది. అప్పుడు చంద్రయ్య, సోమయ్య దగ్గరికి వెళ్ళి సహాయం చేయమని అడిగాడు. కానీ సోమయ్య సహాయం చేయడు. అప్పుడు రామయ్య, తన దగ్గర ఉన్న కొంత డబ్బుని ఇచ్చి చంద్రయ్యకి చికిత్స చేయించాడు. చంద్రయ్యకి ఆరోగ్యం కుదుటపడింది. పట్నంలో వ్యాపారం చేయాలని వెళుతూ తనకి ఎంతో సాయం చేసిన రామయ్యని కూడా తీసుకెళ్లాడు. మిత్రులిద్దరూ పట్నంలో వ్యాపారం చేసి బాగా డబ్బులు సంపాదించారు. వాళ్లు సంపాదించిన దాంట్లో పేదలకు సాయం చేయాలని నియమంగా పెట్టుకున్నారు.

ఒక రోజు చంద్రయ్య, రామయ్య అన్నదానం చేస్తున్న చోటికి సోమయ్య వచ్చాడు. తన పరిస్థితి ఏమీ బాగోదు. సోమయ్యని చూసి మిత్రులిద్దరూ ఆశ్చర్యపోయారు. తన ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదానికి సర్వం కోల్పోయి రోడ్డున పడిన సంగతి తెలుసుకుని కొంత డబ్బు ఇచ్చారు. అప్పుడు 'నేను మిమ్మల్ని చాలా అవమానించాను. ఆపదలో సాయం చేయలేదు. అయినా నాకు సహాయం చేశారు' అని సోమయ్య మిత్రులిద్దరినీ క్షమాపణ కోరాడు. 'డబ్బు శాశ్వతం కాదు సోమయ్య. ఆ రోజు నీ దగ్గర ఉంది. ఈ రోజు మా దగ్గర ఉంది. అంతే. డబ్బుందన్న అహంకారం పోకుండా ఆపదలో ఉన్న వారికి సాయం చేయడమే మనల్ని కలకాలం కాపాడుతుంది' అని మిత్రులిద్దరూ ముక్తకంఠంతో అనడంతో ఇక నుంచి తన ప్రవర్తన మార్చుకోవాలని సోమయ్య అక్కడి నుంచి వెళ్లిపోయాడు.



– ఎస్.ఫర్హానా,
9వ తరగతి,
ఎం.తిమ్మాపురం,
ఆదర్శ పాఠశాల,
మహానంది (మం),
నంద్యాల జిల్లా.

బొమ్మల కొలువు



కాగితంతో కళాకృతి

హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు ఎన్ సాయి మౌనశ్రీ. నేను ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాను. ఈ వేసవి సెలవుల తర్వాత 10వ తరగతికి వెళ్తాను. నాకు పేపర్‌తో కళాకృతులు చేయడం చాలా ఇష్టం. సెలవుల్లో చాలా ఖాళీ సమయం దొరికింది కదా! ఇలా ట్రై చేశాను. ఇదే నేను మొదటిసారి చేయడం. కొన్ని పనికిరాని వార్తా పత్రికలు, గమ్, ఒక చిన్న కార్డ్‌బోర్డ్ ముక్కతో, ఇది తయారుచేశాను. చాలా సమయం పట్టింది. కానీ మొత్తం ఆర్ట్ పూర్తయ్యాక నాకు ఎంత సంతోషమేసిందో మాటల్లో చెప్పలేను.




- ఎన్.సాయి మౌనశ్రీ,
10వ తరగతి,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
బండ్లమిట్ట,
ఒంగోలు.



కె.చెకిత, 7వ తరగతి,
వికాస్ విద్యా నికేతన్
కర్నూలు సమ్మర్ క్యాంప్,
99633 50973.





కె.గౌతమ్ జై,
1వ తరగతి,
లిటిల్ ఫ్లవర్ స్కూలు,
విద్యానగర్,
గుంటూరు.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

జీవన సౌరభం

ఏమీ లేనప్పుడు ఓపిక,
అన్నీ ఉన్నప్పుడు ప్రవర్తన..
మనిషి వ్యక్తిత్వాన్ని
పెంచుతాయి.

JEEVANA జీవన the family

ఆచారం పేరిట అమానుషం!

బిడ్డకి ఆరోగ్యం బాగోకపోతే అమ్మానాన్న ఎంతగానో తల్లడిల్లిపోతారు. మరణం తనని ఆవహిస్తుందని తెలిసిన క్షణాన వారి బాధ వర్ణనాతీతం. 'లాభం లేదు, ఇంటికి తీసుకెళ్లిపోండ'ని డాక్టర్లు చెప్పినా, తను తుది శ్వాస విడిచేవరకు ఆస్పత్రి బెడ్‌పై నుంచి కిందికి దించనీయరు. కానీ ఇండోర్‌కి చెందిన ఉన్నత విద్యావంతులైన ఓ అమ్మానాన్న అందుకు భిన్నంగా వ్యవహరించారు. తమ మూడేళ్ల చిన్నారి అనారోగ్యంతో చనిపోతుందని తెలిసిన క్షణాన తనని ఆస్పత్రి నుంచి ఆశ్రమానికి తరలించారు. ఆచారం పేరుతో ఆ చిన్నారికి వైద్యం అందకుండా, ఆహారం ఇవ్వకుండా చేశారు. ఫలితంగా అధునాతన వైద్యం అందుతూ సునాయాసంగా ఊపిరి వదలాల్సిన ఆ పసిది, తీవ్ర బాధతో నిమిషాల వ్యవధిలోనే మరణించింది. ఇంత దారుణానికి ఆ అమ్మానాన్న ఎందుకు ఒడిగట్టారు? దీనివల్ల వాళ్లకి ఒనగూరినది ఏంటి?



'ప్రజలెప్పుడూ మనస్ఫూర్తిగా చెడ్డ కార్యాలకి పూనుకోరు. కానీ అదే ప్రజలు ఆచారం పేరుతో మూఢవిశ్వాసాలకు పోయి ఎంతటి దారుణానికైనా ఒడిగడతారు' అని 17వ శతాబ్దంలోనే రచయిత బ్లాయిస్ పాస్కల్ అన్నారు. ఇప్పుడు 21వ శతాబ్దంలో కూడా ఇండోర్ ఉదంతం గురించి తెలుసుకుంటే ఆ మాటలు అక్షరసత్యాలని రుజువు అవుతున్నాయి.

నమిత(పేరు మార్చాం)కి మూడేళ్లు. బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతోంది. తన అమ్మానాన్న ఐటి నిపుణులు. జనవరిలో నమిత కోలుకోవాలని అత్యాధునిక చికిత్స చేయించారు. అయితే మార్చి నాటికి అది మళ్లీ తిరగబెట్టింది. ఈసారి నమితకి ఆ తల్లీదండ్రీ వైద్యం చేయించలేదు. తమ మతాచారం ప్రకారం తనని 'సంతార' అనే ఉపవాస దీక్షకి సిద్ధం చేశారు.

విద్యావంతులు, ధనికులు అయిన ఆ తల్లీదండ్రీకి ఆ పాపకి వైద్యం అందించడం పెద్ద సమస్య కాదు. కానీ ఈ దారుణానికి పాల్పడ్డారు. కారణం మరో జన్మలోనైనా పాప ఆరోగ్యవంతంగా పుడుతుందని మత గురువు బోధించారు. అతడి మాట తు.చ తప్పకుండా అమలు చేసి, బిడ్డ మరణానికి కారణమైన ఆ అమ్మానాన్నని ఎవరూ నిందించలేదు. పైగా వారిని ఎంతో కీర్తించారు. అమెరికాకి చెందిన ఓ సంస్థ ఏకంగా అతి చిన్న వయసులో 'సంతార' ఆచరించినందుకు పాప పేరును గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కించింది. అప్పటి వరకు వారి కమ్యూనిటీకే పరిమితమైన ఈ విషయం అప్పుడే ప్రపంచానికి తెలిసింది.

'సంతారా' లేక 'సల్లేఖన' పేరుతో జైన మతంలో ఓ ఆచారం ఉంది. దీని ప్రకారం స్వచ్ఛంద మరణం కోరుతూ ఆహారపానీయాలు మాని ఉపవాసదీక్షకి పూనుకుంటారు. ఆయా వ్యక్తుల శక్తిసామర్థ్యాలను బట్టి ఈ క్రతువు కొన్ని రోజులు లేదా కొన్ని నెలల పాటు జరిగి, వారి మరణంతో పూర్తవుతుంది. ఎక్కువగా జైన మతానికి చెందిన వృద్ధులు దీన్ని ఆచరిస్తారు. అనధికార గణాంకాల ప్రకారం ఏడాదికి 200 మంది ఈ ఆచారం తీసుకుని చనిపోతున్నారు.

ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే దీన్ని ఆత్మహత్యగా భావించాలి. కానీ ఎక్కడా ఆ తలంపే రాదు. నమిత మరణించిన 45 రోజుల తరువాత ప్రశాంసపత్రం ప్రకటనతో ఈ విషయం బయటికి వచ్చింది. దీంతో మరోసారి ఈ ఆచారం చర్చలకు దారితీసింది. దీన్ని సమర్థించుకోవడం కోసం ఆ కుటుంబాలు ఆయా వ్యక్తులు ఇష్టపూర్వకంగానే దీన్ని ఆచరిస్తారని చెబుతారు. అయితే ఇక్కడ నమిత విషయం వేరు. ఆమె మూడేళ్ల పిల్ల. అంత చిన్న పిల్ల ఇష్టపూర్వకంగా చేసిందని ఎలా ఒప్పుకోవాలి?

రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండేవరకు ఓటుహక్కు రాదు, డ్రైవింగ్ లైసెన్సు మంజూరు చేయరు. అలాచూసినా ఇది చట్టవిరుద్ధమైన చర్య. కానీ నమిత తల్లిదండ్రులపై, గురువుపై ఎవరూ, ఇంతవరకు చర్యలు తీసుకోలేదు.

చికిత్స తీసుకుంటూ నొప్పి నుండి ఉపశమనం పొందుతూ నమిత చనిపోవడం వేరు. వైద్యానికి దూరమై, విపరీతమైన నొప్పి అనుభవిస్తూ మరణించడం దారుణమని ఆ అమ్మానాన్నకి ఎవరు చెబుతారు? అసలు వాళ్లకి ఆ ఆలోచనైనా వస్తుందా! అంటే రాదనే చెప్పాలి. ఎందుకంటే గతంలో ఇలాంటి ఘటన జరిగినప్పుడు ఎదురైన పరిస్థితులు తెలుసుకోవాలి.

కొన్నేళ్ల క్రితం ఇదే కమ్యూనిటీకి చెందిన వజ్రాల వ్యాపారి 13 ఏళ్ల కూతురు ఈ 'సంతారా'కి బలైంది. అప్పుడు ఆమె 8వ తరగతి చదువుతోంది. కలెక్టరు కావాలని కలలుగంది. కానీ విచిత్రంగా ఒక రోజు 'సల్లేఖన'ని సిద్ధమైంది. కూతురు ఆ మాట చెప్పేసరికి అమ్మానాన్న ఎంతో సంతోషపడ్డారు. పిల్ల స్వచ్ఛంద మరణం కోరుకుంటుందని ఊరువాడా చాటింపుచేశారు. బంధువర్గాన్ని పిలిచి విందులు, వినోదాలు చేయించారు. నగలు, పూలు, అందమైన దుస్తులు అలకరించి ఆ పిల్లని పెళ్లికూతురుగా తయారుచేశారు. వేడుకకి విచ్చేసిన మత గురువు కొంతమంది శిష్యబృందంతో ఆ పిల్లకి తెల్లని వస్త్రాలు బహూకరించారు. ఆ తరువాత ఆ పిల్ల జుట్టుని పూర్తిగా కత్తిరించి గుండుతో తెల్ల బట్టలతో తమతో ఆశ్రమానికి తీసుకుపోయారు. అక్కడికి వెళ్లాక 68 రోజుల పాటు అన్నం, నీళ్లు తీసుకోకుండా ఆ పిల్ల ఉపవాసం ఆచరించింది. ఆరోగ్యం క్షీణించి గుండెపోటు వచ్చి రెండు రోజుల చికిత్స తరువాత మరణించింది. శరీరాన్ని ఎంతలా బాధపెడితే ఇంత దారుణమైన చావు వస్తుంది. ఊహించడానికే భయంగొల్పే ఈ చావు.. ఆ తరువాత ఓ వేడుకలా నిర్వహించారు. చనిపోయిన చిన్నారి శవానికి పెళ్లి కంటే ఘనంగా శోభాయాత్ర పేరుతో ఉత్సవం చేశారు.

ఇప్పుడిదంతా ఎందుకు చెప్పుకోవాల్సి వచ్చిందంటే ఈ క్రతువు జరుగుతున్నంత సేపు మీడియా ఈ విషయాన్ని చాలా విస్తృతంగా ప్రచారం చేసింది. ఎక్కడా ఇదొక మూఢాచారమని ప్రసక్తే రాలేదు. అన్యాయంగా చనిపోతున్నారని ఎక్కడా ఆవేదన చెందలేదు. పైగా ఉపవాస దీక్షలో ఉన్న చిన్నారి దగ్గర ఆశీర్వాదం తీసుకునేందుకు ప్రముఖులు క్యూ కట్టారు. ఈ వార్తలు దీన్ని ఆచరించడం గొప్ప కార్యంలా భావించే స్థితికి వచ్చేలా చేశాయి.

చావుని ఎవరూ ఆహ్వానించరు. అదీ ముక్కుపచ్చలారని పిల్లలకు అది సంభవించడం ఎంతో బాధాకరం. కానీ ఇక్కడా ఏ తల్లీదండ్రీ, ఏ పిల్లలూ దాన్ని చెడ్డ పనిగా అనుకోవడం లేదు. ఆచారం వారిని అదొక ఘనకార్యంలా ఆచరించేలా చేస్తోంది. ప్రజలు ఉద్యమించటంతో ఎన్నో మూఢాచారాలు చరిత్రలో కలిసిపోయాయి. ప్రజలు చైతన్యంతో నడిస్తేనే ఇలాంటి మూఢాచారాల నివారణ సాధ్యం.

12న హరి హర వీరమల్లు విడుదల



పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హరి హర వీరమల్లు' జూన్ 12న విడుదల కానుంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే 'మాట వినాలి', 'కొల్లగొట్టినాదిరో' పాటలు విడుదల కాగా సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రెండ్ అవుతున్నాయి. తాజాగా మూడో పాటను విడుదల చేయటానికి చిత్ర యూనిట్ సిద్ధమవుతోంది. అదేరోజు ట్రైలర్ కూడా విడుదల చేయబోతున్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తికాగా నిర్మాణాంతర కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వీఎఫ్ఎక్స్, సౌండ్ డిజైన్, డబ్బింగ్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయి. వాటికి తుదిమెరుగులు దిద్దుతున్నారు. దర్శకుడు ఎంఎం జ్యోతికృష్ణ ఈ సినిమా కోసం కొన్ని నెలలుగా కృషిచేస్తున్నారు. ఎంఎం కీరవాణి సంగీతం, మనోజ్ పరమహంస కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కళా దర్శకుడు తోట తరణి అద్భుతమైన సెట్‌లను రూపొందించారు. చారిత్రాత్మక యోధుడు వీరమల్లు పాత్రలో పవన్‌కళ్యాణ్, మొఘల్ చక్రవర్తిగా బాబీ డియోల్ నటిస్తున్నారు. సత్యరాజ్, జిషు సేన్ గుప్తా కీలకపాత్రలు పోషిస్తున్నారు.

క్రికెట్‌ని మించి..




రామ్ చరణ్‌తో 'పెద్ది' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న బుచ్చిబాబు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సినిమా విశేషాలు పంచుకున్నారు. 'అందరూ 'పెద్ది' మూవీలో క్రికెట్ మాత్రమే ఉంటుందని అనుకుంటున్నారు. కానీ క్రికెట్‌ను మించి సినిమాలో ఎమోషన్ చాలా ఉంటుంది. అదే మూవీకి అతిపెద్ద ప్లస్ పాయింట్. దాన్ని బేస్ చేసుకునే సీన్లు ఉంటాయి. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఈ మూవీ షూటింగ్ ఎక్కువగా జరుగుతోంది. ఇప్పటి వరకు మీరు ఎవరూ చూడని పాత్రలో రామ్ చరణ్ కనిపిస్తారు. పాత్ర కోసం ఆయన చాలా మారిపోయారు. లుక్ విషయంలో కూడా జాగ్రత్త పడుతున్నారు' అన్నారు.

వరుసగా కామిక్ వీడియోలు

మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం నుండి వరుసగా కామిక్ వీడియోలు రిలీజ్ అవుతున్నాయి. ప్రమోషన్లలో భాగంగా చిత్రబృందం ఈ వీడియోలను రిలీజ్ చేస్తోంది. ఇప్పటికే రెండు వీడియోలను రిలీజ్ చేసిన మూవీ టీమ్.. తాజాగా ఫైనల్ వీడియోను విడుదలచేసింది. ఇందులో తిన్నడు మార్పును ప్రధానంగా హైలెట్ చేస్తూ చూపించారు. ఈ కామిక్ వీడియోలను కార్టూన్ టైప్‌లో రిలీజ్ చేస్తున్నారు. కొన్ని పాత్రలను కూడా ఈ కార్టూన్ స్టైల్‌లో చూపిస్తున్నారు. జూన్ 27న రిలీజ్ అవుతున్న ఈ చిత్రం నుండి త్వరలో ట్రైలర్ విడుదలవుతోంది. ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్షన్‌లో వస్తున్న ఈ సినిమాలో ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా చేస్తున్నారు.



'కింగ్'లో రాణీ ముఖర్జీ



షారుఖ్ ఖాన్, రాణీ ముఖర్జీ మరోసారి వెండితెరపై కలిసి సందడి చేయనున్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో షారుఖ్ ఓ సినిమా చేయనున్నారు. 'కింగ్' అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రం మే 20 నుంచి షూటింగ్ ప్రారంభించబోతున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌లో షారుఖ్‌కి జోడిగా రాణీ ముఖర్జీ నటించబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వీరిద్దరూ కలిసి 'కుచ్ కుచ్ హోతా హై', 'కభీ ఖుషీ కభీ గమ్', 'కభీ అల్విదా నా కెహనా' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల్లో నటించి మెప్పించారు. ఈ సినిమాలో రాణీ ముఖర్జీ షారుఖ్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ తల్లి పాత్రను పోషించనున్నారు. ఈ పాత్ర సినిమా కథలో ఒక కీలకమైన మలుపు తిప్పుతుందని తెలుస్తోంది. ఈ సినిమాలో షారుఖ్ ఖాన్ ఒక కిల్లర్ పాత్రలో కనిపించనున్నారు. అభిషేక్ బచ్చన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ చిత్రం 2026 అక్టోబర్ లేక డిసెంబర్ మధ్య విడుదలయ్యే అవకాశం ఉంది.

30న 'కరాటే కిడ్ : లెజెండ్స్' విడుదల



బాలీవుడ్ హీరో అజయ్ దేవ్‌గన్ తన కుమారుడు యుగ్‌దేవ్‌గన్‌తో కలిసి ముంబైలో జరిగిన ఒక గ్రాండ్ ఈవెంట్‌లో సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్మెంట్ ఇండియా నిర్మించిన 'కరాటే కిడ్: లెజెండ్స్' హిందీ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇది తొలిసారి తండ్రీ–కొడుకులు కలిసి ఓ అంతర్జాతీయ ప్రాజెక్ట్‌లో పని చేయడం కావడం స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఈ చిత్రంలో అజయ్‌దేవ్‌గన్ హాలీవుడ్ లెజెండ్ జాకీచాన్ పోషించిన మిస్టర్ హాన్‌పాత్రకు హిందీలో తనగొంతునిచ్చారు. తన పాత్రకు డబ్బింగ్ చెప్పటంతోపాటుగా యుగ్‌దేవ్‌గన్ కథానాయకుడు లీ ఫాంగ్ (బెన్ వాంగ్ నటించిన పాత్ర)కు డబ్బింగ్ చేశారు. ఈ సినిమా కథలో గురువు–శిష్య బంధం ప్రధానాంశంగా ఉండగా, ఆ బంధం వెనుక నిజ జీవిత తండ్రీ–కొడుకుల కెమిస్ట్రీ ఉండడం ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమా ఈనెల 30న విడుదల కానుంది.

నేటినుంచి ఐపిఎల్ పునఃప్రారంభం

- చిన్నస్వామి స్టేడియంలో బెంగళూరు–కోల్‌కతా మ్యాచ్
- పొంచివున్న వర్షం ముప్పు
- రాత్రి 7.30గం॥లకు



ముంబయి: ఐపిఎల్ 18వ సీజన్ శనివారం నుంచి పునఃప్రారంభం కానుంది. చిన్నస్వామి స్టేడియంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు–కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరిగే పోటీతో తిరిగి ఐపిఎల్ ప్రారంభం కానుంది. విదేశీ క్రికెటర్లు కొందరు టోర్నీకి దూరమైనా.. ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న ఫ్రాంచైజీల విదేశీల ఆటగాళ్లు సైతం తిరిగి వచ్చారు. లీగ్ దశ మ్యాచ్‌లో చివరి దశకు వచ్చిన నేపథ్యంలో ఇకపై జరిగే ప్రతి మ్యాచ్ హోరాహోరీగా సాగనుంది. తొలి టైటిల్ కలను సాకారం చేసుకోవాలనుకుంటున్న ఆర్సీబీ.. కోల్‌కతాపై విజయం సాధిస్తే నాకౌట్ పోరుకు దూసుకెళ్లుతుంది. టేబుల్ టాపర్ గుజారత్ టైటాన్స్ కూడా ఒక్క అడుగు దూరంలో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలిస్తే శుభ్‌మన్ గిల్ సేన బెర్తు ఖరారు చేసుకుంటుంది. మరి మిగతా రెండు జట్లు ఏవి? అనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది. లీగ్ దశలో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో బెంగళూరు జట్టు ఏడు వికెట్ల తేడాతో కోల్‌కతాపై ఘన విజయం సాధించింది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ రద్దుతో లీగ్‌ను అర్థాంతంగా నిలిపివేసిన బిసిసిఐ.. ఆ మ్యాచ్‌ను తిరిగి ప్రారంభం నుంచి నిర్వహిస్తామని ఇప్పటికే ప్రకటించింది.

ఎనిమిదేసి విజయాలతో..

మే 8న ఐపిఎల్ మ్యాచ్‌లు నిలిచేనాటికి గుజరాత్, బెంగళూరు జట్లు తలా ఎనిమిదేసి విజయాలతో సహా 16పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాయి. పంజాబ్ జట్టు 11 మ్యాచ్‌లు ముగిసేసరికి 15పాయింట్లతో 3వ స్థానంలో నిలువగా.. ముంబయి(14పాయింట్లు), ఢిల్లీ(13), కోల్‌కతా(11), లక్నో(10) పాయింట్లతో ప్లే–ఆఫ్స్‌లో బెర్త్‌కోసం రేసులో ఉన్నాయి. చివరి మూడు మ్యాచుల్లో నెగ్గితేనే లక్నో సైతం ప్లే–ఆఫ్స్‌కు చేరనుంది. ఇక సన్‌రైజర్స్, రాజస్తాన్, చెన్నై సూపర్‌కింగ్స్ జట్లు ప్లే–ఆఫ్స్ రేసునుంచి ఇప్పటికే నిష్క్రమించాయి.

ప్రతి మ్యాచ్ కీలకమే...

గుజరాత్, బెంగళూరు, పంజాబ్‌లకు ఇంకా మూడు లీగ్ మ్యాచ్‌లుండగా.. ముంబయికి మాత్రం రెండే మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. వాటిలో ఒక్కటి ఓడినా.. ఆ జట్టు ప్లే ఆఫ్స్ ఆడే అవకాశాలు తగ్గిపోతాయి. ఇక ఢిల్లీ క్యాపిటల్స్, ఢిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా, లక్నో సూపర్ జెయింట్స్ కూడా ప్లే ఆఫ్స్ చేరాలనే కసితో ఉన్నాయి. కానీ, ఇప్పటికే 12 మ్యాచులు ఆడిన ముంబయి జట్టు తదుపరి రెండు మ్యాచుల్లో గెలిస్తేనే ప్లే–ఆఫ్స్ బెర్త్ ఖాయం కానుంది. ముంబయి ఒక మ్యాచ్‌లో గెలిచి మరో మ్యాచ్‌లో ఓడితే మాత్రం 16పాయింట్లతో ఇతర జట్ల పాయింట్లు, రన్‌రేటే మీద ఆధారపడాల్సి వస్తుంది. రిషభ్ పంత్ సారథ్యంలోని లక్నో, అక్షర్ పటేల్ కెప్టెన్సీలోని ఢిల్లీ ఇంకా మూడేసి మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ప్లే–ఆఫ్స్‌కు చేరాలంటే లక్నో తప్పనిసరిగా మూడు మ్యాచుల్లో, ఢిల్లీ కనీసం రెండు మ్యాచుల్లోనైనా గెలవాల్సి ఉంటుంది. 12మ్యాచ్‌లు ముగిసేసరికి కోల్‌కతా 11పాయింట్లతో 6వ స్థానంలో ఉంది. చివరి రెండు మ్యాచుల్లో ఆ జట్టు గెలిస్తే.. సమీకరణలు కలిసొస్తేనే ఆ జట్టు ప్లే–ఆఫ్స్ రేసులో నిలువనుంది. దీంతో నేటినుంచి తిరిగి ప్రారంభమయ్యే చివరి లీగ్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగడం ఖాయం.

పొంచివున్న వానముప్పు

పునఃప్రారంభ ఐపిఎల్ తొలి మ్యాచ్‌కు వానముప్పు పొంచి వుంది. ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించ వచ్చని బెంగళూరు వాతావరణశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. గత రెండు రోజులుగా బెంగళూరులో వాతావరణం మేఘావృతమై ఉందని, శనివారం ఉదయం ఉష్ణోగ్రత 21 నుంచి 30 డిగ్రీల సెల్సియస్, మధ్యాహ్నం, సాయంత్రం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే ఛాన్స్ ఉన్నట్లు వెల్లడించింది. అదే జరిగితే ప్లే ఆఫ్స్ రేసుకు ఒక్క విజయం దూరంలో ఉన్న ఆర్సీబీకి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లే. వర్షంతో మ్యాచ్ నిలిస్తే.. ఇరుజట్లకు ఒక్కో పాయింట్ కేటాయిస్తారు. అప్పుడు బెంగళూరు 17 పాయింట్లతో ప్లే ఆఫ్స్ బెర్త్ ఖాయం చేసుకోదు. దీంతో మే 23న సన్‌రైజర్స్ హైదరాబాద్, మే 27న లక్నో సూపర్ జెయింట్స్‌పై కచ్చితంగా గెలిచి తీరాల్సి ఉంటుంది.

సంపాదనలో టాప్‌లో రొనాల్డో

ఫోర్బ్స్ జాబితాలో వరుసగా మూడోసారి



లండన్: స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో వయసుతో సంబంధం లేకుండా తన ఆటతీరు, బ్రాండ్ విలువ, ఆదాయంలో అగ్రస్థానంలో నిలిచాడు. ఫోర్బ్స్ 2025 జాబితాలో మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించుకున్నారు. ఫోర్బ్స్ తాజాగా వెల్లడించిన అత్యధిక సంపాదన కలిగిన ఆటగాళ్ల జాబితాలో రొనాల్డో వరుసగా మూడోసారి అత్యధిక సంపాదన సాధించిన ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలోనే ఫోర్బ్స్‌లో ఐదోసారి టాప్‌లో నిలిచి రికార్డు నెలకొల్పాడు. 40ఏళ్ల రొనాల్డో 2025 నాటికి భారత కరెన్సీలో రూ.2,356 కోట్లు(275 మిలియన్ డాలర్లు) సంపాదించాడు. ఇది ఫోర్బ్స్ చరిత్రలో ఏకైక అథ్లెట్‌గా మూడో అత్యధిక వార్షిక ఆదాయంగా నిలిచింది. సౌదీ ప్రొ లీగ్‌లో అల్-నసర్ -క్లబ్‌తో అతని వార్షిక ఆదాయం రూ.1,600 కోట్లు సంపాదించాడు. అలాగే నైక్, హెర్బలైఫ్, బైనాన్స్ వంటి బ్రాండ్లతో పాటు, తన స్వంత బ్రాండ్ సిఆర్–7 హోటల్స్, పరిమళాలు, జిమ్స్ వంటి వ్యాపారాలు కూడా ఉన్నాయి. సోషల్ మీడియా ద్వారా కూడా ఆయనకు భారీ ఆదాయం లభించింది. ఈ క్రమంలో రెండో స్థానంలో ఉన్న స్టీఫెన్ కర్రీ ఆదాయం రూ.1,334కోట్లు (156 మిలియన్ డాలర్లు) రెండో స్థానంలో ఉన్నాడు.

2025 ఫోర్బ్స్ జాబితా టాప్–5 ఆటగాళ్లు..

స్థానం ఆటగాడు	క్రీడాంశం	ఆదాయం(భారత కరెన్సీలో)
1. క్రిస్టియానో రొనాల్డో	ఫుట్‌బాల్	రూ.2,356కోట్లు
2. స్టీఫెన్ కర్రీ	బాస్కెట్‌బాల్	రూ.1,334కోట్లు
3. టైసన్ ఫ్యూరీ	బాక్సింగ్	రూ.1,245కోట్లు
4. డాక్ ప్రిస్కాట్	అమెరికన్ ఫుట్‌బాల్	రూ.1,170కోట్లు
5. లియోనెల్ మెస్సి	ఫుట్‌బాల్	రూ.1,154కోట్లు

ఇండియా-ఎ జట్టు కెప్టెన్‌గా అభిమన్యు ఈశ్వరన్



ముంబయి: ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌కు ముందు భారత యువ జట్టుకు సదవకాశం దక్కింది. ఈ సిరీస్‌కు ముందు భారత్–ఎ మూడు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లను ఆడనుంది. భారత్–ఎ జట్టుకు కెప్టెన్‌గా అభిమన్యు ఈశ్వరన్ ఎంపికయ్యాడు. మే 30న కాంటెన్‌బర్రీ భారత్–ఎ, ఇంగ్లండ్ లయన్స్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. జూన్ 16 మూడో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ముగియనుంది. టీమిండియా ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ ఐపిఎల్ ముగిసిన తర్వాత రెండో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ నుంచి ఇండియా–ఎ జట్టుతో కలవనున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68